ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం
సోమవారం 12, ఆగస్టు 2024


మంత్రికి పీఈటీలు, క్రీడాసంఘాల ప్రతినిధులు ఫిర్యాదు


క్రీడా మంత్రిని కలిసిన ప్రభుత్వ వ్యాయామోపాధ్యాయులు

జిల్లాలోని కొన్ని క్రీడాసంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ వ్యాయామోపాధ్యాయులు, పలువురు క్రీడాకారులు ఆదివారం విజయవాడ వెళ్లి రాష్ట్ర సాంస్కృతిక, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ పేరుతో సాగుతున్న అక్రమాలు, బోగస్ సర్టిఫికెట్ల వ్యవహారాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బోగస్ సర్టిఫికెట్‌ల జారీతో అర్హులైన పలువురు నిరుద్యోగులు అర్హత కోల్పోతున్నారని విన్నవించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ బోగస్ క్రీడా సర్టిఫికెట్ల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నట్లు ఇప్పటికే తనకు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశిస్తామన్నారు. ఎవరినీ వదిలేది లేదని స్పష్టం చేశారు. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగే కేబినెట్ సమావేశంలో ఈ అంశాన్ని ఆయన దృష్టికి కూడా తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు.

కదులుతున్న బోగస్ డొంక!

సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ పేరుతో బోగస్ క్రీడా ధ్రువీకరణ పత్రాల డొంక కదులుతోంది. దీనిపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'సాఫ్ట్‌గా దొంగాట' శీర్షికన ప్రచురితమైన కథనం ప్రకంపనలు సృష్టిస్తోంది. అసోసియేషన్ ప్రతినిధులు, ఆ సర్టిఫికెట్‌ల ద్వారా పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్న వారిలో వణుకు మొదలైంది. ఎంబీబీఎస్‌లో చేరే వారికే అత్యధికంగా 150 సర్టిఫికెట్లు విక్రయించినట్లు తెలుస్తోంది. అందుకు సంబంధించి సంఘప్రతినిధిగా ఉన్న ఓ ప్రభుత్వ పీఈటీ ఒక్కొక్కరి వద్ద రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలోని క్రీడాసంఘాలు, పీఈటీ సంఘ నాయకులు ఆదివారం విజయవాడ వెళ్లి క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.



దొంగ క్రీడా సర్టిఫికెట్‌లతో ప్రభుత్వ శాఖల్లో పలువురు తిష్ట

సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ద్వారా జారీ

రూ.లక్షలు దండుకున్న పీఈటీ

ఎంబీబీఎస్‌లో చేరే వారికీ అధికంగా విక్రయం

కలెక్టర్ ఆదేశాలతో ఇప్పటికే ప్రారంభమైన విచారణ

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 11 : క్రీడా సంఘం పేరుతో ఓ వ్యాయామోపాధ్యాయుడు బోగస్ సర్టిఫికెట్ల బాగోతానికి తెరతీశాడు. అందిన కాడికి దండుకున్నాడు. పదేళ్లలో మొత్తం 300 వరకూ సర్టిఫికెట్లు జారీ చేశాడు. అందులో సుమారు 150 వరకూ వైద్య విద్యార్థులకు అమ్మినట్లు తెలుస్తోంది. వాటిని సమర్పించి స్పోర్ట్ కోటాలో పలువురు ఎంబీబీఎస్ సీట్లు పొందారు. మరికొందరు ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిపోయారు. ఇంతకాలం గుట్టుచప్పుడు కాకుండా సాగిన ఈ వ్యవహారం ఇప్పుడు బహిర్గతమైంది. దీనిపై ప్రభుత్వ పీఈటీలతోపాటు పలు క్రీడా సంఘాలు నిరసనలు చేపట్టాయి. కలెక్టర్ అన్సారియాను కలిసి వినతి పత్రాలు కూడా సమర్పించాయి. దీనిపై స్పందించిన ఆమె ఆదేశాల మేరకు భూసేకరణ కలెక్టర్ ఝాన్సీరాణి విచారణ చేపట్టారు. అందులో అవాక్కయ్యే అనేక నిజాలు వెలుగు చూసినట్లు తెలుస్తోంది.

నిబంధనలు తూచ్!

లోధా కమిటీ నిబంధనల మేరకు క్రీడాసంఘంలో ఏదైనా పదవిలో ఒకరు నాలుగు సంవత్సరాలు మాత్రమే ఉండాలి. వారు ప్రభుత్వ ఉద్యోగి అయితే ఆయన కానీ, వారి కుటుంబ సభ్యులు కానీ ఒకసారికి మించి కమిటీలో ఉండకూడదు. అయితే బోగస్ ధ్రువీకరణ పత్రాల మంజూరులో కీలకంగా వ్యవహరించిన దర్శి గురుకుల పాఠశాలలో పనిచేసే పీఈటీ 1999 నుంచి 2018 సంవత్సరం వరకూ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధిగా కొనసాగారు. అనంతరం కొన్ని సంవత్సరాలు ఆయన కుటుంబ సభ్యులు ప్రతినిధులుగా వ్యవహరించారు. ప్రస్తుతం మళ్లీ ఆయనే అసోసియేషన్‌లో కీలక పదవిలో ఉన్నారు. అంతేకాకుండా పలు క్రీడా సంఘాలను ఏర్పాటు చేశారు. పోటీలు పెట్టకుండానే నిర్వహించినట్లు చూపి క్రీడా సర్టిఫికెట్లు అమ్ముకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పోటీలు నిర్వహించకుండానే సర్టిఫికెట్లు

సాఫ్ట్‌బాల్ అంతర్‌జోన్ స్థాయి క్రీడా పోటీలకు దేశంలోని ఏరాష్ట్రంలోనూ సర్టిఫికెట్‌కు అర్హత లేదు. కానీ మన రాష్ట్రంలో మాత్రం సాఫ్ట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో అంతర్‌జోన్ పోటీలు నిర్వహించినట్లు చూపి పోటీల్లో పాల్గొనని వారికి కూడా సర్టిఫికెట్‌లు అమ్ముకున్నారు. వాటితో పలువురు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులుగా, కొందరు ఎంబీబీఎస్ విద్యకు ఉపయోగించుకుని ప్రయోజనాలు పొందినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ అధికారులెవ్వరూ బోగస్ ధ్రువీకరణ పత్రాలపై పెద్దగా దృష్టిసారించకపోవడంతో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్‌లో 'మూడు బోగస్‌లు, రూ.ఆరు లక్షలు అన్న చందంగా' సర్టిఫికెట్ల బాగోతం కొనసాగింది.

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు, ఎంబీబీఎస్ సీట్లు

ఎంతో మంది విద్యార్థులకు వైద్యుడు కావాలనేది కల. ఎంబీబీఎస్ సీటు రావాలంటే కష్టపడి చదవాలి, అందుకోసం కొందరు విద్యార్థులు కొన్ని సంవత్సరాలుగా శిక్షణ తీసుకుని నీట్ పరీక్ష రాస్తుంటారు. అయితే క్రీడా సర్టిఫికెట్ ఉంటే నీట్‌లో పొందిన మార్కులకు అదనంగా స్పోర్ట్స్ కోటా కింద 2 శాతం మార్కులు కలుస్తాయి. దీని ఆధారంగా తొలిసారే ఎంబీబీఎస్ సీటు సాధించే అవకాశం ఉంటుంది. దాన్ని ఆసరా చేసుకొని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే సుమారు 150కి పైగా సర్టిఫికెట్‌లు జారీ చేశారు. వారు క్రీడలు ఆడకపోయినా డబ్బులు తీసుకొని అసోసియేషన్ ప్రతినిధులు ఇచ్చేశారు. వీటిని పొందిన కొందరు ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రభుత్వ వైద్యశాలల్లో డాక్టర్లుగా కొనసాగుతున్నారు. అసోసియేషన్ ప్రతినిధిగా ఉన్న పీఈటీ కుమారుడు, కుమార్తె ఇదే తరహా సర్టిఫికెట్లు పొంది ఎంబీబీఎస్ పూర్తి చేసి డాక్టర్లుగా పనిచేస్తున్నట్లు సమాచారం. ఆయనకు సమీప బంధువులుగా ఉన్న మరో ఇద్దరు ప్రస్తుతం ఇవే సర్టిఫికెట్‌లతో ఎంబీబీఎస్ చదువుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అర్హులైన విద్యార్థులు కష్టపడి చదివినా కనీసం సీటు సాధించని పరిస్థితులు కనిపిస్తుండగా, బోగస్ సర్టిఫికెట్‌లతో అతి సులువుగా దొడ్డిదారిన కొందరు ఎంబీబీఎస్ సీట్లు సాధించారన్న విషయం అర్థమవుతుంది. వీరితోపాటు కొందరు దొంగ సర్టిఫికెట్లతో సచివాలయాలు, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ బోగస్ సర్టిఫికెట్ల బాగోతం జిల్లాకే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లోనూ సాఫ్ట్‌బాల్ సంఘ ప్రతినిధుల ఆధ్వర్యంలో నడిచినట్లు తెలుస్తోంది.

ఆయుధాగారాన్ని పరిశీలించిన ఎస్పీ

అధికారులకు పలు సూచనలు

ఒంగోలు (క్రైం), ఆగస్టు 11 : జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆయుధాగారాన్ని ఎస్పీ దామోదర్ ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. సిబ్బంది విశ్రాంతి తీసుకునే బ్యారక్‌లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్‌బీ సీఐ రాఘవేంద్ర, డీసీఆర్‌బీ సీఐ భీమానాయక్, ఆర్ఐ రమేష్ కృష్ణన్ ఉన్నారు.


ఆయుధాలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

ఎట్టకేలకు సర్దుబాటు



విద్యార్థుల సంఖ్య ప్రామాణికంగా ప్రక్రియ

టీచర్లకు మండల, డివిజన్, జిల్లా స్థాయిలో నిర్వహణ

14లోపు పూర్తి చేయాలని పాఠశాల విద్య కమిషనర్ ఆదేశం

ఒంగోలు (విద్య), ఆగస్టు 11 : ఉపాధ్యాయుల సర్దుబాటుకు రంగం సిద్ధమైంది. పిల్లలు తక్కువగా ఉండి పూర్తిస్థాయి పనిభారం లేని టీచర్లను అవసరమున్న ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేసే ప్రక్రియ కొద్ది రోజుల్లో ప్రారంభంకానుంది. అందుకు సంబంధించిన మార్గదర్శకాలను పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు విడుదల చేశారు. ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మునిసిపల్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో టీచర్ల సర్దుబాటు నిర్వహిస్తారు. గతంలో ఏ యజమాన్యంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను అదే స్కూళ్లకు సర్దుబాటు చేసేవారు. ప్రస్తుతం మండల, డివిజన్, జిల్లా యూనిట్‌గా నాలుగు యాజమాన్యాల్లోని పాఠశాలలకు ఈ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఇతర యజమాన్యాల పాఠశాలలకు కూడా టీచర్లను కేటాయిస్తారు. స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లను సర్దుబాటు చేస్తారు. సోమవారం నాటికి పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్య యుడైస్ డేటా ఆధారంగా ఆయా పాఠశాలల్లో మిగులు టీచర్లను గుర్తిస్తారు. పాఠశాలల్లో గతనెల జూలై 31 నాటికి ఉన్న వాటినే ఖాళీ చూపిస్తారు. సర్దుబాటుకు 117 జీవోలోని విధి విధానాలనే పాటించాలని కమిషనర్ సూచించారు. ఈ ప్రక్రియను ఈనెల 14లోపు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

ప్రాధాన్యతలు ఇవీ..

టీచర్ల సర్దుబాటు ప్రాధాన్యతలను కమిషనర్ తన మార్గదర్శకాల్లో వివరించారు. హైస్కూళ్లలో అన్ని సబ్జెక్టులకు కొరత లేకుండా ఉంచేందుకు తొలి ప్రాధాన్యం ఇచ్చారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 98 మందికి తక్కువ విద్యార్థులుంటే 1, 2 తరగతులకు వేరుగా.. 3 నుంచి 8 తరగతులకు వేరుగా టీచర్లను కేటాయించనున్నారు. అన్ని పాఠశాలలకు ఎస్‌జీటీలను సర్దుబాటు చేయగా ఇంకా మిగిలితే వారిని ఏకోపాధ్యాయ స్కూళ్లకు పంపుతారు.

నేడు జాబితాలు సిద్ధం

హైస్కూళ్లలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా స్కూలు అసిస్టెంట్లు లేకపోవడంతో సబ్జెక్టు టీచర్ల కొరత ఎక్కువగా ఉంది. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య దారుణంగా పడిపోవడంతో వేలసంఖ్యలో సెకండరీ గ్రేడ్ టీచర్లు మిగులుగా ఉన్నారు. రాష్ట్రంలో సబ్జెక్టు టీచర్లు 17వేలకుపైగా అవసరం కాగా కేవలం 8వేల మంది సబ్జెక్టు టీచర్లు మాత్రమే మిగులుగా తేలుతున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 20వేలకుపైగా సెకండరీ గ్రేడ్ టీచర్లు మిగులుగా తేలుతుండగా కేవలం ఐదువేల మంది ఎస్‌జీటీలు మాత్రమే అవసరం ఉంది. మునిసిపల్ హైస్కూళ్లలో కూడా టీచర్ల కొరత ఉంది. సోమవారం సాయంత్రానికి సర్దుబాటుకు సంబంధించిన జాబితాలను సిద్ధం చేయనున్నారు.

వీరికి మినహాయింపు

2025 ఏప్రిల్ 30లోపు ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయులను పనిసర్దుబాటు నుంచి తొలగించారు. 100శాతం అంధత్వం ఉన్న టీచర్లను కూడా మినహాయించారు. హైస్కూల్ ప్లస్ ఇంటర్ ఉన్న పాఠశాలలను సర్దుబాటు ప్రక్రియ నుంచి తప్పించారు. వితంతువులు, అవివాహితులు, చట్టబద్ధంగా విడాకులు తీసుకున్న మహిళా టీచర్లు, స్పౌజ్ ఉన్నవారికి కూడా మినహాయింపు ఇచ్చారు. ఒకవేళ వీరు బదిలీ కోరుకుంటే వారిని సర్దుబాటుకు అనుమతించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను ప్లెయిన్ ఏరియాలకు సర్దుబాటు చేయవద్దన్నారు.

మూడు దశల్లో ప్రక్రియ

మిగులు టీచర్లకు మూడు దశల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సర్దుబాటు చేయనున్నారు. మొదటి దశలో ఎంఈవో మండల నోడల్ అధికారిగా ప్రక్రియ నిర్వహిస్తారు. ఇది కమిషనర్ కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో వచ్చే సీనియారిటీ జాబితా ప్రకారం జరుగుతుంది. మండలంలో టీచర్లు అవసరమున్న పాఠశాలలను గుర్తిస్తారు. వాటికి మిగులు ఉపాధ్యాయులను కేటాయిస్తారు. మండల స్థాయిలో పూర్తయిన తర్వాత మిగిలిన టీచర్లు డివిజన్ స్థాయి సర్దుబాటుకు హాజరుకావాలి. అక్కడ ఉప విద్యాధికారి ఈ ప్రక్రియను చేపడతారు. అనంతరం మిగిలిపోయిన టీచర్లు జిల్లా స్థాయిలో జరిగే సర్దుబాటుకు హాజరుకావాలి. జిల్లాస్థాయిలో డీఈవో నిర్వహిస్తారు. టీచర్ల సర్దుబాటులో ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలను కూడా ఎస్‌జీటీలుగానే పరిగణిస్తారు.

మళ్లీ ఓటర్ల జాబితా సవరణ

20నుంచి ప్రక్రియ ప్రారంభం

జనవరి 6న తుది జాబితా



ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 11 : ఓటర్ల జాబితా సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. తదనుగుణంగా జిల్లాలో ఆ ప్రక్రియను చేపట్టేందుకు అవసరమైన చర్యలను అధికార యంత్రాంగం తీసుకుంటోంది. ఈనెల 20నుంచి ఇంటింటి సర్వేతో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. వచ్చే ఏడాది జనవరి 6తో ముగియనుంది. వచ్చే ఏడాది జనవరి 1నాటికి 18 ఏళ్లు నిండే యువత కూడా కొత్త ఓటరుగా నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. బూత్‌లెవల్ అధికారులు (బీఎల్వో)లు ఇంటింటికీ వెళ్లి పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, తప్పుల సవరణ వంటి కార్యక్రమాలు చేపట్టి అక్టోబరు 18వతేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో 1,500 మంది ఓటర్లు మించకుండా అవసరమైన చోట్ల రేషనలైజేషన్ చేసేలా ఈసీ మార్గదర్శకాలు జారీ చేసింది. ఒకే చిరునామాపై ఎక్కువ ఓట్లు, జీరో ఇంటి నంబర్లతో ఉన్న వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అక్టోబరు 29వతేదీన ముసాయిదా జాబితాలను ప్రకటిస్తారు. దానిపై సవరణలు, అభ్యంతరాలను నవంబరు 28 వరకూ స్వీకరిస్తారు. డిసెంబరు 24లోపు అభ్యంతరాలను పరిష్కరిస్తారు. జనవరి 6వతేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు.

భూ బాధల నుంచి విముక్తి

90 రోజుల్లో సమస్య పరిష్కారం

దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం

45 రోజులు గ్రామ రెవెన్యూ సదస్సులు

16నుంచి నిర్వహణ

మండలం యూనిట్‌గా షెడ్యూల్

గత వైసీపీ పాలనలో భారీగా ఆక్రమణలు, అక్రమాలు

ప్రస్తుత సర్కారు నిర్ణయంపై బాధితుల్లో విశ్వాసం

ఒంగోలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పేరుకుపోయిన భూ సమస్యల పరిష్కారానికి చంద్రబాబు సర్కారు నడుం బిగించింది. అందుకోసం 90 రోజుల కాలవ్యవధితో నిర్దిష్ట కార్యాచరణను చేపట్టింది. ఈనెల 15వ తేదీన లాంఛనంగా కార్యక్రమం ప్రారంభమవుతుంది. 16 నుంచి 45 రోజులపాటు గ్రామాల్లో అధికారులు సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. ఆతర్వాత 45 రోజుల్లో సమస్య పరిష్కరించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది.

రెండు నెలలకే భూ సమస్యలపై ప్రభుత్వం దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే భూ సమస్యలపై దృష్టిపెట్టడం ప్రజలకు ఊరట కలిగిస్తోంది. ప్రజల వద్దకు పాలన తరహాలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం 90 రోజులపాటు సాగనుంది. మండలం యూనిట్‌గా గ్రామాల వారీ నిర్వహించే సదస్సులకు తహసీల్దార్లు నేతృత్వం వహిస్తారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ దేవదాయ, వక్ఫ్, అటవీ తదితర శాఖల అధికారులు హాజరవుతారు. 2019కి ముందు భూస్థితి, ప్రస్తుత స్థితిని వారు పరిశీలించడంతో పాటు రికార్డులు అందుబాటులో ఉంచుతారు. అలా నిర్వహించే సదస్సుల్లో వచ్చే వినతులను మ్యుటేషన్, కౌలు రైతు కార్డులు, భూ వివాదాలు, భూ ఆక్రమణలు, 22(ఏ) గోల్‌మాల్ తదితరాలను రిజిస్టర్లలో నమోదు చేయనున్నారు. అనంతరం వాటిని 45 రోజుల్లోపు పరిష్కరించనున్నారు. ఈ కార్యక్రమం వలన క్షేత్రస్థాయిలో జరిగిన అక్రమాలు వెలుగు చూడనున్నాయి.

వైసీపీ పాలనలో పెద్దఎత్తున భూదందాలు

గత వైసీపీ పాలనలో ఇటు రాష్ట్రంలో, ఇటు జిల్లాలో పెద్దఎత్తున భూదందాలు సాగాయి. తమకు అనుకూలంగా ఉండే అధికారులు, సిబ్బందిని నియామకం చేయించుకొని వారి అండదండలతో అనేక భూ మాయలు చేశారు. ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, దర్శి సింగరాయకొండ, ఎర్రగొండపాలెం వంటి పట్టణాలలో విలువైన ప్రభుత్వ భూములు, వివాదాలలో ఉన్న స్థలాలను తమకు అనుకూలంగా రాయించుకున్నారు. మార్కాపురం మండలంలో భూఅక్రమాలకు అండగా నిలిచిన 11 మంది వీఆర్వోలు, ఇతర రెవెన్యూ సిబ్బందిపై వేటుపడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పట్టింది. ఒంగోలులో ఉన్నతాధికారులు వేసిన సిట్‌కు వందలాది మంది బాధితులు అర్జీలు అందజేశారు. ఇదే పరిస్థితి జిల్లా అంతటా సాగింది. చాలా చోట్ల రెవెన్యూ రికార్డులను తారుమారుచేసి ఆభూములను వైసీపీ నేతలు ఆక్రమించుకొని అసలు హక్కుదారులకు చుక్కలు చూపించారు. ఇక 22(ఏ)లో ప్రైవేటు భూములను చేర్పించడం, అనేక మందిని వేధించడం, తమకు అనుకూలంగా ఉన్న భూములను 22(ఏ) నుంచి తప్పించి వారి పేర్లపై రాయించుకోవడం చేశారు. వందల కోట్ల విలువైన భూములు ఇలా సొంతం చేసుకున్నారు. అలాగే రీ సర్వే జరిగిన గ్రామాల్లో అధికారులు హడావుడిగా చేసిన ప్రక్రియతో వందలాది సమస్యలు వచ్చాయి.



యంత్రాంగం కసరత్తు

ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో గ్రామ రెవెన్యూ సదస్సుల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈనెల 15న లాంఛనంగా ప్రారంభంకానున్న ఈ కార్యక్రమ నిర్వహణలో కీలకమైన గ్రామ సదస్సుల షెడ్యూల్‌ను ఈనెల 13వ తేదీ లోపు ఖరారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మండలం యూనిట్‌గా షెడ్యూల్ రూపొందించాల్సి ఉండటంలో తహసీల్దార్లు దానిపై దృష్టి సారించారు. సోమవారం కలెక్టర్, జేసీ ఇతర అధికారులు దీనిపై కిందిస్థాయి అధికారులకు సూచనలు చేసే అవకాశం ఉంది.

టీడీపీలో చేరిన వైసీసీ కార్పొరేటర్ శైలజ



ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంటకు బొకే ఇస్తున్న శైలజ దంపతులు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 11: ఒంగోలు నగరంలో వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. ఇప్పటికే పలువురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ కండువా కప్పుకోగా, ఆదివారం 24వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ, ఆమె భర్త హరిబాబు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఒంగోలులోని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

పోలేరమ్మ ఆలయంలో మంత్రి పూజలు

- పాల్గొన్న దామచర్ల సత్య, పూర్ణచంద్రరావు



ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి స్వామి

కొండపి, ఆగస్టు 11 : మండలంలోని చినవెంకన్నపాలెంలో పోలేరమ్మ పొంగళ్ల సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య, సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోటు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా శ్రీహర్షిణిలో క్రీడా సంబరాలు



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న రవికుమార్, అతిథులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 11 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలులోని శ్రీహర్షిణి జూనియర్ కళాశాలలో ఆదివారం క్రీడా సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఆటల పోటీలను శ్రీహర్షిణి విద్యాసంస్థల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని చెప్పారు. క్రీడాసంబరాల్లో భాగంగా తొలిరోజు బాలబాలికలకు ఖోఖో, టగ్ ఆఫ్ వార్, టెన్నికాయిట్, మ్యూజికల్‌చైర్, స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లోని విజేతలను అభినందించారు. కళాశాల సెక్రటరీ గోరంట్ల కవిత మాట్లాడుతూ విద్యార్థులు గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో స్వీకరించి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు కార్యక్రమంలో అపెక్స్ విద్యా సంస్థల కరస్పాండెంట్ శివకోటిరెడ్డి, ఆర్కిడ్స్ కరస్పాండెంట్ జి.అజయ్‌కుమార్, శివారెడ్డి, డీన్ దాది అంజనేయులు, ప్రిన్సిపాల్ రమేష్, ఎంఎస్ఆర్, కరణం నారాయణ, షేక్ జిలానిబాషా, పీటీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒంగోలు రూరల్ సీఐగా శ్రీకాంత్‌బాబు



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ శ్రీకాంత్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 11: ఒంగోలు రూరల్ సీఐగా ఎన్.శ్రీకాంత్‌బాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలో ఉన్న ఎస్ఐలు అందరూ మర్యాదపూర్వకంగా ఆయనను కలిసారు. ఆయా పోలీస్‌స్టేషన్ల గురించి సీఐ సమాచారం అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఢిల్లీలో స్వాతంత్ర్య వేడుకలకు రైతు కుటుంబం



రైతు కుటుంబానికి ప్రయాణ టికెట్లను అందిస్తున్న ఏవో విజయకుమార్

కొండపి, ఆగస్టు 11 : మండలంలోని పెదకండ్లగుంట గ్రామంలో ఎస్సీ వర్గానికి చెందిన నల్లపు మాల్యాద్రి, రాగమ్మ దంపతులకు ఈనెల 15వ తేదీన ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా ఏవో విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పీఎం కిసాన్ పథకంలో మొత్తం 17 సార్లు వారు లబ్ధిపొందడంతో ఎంపిక చేశామన్నారు. మాల్యాద్రి దంపతులకు ప్రభుత్వమే ప్రయాణ టికెట్లు, ఇతర వసతులు ఏర్పాటు చేసిందని చెప్పారు. ఆదివారం పెదకండ్లగుంట గ్రామానికి వెళ్లి మాల్యాద్రి కుటుంబానికి ప్రయాణ టికెట్లు అందజేశామన్నారు. తిరిగి 17వ తేదీన స్వగ్రామానికి మాల్యాద్రి కుటుంబం చేరుకుంటుందని చెప్పారు. మాల్యాద్రి కుటుంబం ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పెదకండ్లగుంట గ్రామ వ్యవసాయ సహాయకుడు షేక్ మహేష్‌బాబు పాల్గొన్నారు.

రాపర్ల రోడ్డుకు మోక్షమెప్పుడో..?

గత వైసీపీ హయాంలో కన్నెత్తి చూడని పాలకులు ● గుంతలు పడి రాళ్లమయంగా మారిన వైనం ● ఇబ్బందిపడుతున్న ప్రజలు



గుంతలతో అధ్వానంగా మారిన రోడ్డు

నాగులుప్పలపాడు, ఆగస్టు 11 : గడచిన ఐదేళ్లలో వైసీపీ పాలన ప్రజలకు శాపంగా మారింది. గ్రామీణ ప్రాంతాలలోని రోడ్లు దెబ్బతిని, గుంతలు పడి, రాళ్ళు పైకి లేచి, ప్రజలు నరకప్రాయంగా ప్రయాణం చేస్తున్నారు. అయినా అప్పటి పాలకులకు చీమకుట్టినట్లు కూడా లేదు. కనీసం గుంతలు పూడ్చేందుకు పైసా నిధులు విదల్చకపోవడంతో రోడ్లు రూపురేఖలు మారిపోయి, వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా నాగులుప్పలపాడు, అమ్మనబ్రోలు రహదారి నుంచి రాపర్ల గ్రామానికి వెళ్ళే రోడ్డు గత ఐదేళ్ల నుంచి దెబ్బతిని రాళ్ళు పైకిలేచి, గుంతలు పడి అధ్వానంగా మారింది. అగ్రహారం రోడ్డు వద్ద నుంచి రాపర్ల రైల్వే స్టేషన్ వరకు 4.8 కిలోమీటర్లు తారురోడ్డు దెబ్బతింది. నిత్యం ఆ దారిలో వివిధ గ్రామాల ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. గుంతలమయంగా మారిన రోడ్డుకి ఇరువైపులా చిల్లచెట్లతో నిండి అడవిని తలపిస్తున్నది. దీంతో ఆ రోడ్డులో చీకటి పడితే ప్రయాణించాలంటే ప్రయాణికులకు భయాందోళన చెందుతున్నారు. అటుగా ప్రయాణించే వాహనాలు మరమ్మతులకు గురవుతూ వాహనదారుల జేబులు ఖాళీ అవుతున్నాయి. మండలంలో కర్ర పెత్తనం చేసిన వైసీపీ ముఖ్య నాయకులది సమీప గ్రామం కాగా, వారు సైతం గత ఐదేళ్ళల్లో రాపర్ల రోడ్డు అభివృద్ధికి ఏమాత్రం కృషి చేయలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో తమ గ్రామానికి రోడ్డు నిర్మించాలని రాపర్ల ప్రజలు కోరుతున్నారు.

60 రోజుల్లోనే అభివృద్ధి పనులకు శ్రీకారం

ఎమ్మెల్యే దామచర్ల

ముదిగొండ వాగుపై

బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన

హాజరైన ఎంపీ మాగుంట



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట తదితరులు

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 11: టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన అరవై రోజుల్లోనే అభివృద్ధి పనులకు శ్రీకారం పలికామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు నియోజకవర్గ పరిధిలోని ముదిగొండ వాగుపై రూ.8.26 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు ప్రయాణ సులభతరం చేసేందుకు లింక్ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆలూరు నుంచి అల్లూరు, అలాగే గుండమాల నుంచి గుండాయపాలెం, చేజెర్ల నుంచి ఆలూరు, ఒంగోలు వచ్చే విధంగా రోడ్డు నిర్మించబోతున్నామని దామచర్ల పేర్కొన్నారు. నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చి నిర్మించనున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ నుంచి రూ.15 కోట్లతో పనులు చేపట్టినట్లు వెల్లడించారు. అలాగే రెండు మండలాల్లో సీసీరోడ్లు, తాగునీరు, డ్రైన్‌లు, కల్వర్టులు, అలాగే పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గ్రామాలలో అవసరమైన మౌలిక వసతులను సమకూర్చుతామని, అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడకుండా అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళతామని తెలిపారు. దశల వారీగా పనులు వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన స్కీమ్ కింద అల్లూరు ఆర్ అండ్ రోడ్ నుంచి ఆలూరు మీదుగా చేజెర్లకు రహదారి నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అనుసంధానం, బ్రిడ్జ్‌లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ముదిగొండవాగుపై నిర్మించే బ్రిడ్జి చేజెర్ల గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోకరంగా ఉంటుందని తెలిపారు. ఎంపీగా తాను తనవంతుగా నిధులు కేటాయించి, ఒంగోలు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా కూటమి ప్రభుత్వం

ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల

ఘనంగా జిల్లా ఆర్యవైశ్య సంఘ

కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం



సభలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల, వెంకటేష్, ఎంపీ మాగుంట, కోట హనుమంతరావు తదితరులు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 11: ఆర్యవైశ్యులకు టీడీపీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని ఎంహెచ్‌ఎస్ కళ్యాణమండపలో జరిగిన జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అదేవిధంగా వ్యాపారులు గత ఐదు సంవత్సరాలుగా అనేక సమస్యలు ఎదుర్కొన్నారని, అయితే ఇక నుంచి వ్యాపారులకు స్నేహపూర్వక వాతావరణం ఉంటుందని చెప్పారు. ఒంగోలు పార్లమెంటు పరిధిలో వ్యాపారులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని ఎంపీ మాగుంట పేర్కొన్నారు. వారికి ఎటువంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించటానికి తన వంతు కృషిచేస్తానని ఆయన చెప్పారు. అలాగే మాజీ మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఐక్యంగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. మాజీ రాజ్యసభసభ్యులు టీజీ.వెంకటేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అంటే సేవాభావం కలవారని, అటువంటి వారు రాజకీయంగా ఎదగాలని కోరారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన జిల్లా అధ్యక్షుడు కోట హనుమంతరావుకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దామచర్ల జనార్దన్, మాగుంట శ్రీనివాసులురెడ్డి, శిద్దా రాఘవరావు దంపతులను జిల్లా ఆర్యవైశ్య సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చినరామ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు, వాసవీ సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కనపర్తి ఎత్తిపోతల పథకం అధ్యక్షుడిగా వెంకటకృష్ణారావు

- టీడీపీ కూటమి మద్దతుదారుల హవా



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 11: కనపర్తి ఎత్తిపోతల పథకం అధ్యక్షునిగా ఈదర వెంకట వెంకటకృష్ణారావు(నాని) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అమ్మనబ్రోలులోని ఎత్తిపోతల పథకం కార్యాలయంలో 2024-25 ఏడాదికి గాను నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఎత్తిపోతల పథకం పరిధిలోని 8 గ్రామాల ఆయకట్టు రైతులు సుమారు 2800 మంది ఉన్నారు. ఈ సందర్భంగా 17మంది డైరెక్టర్‌లకు గాను 16 మందిని టీడీపీ కూటమి మద్దతుదారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు అధ్యక్షుడైన అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన ఈదర వెంకటవెంకటకృష్ణారావును, ఉపాధ్యక్షునిగా కరేటి పోలురాజు, కార్యదర్శిగా నడిపినేని శేష గిరిరావుతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. తాను ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి సహకరించిన ఎమ్మెల్యే బీఎస్.విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తేళ్ళ మనోజ్‌కుమార్, కూటమి నాయకులకు అధ్యక్షుడు ధన్యవాదాలు తెలిపారు. ఎత్తిపోతల పథకం అభివృద్ధి, ఆయకట్టు రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు జలకళ

తీరనున్న నగర ప్రజల తాగునీటి ఇక్కట్లు

సాగర్ కాలువల్లో

చిన్నారుల ఈత సరదాలు



కాలువలో ప్రవహిస్తున్న సాగర్‌నీరు

ఒంగోలు నగరంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు జలకళ సంతరించుకుంది. గత రెండు రోజులు నుంచి రామతీర్థం నుంచి సాగర్ జలాలు విడుదలవుతుండగా, అందుకు అనుగుణంగా కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. నెలరోజులపాటు సరఫరా అయ్యే నీటిని రెండు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు నింపి, నగర ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చే దిశగా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా చీమకుర్తి వద్ద నుంచి ఒంగోలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల వరకు ఇంజనీరింగ్ విభాగంలోని కొందరిని సాగర్ నీరు పారే కాలువపై కాపలా ఉంచారు. రైతులు నీరును పొలాలకు మళ్ళించకుండా 24 గంటలు, మూడు షిఫ్టులలో సిబ్బందిని నియమించారు. ఇదిలా ఉంచితే సాగర్ కాలువలో నీరు పారుతుండటంతో చిన్నారులు కేరింతలు కొడుతున్నారు. ఒకవైపు మండుతున్న ఎండలకు సేద తీరుతున్నారు. అందులో శని, ఆదివారం సెలవు కావడంతో ఇక చిన్నారుల ఆనందోత్సాహలకు అవధుల్లేకుండా పోయాయి. మొత్తంగా ఇప్పటి వరకు అడుగంటిని సమ్మర్ స్టోరేట్ ట్యాంకుల్లో నీరు అడుగంటి నగర ప్రజలు తాగునీటికీ తంటాలు పడగా, ప్రస్తుతం వస్తున్న సాగర్ నీరుతో ఆయా స్టోరేజీ ట్యాంకులు జలకళను సంత రించుకుంటున్నాయి.

\- ఒంగోలు (కార్పొరేషన్)



కాలువలో సరదాగా ఈత కొడుతున్న బాలలు

అవీ..ఇవీ..

రేపు ఒంగోలులో జాబ్‌మేళా

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 11: ఒంగోలులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 13వతేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి టి.భరద్వాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో పలు కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఐటీఐ డిప్లమో, పదో తరగతి, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ చదువులు పూర్తిచేసిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు జీతం రూ.12నుంచి రూ.25వేల వరకు ఉంటుందన్నారు. పనితీరు ఆధారంగా ఆకర్షణీయమైన ప్రోత్సాహకం ఇస్తారని, జిల్లాలోని 18నుంచి 30 ఏళ్ళ మధ్య వయస్సు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భరద్వాజ్ కోరారు.

పూర్తి సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలి

- ఎయిడెడ్ టీచర్ల విజ్ఞప్తి

ఒంగోలు(విద్య), ఆగస్టు 11: ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మునిసిపల్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సర్దుబాటులో ఎయిడెడ్ టీచర్ల మొత్తం సర్వీసును పరిగణలోకి తీసుకోవాలని ఎయిడెడ్ టీచర్లు కోరుతున్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులు ప్రభుత్వంలో విలీనమయ్యారు. వీరిని కౌన్సెలింగ్ ద్వారా జడ్పీ, మండల, మునిసిపల్, ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న టీచర్ల సర్దుబాటులో వీరిలో కొందరు మిగులుగా తేలడంతో వారు ప్రభుత్వంలో విలనమైన తేదీ నుంచి వీరి సినియారిటీని పరిగణిస్తున్నారు. దీంతో వారు తమ సర్వీసు మొత్తం కోల్పోయి అందరికంటే జూనియర్లుగా నిలుస్తున్నారు. ఫలితంగా సర్దుబాటులో వీరికి చివరి స్థానాలు దక్కే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తాము ప్రభుత్వ ఉత్తర్వులు వల్లే ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం అయినందున తమను ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసిన సర్వీసును కూడా పరిగణలోకి తీసుకొని తమ సీనియారిటీని నిర్ధారించాలని ఎయిడెడ్ ఉపాధ్యాయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

జాతీయోద్యమ స్ఫూర్తితో పోరాటాలు

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 11: జాతీయోద్యమ స్ఫూర్తితో విద్యార్థి పోరాటాలు నిర్మించాల్సిన అవసరం వచ్చిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో జాతీయ ఉద్యమం-విద్యార్థుల పాత్ర అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. వేలాది మంది విద్యార్థి, యువకుల ప్రాణ త్యాగాలఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ప్రస్తుతం స్వాతంత్ర్య ఫలాలు మాత్రం కొద్ది మంది మాత్రమే అనుభవిస్తూ కోట్లాది మంది ప్రజలు ఆకలి, అణిచివేతతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారని, అందరికి విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యంగా పోరాటాలు నిర్మించాల్సిన అవసరం ఉందని చెప్పారు. మహనీయులు నడిచిన బాటలో విద్యార్థి, యువకులు నడిచి స్వాతంత్ర్య ఉద్యమ ఫలాలను సామాన్యులకు సైతం దక్కేందుకు, సమసమాజ స్థాపన కోసం అందరూ కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రాజెక్టులపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 11 : ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం జరిపిన సర్వే, నిధులు, కొత్తప్రాజెక్టులపై ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్న వేశారు. దీనిపై కేంద్ర రైల్వేలు, సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, సాంకేతిక సమాచార శాఖమంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానం ఇస్తూ రైల్వే ప్రాజెక్టుల పరిధి పలురాష్ట్రాల సరిహద్దుల గుండా వెళ్తున్నందున రాష్ట్రాల వారి కాకుండా రైల్వే జోనళ్ళ వారీగా సర్వేలు, నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 17నూతన, 24 డబ్లింగ్/ రెట్టింపు రైల్వే ప్రాజెక్టులు రూ.73,743 కోట్లతో 5329 కి.మీ. మేర నిర్మాణ పనులు పలు దశల్లో ఉన్నాయన్నారు. 2024 మార్చినాటికి రూ.24,156 కోట్లతో 1,006 కి.మీ. నిర్మించి అప్పగించినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే ప్రాజెక్టులకు 2009నుంచి 2014 వరకు బడ్జెట్‌లో రూ.886కోట్లు మాత్రమే కేటాయించగా, 2023-24 బడ్జెట్‌లో రూ.8406 కోట్లు, 2024-25 బడ్జెట్‌లో రూ.9151 కోట్లు కేటాయింపులు జరిగాయని వివరణ ఇచ్చారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎంపిక చేసిన రైల్వేస్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 73 రైల్వేస్టేషన్లు ఉండగా ప్రకాశం జిల్లాలో ఒంగోలు, సింగరాయకొండ, గిద్దలూరు, దొనకొండ, కంభం, మార్కాపురం స్టేషన్లు ఉన్నాయని కేంద్రమంత్రి తెలిపారు.

విశ్రాంత హెచ్‌ఎంకు ఘన సన్మానం

ఒంగోలు(విద్య), ఆగస్టు 11: ఒంగోలు మండలం కరవది ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేసి ఉద్యోగ విరమణచేసి తుమ్మల అంజిరెడ్డి దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక పాఠశాల ఆవరణలో ఏపీటీఎఫ్ పూర్వకార్యదర్శి ఐ.విజయసారథి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జనార్దన్‌రెడ్డి, డి.శ్రీనివాసులు మాట్లాడారు. విధి నిర్వహణలో అంజిరెడ్డి అందరికీ ఆదర్శప్రాయుడని కొనియాడారు. పాఠశాల కరస్పాండెంట్ కరుణాకర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అంజిరెడ్డి చేసిన కృషిని అభినందించారు. హెచ్‌ఎంగా, ఏపీటీఎఫ్ నాయకుడుగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తిప్పారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పి.వీరరాఘవులు, శేషారావు, పరిటాల సుబ్బారావు, శ్రీనివాసులురెడ్డి, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి, జి.వెంకటేశ్వరరెడ్డి, కనకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి

- ట్రాఫిక్ సీఐ పాండురంగారావు



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ పాండురంగారావు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 11: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ వై.పాండురంగారావు పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ నగరంలో వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌లు తప్పక కలిగి ఉండాలన్నారు. ద్విచక్రవానదారులు ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని, అధిక శబ్దాలు చేసే సైలెన్సర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా వాహన చోదన చేస్తే జరిమాన విధిస్తామని చెప్పారు. అనంతరం ఎస్పీ దామోదర్‌ను కలిసి బొకే అందజేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను సీఐ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆసక్తిగా 'చదవడం నాకిష్టం'

టంగుటూరు, ఆగస్టు 11 : టంగుటూరు ప్రభుత్వ గ్రంథాలయంలో ఆదివారం చదవడం నాకిష్టం కార్యక్రమం ఆసక్తిగా జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని హర్ ఘర్ తిరంగా ఉత్సవాల నేపథ్యాన్ని గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధనరాజు విద్యార్థులకు వివరించారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య, బళ్లారి రాఘవ గురించి విద్యార్థులకు వివరించారు. ఈ నెల 13వరకు జరిగే ఈవేడుకల్లో విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

ట్రాక్టర్ కిందపడి మహిళ మృతి



మృతి చెందిన మరియమ్మ

కొండపి, ఆగస్టు 11 : మండలంలోని పెదకండ్లగుంట గ్రామానికి చెందిన తంగెళ్ల మరియమ్మ(32) ఆదివారం ఉదయం పెదకండ్లగుంట-కొండపి గ్రామాల మధ్య ప్రమాదవశాత్తు కట్టెల ట్రాక్టర్ కింద పడి మరణించింది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం... మరియమ్మ భర్తతో వివాదం కారణంగా స్వగ్రామం పెదకండ్లగుంటలో తండ్రి వద్ద ఉంటుంది. ప్రతి ఆదివారం ఒంగోలులో చర్చికి ప్రార్ధనకు వెళుతుంటుంది. ఈక్రమంలో పెదకండ్లగుంట గ్రామం నుంచి తండ్రి ద్విచక్రవాహనం ఎక్కి కొండపి వస్తుండగా పెదారికట్ల గ్రామానికి చెందిన కట్టెల ట్రాక్టర్ కొండపి వైపు వస్తుంది. ట్రాక్టర్‌ను తప్పించబోయి కట్టెలు తగిలి మరియమ్మ ట్రక్కు టైరు కింద పడి అక్కడికక్కడే మరణించింది. విషయం తెలుసుకున్న పోలీసులు మరియమ్మ మృతదేహాన్ని పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణబాజీబాబు తెలిపారు.

ఒకటో తేదీ నుంచి హెల్మెట్ తప్పనిసరి : ఎస్ఐ

మద్దిపాడు, ఆగస్టు 11: రహదారి ప్రమాదాల నియంత్రణకు హైకోర్టు ఉత్తర్వుల మేరకు సెప్టెంబరు 1వ తేదీ నుంచి వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తికి కూడా హెల్మెట్ తప్పనిసరి అని ఎస్ఐ మహేష్ ఆదివారం పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. తప్పనిసరిగా ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన అన్ని ధృవపత్రాలు వెంట తెచ్చుకోవాలని చెప్పారు. హెల్మెట్ లేకపోతే జరిమానా విధిస్తామని ఆయన పేర్కొన్నారు.

పీఆర్ ఉద్యోగులకు ఇద్దరు మంత్రులా?!

- శాఖ ఒక చోట.. శిక్షణ ఒక చోట
- పంచాయతీరాజ్‌ను చీల్చిన నాటి వైసీపీ సర్కార్
- సచివాలయ శాఖ పరిధిలోకి ఏపీఎస్ఐఆర్‌డీ-పీఆర్
- అప్పట్లో సీఎంఓలో ఉన్న ఓ అధికారి నిర్వాకం
- ఇప్పటికైనా పీఆర్‌లోకి తేవాలని డిమాండ్

ఒక శాఖ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు, అధికారులకు ఒక మంత్రినే ఉంటారు. అయితే విచిత్రంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో పనిచేసే ఉద్యోగులకు మాత్రం ఇద్దరు మంత్రులు ఉన్నారు. వైసీపీ సర్కార్ హయాంలో అప్పట్లో సీఎంఓలో ఉన్న ఓ అధికారి నిర్వాకంతో అనాలోచితంగా పంచాయతీరాజ్‌లో ఉన్న ఈ విభాగాన్ని గ్రామ, వార్డ్ సచివాలయ శాఖలోకి చేర్చారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఏపీఎస్ఐఆర్‌డీ)-పీఆర్ విభాగాన్ని గ్రామ, వార్డ్ సచివాలయ శాఖ పరిధిలోకి చేర్చడంతో పంచాయతీరాజ్‌శాఖలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి!!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్‌శాఖ సిబ్బందికి ఎలిమినేటి మాధవరెడ్డి ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(ఏఎంఆర్-అపార్డ్) సంస్థ ద్వారా శిక్షణ నిర్వహించేవారు. ఈ సంస్థ పంచాయతీరాజ్ విభాగం లోనిదే. దానికి నిధులు, సిబ్బంది పంచాయతీరాజ్ శాఖ నుంచి ఇస్తారు. ఈ సంస్థ శిక్షణ ఇచ్చేది కూడా పంచాయతీరాజ్ ఉద్యోగులకు, అధికారులకు, పంచాయతీరాజ్ విభాగానికి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు మాత్రమే. ఏటా వారికి శిక్షణ అందించేందుకు పంచాయతీరాజ్ కమిషనర్ నిధులు సమకూరుస్తారు. ఆ విభాగానికి జవజీవసత్వాలు నింపే పంచాయతీరాజ్‌కు సంబంధం లేకుండా చేయడంతో ఈ విభాగంలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు తాము ఏ మంత్రిత్వశాఖలో ఉన్నామో? అర్థం కాక అయోమయంలో పడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఏపీఎస్ఐఆర్‌డీ-పీఆర్ పేరుతో ఈ శిక్షణా సంస్థకు పేరుమార్చారు. రాష్ట్ర విభజన తర్వాత ఆ శిక్షణా సంస్థలో ఉన్న 53 పోస్టులను విభజన చట్టం ప్రకారం పంచగా మన శిక్షణ సంస్థ ఏపీఎస్ఐఆర్‌డీ-పీఆర్‌కు 30 పోస్టులు కేటాయించారు. అయితే ఈ శాఖకు అధికారులు, ఉద్యోగులందరూ పంచాయతీరాజ్‌శాఖ నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లిన వారే. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిత్వశాఖ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతిలో ఉంది. అయితే ఏపీఎస్ఐఆర్‌డీ-పీఆర్ మాత్రం గ్రామ, వార్డ్ సచివాలయశాఖ నిర్వహిస్తున్న డోలా బాలవీరాంజనేయస్వామి పరిధిలోకి వెళ్లింది. పంచాయతీరాజ్‌శాఖలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు రెండు శాఖల పరిధిలో పనిచేయాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

నిధులన్నీ పంచాయతీరాజ్‌శాఖ నుంచే...

ఏపీఎస్ఐఆర్‌డీ-పీఆర్ సంస్థ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సిబ్బందికి, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు వార్డ్ మెంబర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలోని ఉద్యోగులందరికీ శిక్షణ ఇస్తుంది. దీంతో పాటు ఉపాధి హామీ పథకంలో పనిచేసే సిబ్బందికి సైతం ఈ సంస్థ ద్వారానే శిక్షణ అందిస్తారు. ఈ శిక్షణ అందించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ నిధులు అందిస్తారు. ఇటీవల కూడా సర్పంచ్‌లకు శిక్షణ అందించేందుకు ఈ సంస్థకు రూ.10 కోట్ల దాకా శిక్షణ నిమిత్తం నిధులు మంజూరుచేశారు. ఈ సంస్థ ద్వారా శిక్షణ తీసుకునే వారు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు చెందిన వారే. దాని కోసం నిధులిచ్చేది కూడా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖనే. అలాంటి సంస్థను గ్రామ, వార్డ్ సచివాలయశాఖలోకి మార్చడంలో ఆంతర్యం ఎవరికీ అంతుపట్టడం లేదు. పవన్ కల్యాణ్ నేతృత్వంలో ఉన్న పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు సిబ్బంది గ్రామ, వార్డ్ సచివాలయ శాఖ నిర్వహించే డోలా బాలవీరాంజనేయస్వామి ఆధ్వర్యంలో కూడా పనిచేయాల్సి వస్తోంది. ఒక శాఖకు సంబంధించిన ఉద్యోగులు, అధికారులు ఇంకో మంత్రిత్వశాఖలో పనిచేయడం ఇబ్బందిగా ఉందని పేర్కొంటున్నారు. ఉపముఖ్యమంత్రి చొరవ తీసుకుని గ్రామ, వార్డ్ సచివాలయశాఖలో ఉన్న ఏపీఎస్ఐఆర్‌డీ-పీఆర్‌ను తిరిగి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో విలీనం చేయాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలి

- సమన్వయ సమావేశంలో సంఘాల వినతి
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీల హామీ

విజయవాడ(వన్‌టౌన్), ఆగస్టు 11: ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలని సమన్వయ సమావేశంలో ఉపాధ్యాయ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ విజయవాడలో ఆదివారం ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆయా సంఘాల రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జీవో 117 రద్దు, ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం తొలగింపు, తెలుగు మాధ్యమం కొనసాగింపు, పదోన్నతులు, బదిలీలు, ఎంఈవో 1, 2లకు సమాన అధికారాలు, జిల్లా యూనిట్‌గా కారుణ్య నియామకాలు, ఉద్యమాల సందర్భంగా పెట్టిన కేసుల ఉపసంహరణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ఉపాధ్యాయ సంఘాలకు మధ్య వారధిగా పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

తిరుమల ఘాట్‌లో చిరుత సంచారం

తిరుమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌లో చిరుత పులి సంచారం కలకలం సృష్టించింది. ఆదివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో 55, 56వ మలుపు వద్ద ఓ చిరుతపులి రోడ్డు దాటింది. అదే సమయంలో రోడ్డుపై వెళుతున్న వాహనదారులు, ద్విచక్రవాహన దారులు హడలిపోయారు. కొంత మంది భయంతో వెనక్కి వెళ్లిపోయారు. వెంటనే విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అటవీ అధికారులు, సిబ్బందితో కలిసి ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే చిరుత అడవిలోకి వెళ్లిపోయింది.

క్లస్టర్ వ్యవస్థను స్వాగతిస్తున్నాం: అశోక్‌నాయుడు

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల్ని సర్దుబాటు చేసి క్లస్టర్ వ్యవస్థను తీసుకురావాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆది అశోక్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియ వల్ల పంచాయతీ కార్యదర్శులు పూర్తిగా గ్రామ పంచాయతీలపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుందని, గ్రామ పంచాయతీ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. సచివాలయాల్లో ఇంకా 1800 మంది అదనపు పంచాయతీ కార్యదర్శులు అధికారాల్లేకుండా ఉన్నారని, మరో 2 వేలకు పైగా గ్రామ పంచాయతీలు ఇన్‌చార్జిలతో కొనసాగుతున్నాయని తెలిపారు.

పదోన్నతి కోటా తగ్గించడం చట్ట విరుద్ధం

- 30 ఏళ్ల సీనియారిటీని తుంగలో తొక్కారు: పీఆర్ డిప్లమో ఇంజనీర్లు

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ ఇంజనీర్ నియామకాల్లో గత 30 ఏళ్ల నుంచి అమల్లో ఉన్న 70 శాతం పదోన్నతి కోటాను 50 శాతానికి తగ్గిస్తూ పంచాయతీరాజ్ ఇంజనీర్-ఇన్-చీఫ్ ఇచ్చిన ఉత్తర్వులు చట్ట ఉల్లంఘన అని పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల సంఘం ఖండించింది. ఆదివారం పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవాడలోని ఏపీఎన్జీఓ హోంలో రాష్ట్ర అధ్యక్షుడు కె.రవీంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో 26 జిల్లాల ప్రతినిధులు పాల్గొని పలు తీర్మానాలు చేశారు. 30 సంవత్సరాల సీనియారిటీ జాబితాలను అక్రమంగా జోన్ 4లో మారుస్తూ ఇచ్చిన ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 1994లో ఇచ్చిన జీఓ 1240 ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై ప్రభుత్వం బాధ్యత తీసుకుని వెంటనే సర్వీస్ రూల్స్ సవరించి సీనియర్ ఏఈలకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. 2014-19లో వేసిన సిమెంట్‌రోడ్ల విషయంలో, గత వైసీపీ ప్రభుత్వం వేసిన అక్రమ కేసులు ఐదు జిల్లాల్లో రద్దు చేశారని, మిగిలిన జిల్లాల్లోనూ రద్దు చేయాలని, ఇంకా పలు తీర్మానాలు చేశారు.

మోటార్ సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, ఆగస్టు 11: రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైక్లిస్టుకు గాయాలైన ఘటన ఆదివారం ఏడుగుండ్లపాడు సమీపంలో జరిగింది. ఒంగోలు వైపు వెళ్లే ఆటోను అధిగమించబోయి మోటార్‌సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మేదరమెట్ల గ్రామానికి చెందిన ఎల్.శ్రీనివాసరావు తలకు గాయాలు కాగా క్షతగాత్రుని ఒంగోలులోని కిమ్స్‌కి తరలించారు.

10మంది జూదరుల అరెస్ట్

కనిగిరి, ఆగస్టు 11: మండలంలోని బడుగులేరు గ్రామ పొలాల్లో పేకాట స్థావరంపై ఎస్ఐ త్యాగరాజ్ తన సిబ్బందితో ఆదివారం ఆకస్మిక దాడి చేశారు. పది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 85,670 నగదు, బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఖరీఫ్ సీజన్‌లో కనిపించని వరుణుడు

సాధారణం కంటే 15.1 మి.మీ లోటు వర్షపాతం

చెరువులు, కుంటల్లో కనిపించని నీరు



చుక్కనీరు లేని మురారిపల్లె పెద్దచెరువు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 11 : ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 56 రోజులు గడిచినా ఎర్రగొండపాలెం మండలంలో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. సాధారణం కంటే 15.01 మి.మీ వర్షపాతం తక్కువగా నమోదయ్యింది. జూన్ 1వ తేదీ నుంచి ఆగస్టు నెల 11వ తేదీ వర కు మండలంలో 176.08 మి.మీ సాధారాణ వర్షపాతం కాగా, 150.01 మి.మీ వర్షపాతం నమోదు అయ్యింది. మరో వైపురైతులు పొలాలు దుక్కులు దున్ని ఖరీఫ్ సాగుకు సిద్ధం చేసుకున్నారు. వర్షం కురిస్తే రైతులు కంది, పత్తి విత్తనాలు విత్తుకుందామనే వారికి నిరాశే మిగిలింది. సకాలంలో ఖరీఫ్ సీజన్‌లో వర్షం కురిసి భూములు పదునైతే 1225 హెక్టార్ల విస్తీర్ణంలో కంది, 2366 హెక్టార్ల విస్తీర్ణంలో పత్తి, 40 హెక్టార్ల విస్తీర్ణంలో ఆముదాలు, పెసర 33 హెక్టార్ల విస్తీర్ణంలో, జొన్న 11 హెక్టార్ల విస్తీర్ణంలో విత్తనాలు రైతులు విత్తుకునేవారు. మిరప 2942 హెక్టార్ల విస్తీర్ణంలో నాట్లు వేయావేయాల్సి ఉంది. సాధారణం కంటే 15.01 మి.మీ వర్షపాతం తక్కువ నమోదు కావడం భూములు పదును కాకపోవడంతో రైతులు విత్తనాలు విత్తుకునే ప్రయత్నం చేయలేదు. వర్షాలు కురుస్తాయన్న ఆశతో మేఘాలపై చూసి నిరాశ చెందారు. ప్రస్తుతం మండలంలో 65 హెక్టార్ల విస్తీర్ణంలో కంది, 172 హెక్టార్ల విస్తీర్ణంలో పత్తి విత్తనాలు విత్తుకున్నారు. 6 హెక్టార్ల విస్తీర్ణంలో మిరపనాట్లు నాటారు. వర్షాలు కురవని కారణంగా వ్యవసాయబోర్లలో, తాగునీటి బోర్లలో భూగర్భ జలమట్టం అడుగంటింది. చెరువుల్లో, కుంటల్లో చుక్కనీరు లేకపోవడంతో పశువులకు కూడా తాగునీటి కోసం ట్యాంకర్ల పైనే ఆధార పడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ పంటల సాగు దేవుడెరుగు వర్షాలు లేక పశుగ్రాసం, కొరత తాగునీటి సమస్యతో పశుపోషణ కడుభారంగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాయితీపై ప్రభుత్వం పశుగ్రాసం సరఫరా చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బడికి ఎలా వెళ్లాలి ?

బస్సులు లేక విద్యార్థుల ఇబ్బందులు

రోజూ ఒక్కొక్కరికి ఆటోకు రూ. 50 ఖర్చు

రోడ్డుకు మరమ్మతులు చేసినా నడపని ఆర్టీసీ అధికారులు





రహదారిపై గుంతలు పూడ్చిన స్థానికులు (ఇన్‌సెట్లో) బస్సులేక ఆటోలో వెనుక నిలబడి వెళుతున్న విద్యార్థులు

పామూరు, ఆగస్టు 11 :గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. చదువుపై ఆసక్తితో బడికి వెళ్లాలనుకునే విద్యార్థులకు రోడ్డు దుస్థితితో బస్సులు రాక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అక్కంపేట, పాత, కొత్త, రేణిమడుగు, రజసాహెబ్‌పేట, కమ్మవారిపాలెం గ్రామాల నుంచి 5 నుంచి 7 కిలోమీటర్ల దూరానున్న కంబాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉన్నత విద్య కోసం సుమారుగా 120 మంది విద్యార్థులు ఆర్టీసీ బస్సులు ఎక్కి పాఠశాలకు వచ్చేవారు. పామూరు మండలంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 16 ప్యాకేజీ రోడ్ల పనులకు సుమారుగా రూ.75కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. హడావుడిగా గ్రావెల్ పనులు చేపట్టారు. అంతలోనే వర్షాలు రావడంతో గ్రావెల్ పరిచిన రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఈ లోగా ఎన్నికలు రావడం వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో కాంట్రాక్టర్లు పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. రోడ్లు సక్రమంగా లేని కారణంగా బస్సులు తిరగడం కష్టం కావడంతో అధికారులు నిలిపివేశారు. దాంతో పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆటోలకు ఒక్కో విద్యార్థికి రానుపోను రూ.50 ఖర్చు చేసి బడికి పంపిస్తున్నారు. కొందరు ఆర్థిక భారం మోయలేక చాలిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామస్థులు వాగులపై నిర్మించిన చప్టాల వద్ద సొంతంగా అప్రోచ్ రోడ్లు నిర్మించుకొన్నారు. తమ గ్రామానికి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ఆయ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే ఉగ్ర దృష్టికి తెచ్చారు. ఈ విషయం పై ఉగ్ర పలుమార్లు ఆర్టీసీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకొని వెళ్లారు.డిపో మేనేజర్ తన సిబ్బందితో రూట్ మ్యాప్‌ను పరిశీలించి వెళ్లారే గాని బస్సు సర్వీసును పునరుద్ధరించ లేదు. దాంతో బడి కోసం పిల్లలు బస్సు కష్టాలు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసును పునరుద్ధరించి విద్యార్థుల కష్టాలు తొలగించాలని కోరుతున్నారు.

అద్దంకిలో గోమాతల ఆక్రందన..!

- గోకులంలో గ్రాసం కొరత
- దాతల కోసం ఎదురుచూపులు
- స్థలం లేక తరచూ షెడ్ల మార్పు
- 60 ఆవులు.. 15ఏళ్లుగా నిర్వహణ
- రోజుకు రూ.10వేలపైనే ఖర్చు
- అద్దంకి కొండ వద్ద ప్రభుత్వ భూమి కేటాయిస్తే కష్టాలు తీరినట్టే..



హరిహర గోకులంలో టెంట్ నీడన ఉన్న ఆవులు

అద్దంకి, ఆగస్టు 11 : గోమాతలకు అద్దంకిలో పెద్ద కష్టం వచ్చింది. పశుగ్రాసం సరిపడా లేక ఏ రోజుకు ఆరోజు దాతల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అద్దంకి పట్టణంలో హరిహర గోకులం సొసైటీ ఆధ్వర్యంలో గోశాల నిర్వహిస్తున్నారు. సుమారు 15 సంవత్సరాల క్రితం ఒక్క ఆవుతో గోనుగుంట సుబ్బారావు గోశాలను ఇంట్లోనే ప్రారంభించారు. అనంతరం ఒక కపిల గోవు దూడను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ దశాబ్దకాలం కిందట ఉచితంగా ఇచ్చారు. ఆ దూడ సంతతి ప్రస్తుతం ఆరు ఉన్నాయి. అప్పటి నుంచి దాతలు పలువురు ముందుకు వచ్చి ఆవులను గోశాలకు ఇస్తున్నారు. ప్రస్తుతం 60కిపైగా ఆవులు గోకులంలో ఉన్నాయి. గోవులు పెరుగుతుండటంతో పశు గ్రాసం భారం కూడా రోజు రోజుకు పెరుగుతుంది. రోజుకు సరాసరిన 10 వేల రూపాయల పశుగ్రాసం అవసరం అవుతుంది. దీంతో దాతల సహకారం మరింత అవసరం అయింది. ప్రధానంగా రాజస్థాన్ రాష్ట్రం నుంచి వచ్చి అద్దంకిలో వ్యాపారులు, వివిధ పనులు చేసుకుంటున్న యువకులు తరచూ సహకారం అందిస్తుండగా, అద్దంకి పట్టణంలోని ఆర్యవైశ్యులు నాగసూరి సత్యనారాయణ, అద్దేపల్లి అశోక్ తదితరులు కొంతమేర సహకారం అందిస్తున్నారు. అయితే 60కి పైగా గోవులు ఉండడం, గ్రాసం కోసం బయటకు వెళ్లే అవకావం లేకపోవడంతో ఖర్చు మరింత పెరిగింది. దీంతో ఏ రోజు కారోజు గ్రాసం కోసం దాతల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల రెండు రోజుల పాటు పశుగ్రాసం లేక గోవులు ఖాళీ కడుపుతో ఉండి అలమటించిన సందర్భాలు కూడా చోటుచేసుకున్నాయి. దాతలు ముందుకు వచ్చి పశుగ్రాసం అందిస్తేనే గోవుల కడుపు నిండే పరిస్థితి నెలకుంది. తొలుత ఇంటి వద్దనే గోశాల నిర్వహించిన సుబ్బారావు గోవులు పెరగడంతో కొంతకాలం రామ్‌నగర్‌లో మూత పడ్డ మిల్‌లో నిర్వహించారు. అక్కడ ఖాళీ చేయించడంతో రెండు సంవత్సరాలుగా వాసవీ నగర్‌లోని విశ్వభారతి స్కూల్ ఎదురు మూతపడి ఉన్న మిల్‌లో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆ మిల్ కూడా ఖాళీ చేయాల్సి రావడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే ప్రయత్నంలో ఉన్నారు. శింగరకొండ సమీపంలో అద్దంకి కొండ వద్ద పలు విద్యా సంస్థలు, టిడ్కో ఇళ్లు, ఇతర అవసరాలకు స్థలాల కేటాయింపు జరిగిన క్రమంలో గోశాలకు కూడా కొంత మేర స్థలాన్ని కేటాయిస్తే శాశ్వతంగా గోశాల నిర్మాణం చేపట్టడంతోపాటు సమీపంలో కొండ ప్రాంతం ఉన్నందున పగలు సమయంలో మేతకు కొండకు తోలుకుపోతే పశుగ్రాసం బాధలు, ఖర్చు కూడా ఎక్కువ భాగం తగ్గుతుందని గోశాల నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు. గోవుల పెంపకంపై ఒకింత ఆసక్తి ఉన్న విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించి గోశాల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించే విధంగా కృషి చేయాలని, అదే సమయంలో దాతలు ముందుకు వచ్చి గ్రాసం అందించాలని సుబ్బారావు కోరుతున్నారు.

స్థలం కేటాయిస్తే శాశ్వత గోశాల నిర్మాణం

శింగరకొండ సమీపంలోని అద్దంకి కొండ వద్ద ప్రభుత్వం స్థలం కేటాయిస్తే శాశ్వతంగా గోకులం ఏర్పాటు చేసుకుంటాము. ప్రస్తుతం ఖాళీ గా ఉన్న మిల్లులలో గోశాలలను నిర్వహిస్తూ తరచూ మారాల్సి వస్తుంది. ఆవులను మేత కోసం బయటకు వదిలే అవకాశం లేక కట్టివేసి మేపాల్సి రావటంతో గ్రాసం ఖర్చు కూడా బాగా పెరిగింది. అద్దంకి కొండ వద్ద అయితే గ్రాసం ఖర్చు బాగా తగ్గుతుంది. ఆవులు కూడా ప్రశాంత వాతావరణలో మరింత ఆరోగ్యంగా ఉంటాయి.

– గోనుగుంట సుబ్బారావు, గోశాల నిర్వాహకుడు, అద్దంకి

16 నుంచి రెవెన్యూ సదస్సులు

- ఆక్రమణలు, రీసర్వే సమస్యలపై అర్జీల స్వీకరణ
- తహసీల్దార్, ఏడుగురు అధికారులతో నిర్వహణ
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



పర్చూరు, ఆగస్టు 11 : వైసీపీ పాలనలో భూదందాలు, అక్రమాల నిగ్గు తేల్చేందుకు, భూ సమస్యల పరిష్కారానికి ఈనెల 16 నుంచి సెప్టెంబరు 30వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15 జిల్లాలో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఏలూరి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాలవారీగా భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతాంగ సమస్యలకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. ఐదేళ్ల పాలనలో పెద్దఎత్తున భూ ఆక్రమణలు జరిగాయని ఆరోపించారు. అనేక మంది సామాన్య మధ్యతరగతి ప్రజలను బెదిరించి భూములను స్వాధీనం చేసుకున్నారని దీనిపై అనేక ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం ప్రజల చెంతకు వెళ్లనున్నట్లు ఆయన ఈసందర్భంగా తెలియజేశారు. ప్రజాక్షేత్రంలో అక్కడికక్కడే సమస్యలను తెలుసుకునేలా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా రంగం సిద్ధం చేసిందన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులకు మరో 45 రోజల గడువు ఇచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. తహసీల్దార్‌తో పాటు, ఆయా భూముల వ్యవహారాలతో సంబంధం ఉన్న అటవీ, దేవదాయ ఇతర శాఖల అధికారులు సైతం ఈ సదస్సుల్లో పాల్గొంటారన్నారు. ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రచించిందన్నారు. వైసీపీ హయాంలో నిషిద్ధ జాబితా నుంచి ఫ్రీహోల్డ్ పేరుతో తప్పించిన భూముల రిజిస్ట్రేషన్‌లపై సమగ్ర దర్యాప్తు జరుగుతుందన్నారు. అసైన్డ్, చుక్కల భూములు, ఫరతు లున్న వేల ఎకరాల భూములను నిషిద్ధ జాబితా నుంచి తప్పించి వైసీపీ నేతలు రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యావత్తు రైతుల పొలాలు, ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని ఏలూరి కోరారు. ఈనెల 15న రెవెన్యూ సదస్సులను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ఏలూరి తెలిపారు. 16 నుంచి వచ్చేనెల 30 వరకు గ్రామాలవారీగా సదస్సులు నిర్వహిస్తారని, ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

వేణుగోపాలస్వామి భూములకు కౌలు వేలం నిర్వహించాలి

అద్దంకి, ఆగస్టు 11 : దేవస్థానం భూములకు బహిరంగ కౌలు వేలం నిర్వహించకుండా అధికారులు ఆదాయానికి గండికొడుతున్నారని పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దక్షిణ అద్దంకి పరిధిలో ఉన్న వేణుగోపాలస్వామి దేవాలయానికి సంబంధించి సర్వేనెంబర్ 1787లో సుమారు 15ఎకరాలు సాగు భూమి ఉందని, దానికి సంబంధించి కౌలుకు ఇచ్చేందుకు అధికారులు బహిరంగ వేలం నిర్వహించకుండా, అనుకూలంగా ఉన్న కొద్దిమంది రైతులకు తక్కువ కౌలుకు ఇస్తున్నారని గొట్టిపాటి సుబ్బారావు దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌కు పంపిన అర్జీలో పేర్కొన్నారు. అదే సమయంలో 3ఎకరాల భూమిని సమీప పొలాల రైతులు ఆక్రమించుకుని కనీసం కౌలు కూడా చెల్లించడం లేదని స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని, కౌలు బహిరంగ వేలం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అర్జీలో కోరారు.

ఉపాధి హామీ పథకం పనులు తికమక

- అందుబాటులో లేని ఫీల్డ్ అసిస్టెంట్లు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

టంగుటూరు, ఆగస్టు 11 : ఫీల్డ్ అసిస్టెంట్లు అందుబాటులో లేక పనుల నిర్వహణలో తికమక పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలో ప్రస్తుతం 8మంది ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే ఉన్నారు. పది పంచాయతీలకు ఇంతవరకు ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం లేదు. కొత్త ప్రభుత్వం రాకతో కొన్ని పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. ఏళ్ల తరబడి వైసీపీ అంటకాగిన ఫీల్డ్ అసిసెంట్లు కొందరిని తొలగించారు. అలాగే కొందరు ప్రభుత్వం మారగానే స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. దీంతో పది పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత ఏర్పడింది. వీరిని తిరిగి నియమించాల్సి ఉంది. వీరి నియామకంలో జాప్యం కారణంగా ఆయా పంచాయతీల్లో ఉపాధి పనులకు బ్రేకులు పడ్డాయి. అప్పటికీ టెక్నికల్ అసిస్టెంట్స్ ద్వారా పనులు పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. గ్రామాల్లో ఫీల్డ్ అసిసెంట్లు అందుబాటులో ఉంటే పనుల బాధ్యత వారే స్వీకరించి పనుల కొనసాగింపునకు పూర్తి సహకారం అందిస్తారు. ఉపాధి పనుల సిబ్బంది పర్యవేక్షణ ఉంటే చాలు పనులు వడివడిగా కొనసాగుతాయి. ఉపాధి పనుల నిర్వహణలో ప్రధాన భూమిక ఫీల్డ్ అసిస్టెంట్లదే. వెంటనే ఫీల్డ్ అసిసెంట్లను నియమించాలని కూలీలు విన్నవిస్తున్నారు. కూలీలకు ప్రస్తుతం పనులు లేక ఇళ్ల వద్దనే ఖాళీగా ఉంటున్నారు. ఫీల్డ్ అసిసెంట్ల నియామకం పూర్తి చేసి ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు ప్రారంభించాలని కోరుతున్నారు. ప్రస్తుతం 7 పంచాయతీల్లో మాత్రమే ఉపాధి పనులు కొనసాగుతున్నాయి.

మొక్కలు నాటిన జనసేన నాయకులు



మొక్కలను నాటుతున్న నాయకులు

చీమకుర్తి, ఆగస్టు 11 : జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్న ఒక్కొక్కరూ ఒక్కో మొక్క నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మండలంలో అన్ని గ్రామాల్లో మొక్కలు నాటనున్నారు. నియోజకవర్గంలో వెయ్యి సభ్యత్వాలు పూర్తి అయిన సందర్భంగా వెయ్యి మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నారు. చీమకుర్తి మొక్కలు నాటడం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు దరిమడుగు నాగరాజు, తోట సుధాకర్, తాతినేని శ్రీరామ్, జగపతిబాబు, శామ్యూల్, గోపీకృష్ణ, నాగరాజు, అశోక్, నవీన్, చైతన్య, రోహిత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న ఇస్మాయిల్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 11: పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించాలని పలువురు ముస్లిం సంఘాల నాయకులు కోరారు. ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఇస్లాంపేటలో సయ్యద్‌సర్దార్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్ మాట్లాడుతూ లక్షలాది ఎకరాలు ఉన్న వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నా ఎన్‌డీఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చే సవరణ చట్టాన్ని నిరసిస్తూ త్వరలోనే ఉద్యమ కార్యాచరణ తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. న్యాయవాది షేక్ కరీముల్లా సమన్వయకర్తగా వ్యవరించిన ఈ కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌ఇస్మాయిల్, పఠాన్ కరీముల్లాఖాన్, సయ్యద్‌హుస్సేన్, షేక్ ఖాజా, మహ్మద్‌సాదిక్, నూకతోటి రవికుమార్, అబ్దుల్‌రవూఫ్, కరీమ్ బేగ్, న్యాయవాదులు షేక్ సంధాని, అబ్దుల్‌నబీ, ఆరీఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌రెడ్డిని కలిసిన విద్యాకమిటీ చైర్మన్లు



అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న విద్యాకమిటీ చైర్మన్లు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 11 : నూతనంగా ఎన్నికైన విద్యాకమిటీ చైర్మన్లు ఆదివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిసి తమ విజయానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కొమరోలు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ షేక్‌సుభాని, వైస్‌చైర్మన్ లక్ష్మీ, రెడ్డిచెర్ల విద్యాకమిటీ చైర్మన్ షేక్ రఫీతోపాటు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పాఠశాల కమిటీ చైర్మన్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిసి పూలమాలలు వేసి సన్మానించారు. విద్యాకమిటీ చైర్మన్లుగా అవకాశం కల్పించిన సందర్భంగా ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్తుముల సంజీవరెడ్డి, వీరంరెడ్డి కృష్ణమోహన్‌రెడ్డి, ముత్తుముల మల్లికార్జున్‌రెడ్డి, శివరామిరెడ్డి, అక్కలరెడ్డి మోహన్‌రెడ్డి, హుస్సేన్‌బేగ్, సుబ్బరాయుడు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి చైర్మన్లు కృషిచేయాలి

కొమరోలు : నూతనంగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు ఆయా పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలో నూతనంగా ఎన్నికైన పాఠశాల చైర్మన్లు గిద్దలూరులోని ఎమ్మెల్యే నివాస గృహంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు సంజీవరెడ్డిలను ఆదివారం ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన పాఠశాలల చైర్మన్లకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి పాఠశాలలో మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కొమరోలు చైర్మన్ షేక్ మహబూబ్ సుభాని, మండల నాయకులు చలిచీమల శ్రీనివాస చౌదరి, కాంట్రాక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పేద ఆర్యవైశ్యులకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఆవోపా ప్రతినిధులు

గిద్దలూరు, ఆగస్టు 11 : ఆవోపా ఆధ్వర్యంలో పేద ఆర్యవైశ్యులకు దుస్తులు పంపిణీ చేశారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలో ఆదివారం సాయంత్రం జొన్నలగడ్డ చిన్నరామయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు నిరుపేదలైన 100 మంది ఆర్యవైశ్య మహిళలు, పురుషులకు దుస్తులు పంపిణీ చేశారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లలో టాపర్ విద్యార్థులకు రిటైర్డ్ ప్రిన్సిపాల్ బొగ్గరపు వెంకటరామయ్య మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షులు దారా రాములు, కార్యదర్శి కొప్పరపు సుబ్బారావు, కోశాధికారి సూరె సుబ్బారావు, అమ్మవారిశాల అధ్యక్షులు గర్రె సత్యనారాయణ, గౌరవాధ్యక్షులు శివపురం అంజనేయులు, వాడకట్టు రంగసత్యనారాయణ, ఆవోపా ప్రతినిధులు గంగిశెట్టి శ్రీనివాసులు, ఆదినారాయణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

కార్పెంటర్ల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

పొదిలి, ఆగస్టు 11 : కార్పెంటరీ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర కార్పెంటర్ యూనియన్ కోశాధికారి సంషీర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. స్థానిక శివాలయంలో ఏర్పాటు చేసిన నూతన ఎన్నిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చెక్కపని కార్మికుల హక్కులను పరిరక్షించుకోవాలంటే అందరు ఐక్యంగా ఉండాలన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకొని మనం ముందుకు సాగాలన్నారు. వృత్తిరీత్యా ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా యూనియన్ దృష్టికి తీసుకురాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు సామంతపూడి నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్పెంటర్లకు ఉన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో ఉంచామని పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు. అంతేకాకుండా పోటీలకు పోకుండా పనులను అందరు సమం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలన్నారు. ఐక్యంగా ఉంటే ఎక్కడకు వెళ్లినా మన పనితనానికి విలువ ఉంటుందన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకుని ప్రమాణం చేయించారు. యూనియన్ అధ్యక్షులుగా రాచర్ల వెంకటరాజశేఖర్, ఉపాధ్యక్షులుగా షేక్ మస్తాన్‌వలి, సెక్రటరీగా మునగంటి రవి, జాయింట్ సెక్రటరీగా వడ్లమాని నారాయణ, కోశాధికారిగా గుత్తికొండ కల్యాణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో, జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, కార్యదర్శి ఫణితపు సుధాకర్, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఈదుమూడి రవి, వినుకొండ శ్యామల తదితర విశ్వబ్రాహ్మణ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మార్కాపురం, ఆగస్టు 11: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గుర్తుతెలియని మృతదేహం వెలుగులోకి వచ్చింది. స్థానికులు గమనించి పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతునికి దాదాపు 70 సంవత్సరాలు ఉన్నట్లు భావిస్తున్నారు. ఒంటిపై రోజ్ కలర్ చొక్కా, గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందింది.

ఐదుగురు పేకాట జూదరుల అరెస్టు

కొమరోలు, ఆగస్టు 11: మండలంలోని తాటిచర్ల గ్రామ వ్యవసాయ పొలాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై మధుసుధన్‌రావు తెలిపారు. వారి నుంచి రూ.3080లను స్వాధీనం చేసుకున్నారు.

ఖరీఫ్ సీజన్‌లో కనిపించని వరుణుడు

- సాధారణం కంటే 15.1 మి.మి లోటు వర్షపాతం
- చెరువులు, కుంటల్లో కనిపించని నీరు



చుక్కనీరు లేని మురారిపల్లె పెద్ద చెరువు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 11 : ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 56 రోజులు గడిచినా మండలంలో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. సాధారణం కంటే 15.01 మి.మి వర్షపాతం తక్కువగా నమోదయ్యింది. 2024 జూన్ 1వ తేదీ నుంచి ఆగస్టు నెల 11వ తేదీ వరకు మండలంలో 176.08 మి.మి సాధారణ వర్షపాతం కాగా, 150.01 మి.మి వర్షపాతం నమోదు అయ్యింది. మరో వైపురైతులు పొలాలు దుక్కులు దున్ని ఖరీఫ్ సాగుకు సిద్ధం చేసుకున్నారు. వర్షం కురిస్తే రైతులు కంది, పత్తి విత్తనాలు విత్తుకుందామనే వారికి నిరాశే మిగిలింది. సకాలంలో ఖరీఫ్ సీజన్‌లో వర్షం కురిసి భూములు పదునైతే 1225 హెక్టార్ల విస్తీర్ణంలో కంది, 2366 హెక్టార్ల విస్తీర్ణంలో పత్తి, 40 హెక్టార్ల విస్తీర్ణంలో ఆముదాలు, పెసర 33 హెక్టార్ల విస్తీర్ణంలో, జొన్న 11 హెక్టార్ల విస్తీర్ణంలో విత్తనాలు రైతులు విత్తుకునేవారు. మిరప 2942 హెక్టార్ల విస్తీర్ణంలో నాట్లు వేయావేయాల్సి ఉంది. సాధారణం కంటే 15.01 మి.మి వర్షపాతం తక్కువ నమోదు కావడం భూములు పదును కాకపోవడంతో రైతులు విత్తనాలు విత్తుకునే ప్రయత్నం చేయలేదు. వర్షాలు కురుస్తాయన్న ఆశతో మేఘాలపై చూసి నిరాశ చెందారు. ప్రస్తుతం మండలంలో 65 హెక్టార్ల విస్తీర్ణంలో కంది, 172 హెక్టార్ల విస్తీర్ణంలో పత్తి విత్తనాలు విత్తుకున్నారు. 6 హెక్టార్ల విస్తీర్ణంలో మిరప నాట్లు నాటారు. వర్షాలు కురవని కారణంగా వ్యవసాయబోర్లలో, తాగునీటి బోర్లలో భూగర్భ జలమట్టం అడుగంటింది. చెరువుల్లో, కుంటల్లో చుక్కనీరు లేక పోవడంతో పశువులకు కూడా తాగునీటి కోసం ట్యాంకర్ల పైనే ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ పంటల సాగు దేవుడెరుగు వర్షాలు లేక పశుగ్రాసం, కొరత తాగునీటి సమస్యతో పశుపోషణ కడుభారంగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాయితీపై ప్రభుత్వం పశుగ్రాసం సరఫరా చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రహదారిని ఆక్రమించి చర్చిగోడ నిర్మాణం

గతంలో ఒక పర్యాయం అడ్డుకున్న అధికారులు



రహదారిని ఆక్రమించి నిర్మిస్తున్న గోడ

పొదిలి, ఆగస్టు 11 : ప్రభుత్వ రోడ్డును ఆక్రమించి చర్చిగోడను నిర్మించడం స్థానికంగా చర్చనీ యాంశమైంది. పొదిలిలోని తెలుగు సెంటినరీ బాప్టిస్ట్ చర్చికి సచివాలయానికి వెళ్లే దారి వెంబడి గోడ ఉండేది. అయితే ఆ గోడను తొలగించి కొత్తగోడను నిర్మిస్తున్నారు. ఈ క్రమంలోనే సుమారుగా 5 అడుగుల మేరకు ఇరిగేషన్ కార్యాలయం, సచివాలయానికి వెళ్లే ప్రధాన రహదారిని ఆక్రమించి ప్రహరీగోడను నిర్మిస్తున్నారు. గతంలో ఒక పర్యాయం ఆక్రమిస్తూ నిర్మాణం తలపెట్టగా అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో వారు సర్వే చేసి ప్రభుత్వభూమిగా తేల్చి పనులు నిలిపివేయించారు. ప్రస్తుతం మళ్లీ ఉన్న పాతగోడను కూల్చివేసి కొత్తగా గోడను నిర్మాణం చేస్తున్నారు. గతంలో ఈ రహదారి మాదాలవారిపాలెంకు బండ్లబాటగా ఉండేదని పలువురు చెబుతున్నారు. రెండురోజులుగా నిర్మాణాలు జరుగు తున్నా అధికారులు కనీసం కన్నెత్తికూడా చూడడం లేదు. దీనిపై అంతర్యమేమిటని ప్రజలు విమర్శిస్తున్నారు. అంతేకాకుండా ప్రకాష్‌నగర్, బీసీకాలనీ, ఇస్లాంపేట ప్రాంతా లకు వెళ్లే రహదారిగా ఉంది. ఆ రహదారి నుంచి భారీ వాహనాలు వెళ్లేందుకు కొన్ని లక్షలు వెచ్చించి మరమ్మతులు చేశారు. ఇప్పుడు ఆ రహదారిని కొంతమేర ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తే రాకపోకలకు అంతరాయం కలిగే ప్రమాదం ఉందని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేవిధంగా గతంలో ఏబీఎం కాంపౌండ్ ముందు ఆర్అండ్‌బీ రహదారిని ఆనుకొని గ్రంథాలయం పేరున ఒక గదిని కూడా ఏర్పాటు చేశారు. అప్పట్లో విమర్శలు వచ్చినా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారు. ఇప్పుడు 100 ఏళ్ల క్రితం నిర్మించిన చర్చిగోడను తొలగించి రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేస్తున్నా అధికారులు మాత్రం స్పందించకపోవడం చర్చాంశనీయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ ఆస్తులపై చిన్నచూపు చూడకుండా వాటిని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

అపూర్వ సమ్మేళనం



సమావేశమైన నాటి విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 11: పట్టణంలోని ఎస్వీకేపీ కళాశాలలో బీకాం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 1976-79లో బీకాం విద్యార్థులు వారి అపూర్వ కలయికకు 45 సంవత్సరాలు పట్టింది. దేశ, విదేశాల్లో, పలు ప్రాంతాల్లో ఉన్నవారంతా ఆదివారం స్థానిక బాలాజీ ఇన్ ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. తమకు చదువు నేర్పిన అధ్యాపకులు డాక్టర్ ఐ.బాలసుబ్బారావు, బి.సుందరప్రసాద్, టి.కాశీరత్నం, పి.రాధాకృష్ణమూర్తి, వి.బాలరత్నం, జి.శంకర నారాయణలను సన్మానించారు. అలనాటి ముచ్చట్లు, సంతోషాలు, క్లాస్ రూముల్లో చేసుకున్న అల్లర్లు, భావోద్వేగాలు, మర్యాదకు మారురూపాలైన అలనాటి ప్రవర్తనను గుర్తుకు తెచ్చుకున్నారు. కళాశాల సమయంలో మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. పూర్వవిద్యార్థులు తాడువాయి మల్లికార్జునరావు, రమేష్ టాంక్, మోదాల రామారావు, చల్లా వరప్రసాద్; రమేష్ తదితరులు కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్యవైశ్యులకు అండగా కూటమి ప్రభుత్వం

ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల

ఘనంగా జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారోత్సవం



సభలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల, వెంకటేష్, ఎంపీ మాగుంట తదితరులు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 11: ఆర్యవైశ్యులకు టీడీపీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీ నివాసులురెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు లోని ఎంహెచ్ఎస్ కళ్యాణమండపలో జరిగిన జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఒంగోలు పార్లమెంటు పరిధిలో వ్యాపారులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని ఎంపీ మాగుంట పేర్కొన్నారు. వారికి ఎటువంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని ఆయన చెప్పారు. అలాగే మాజీ మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఐక్యంగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ. వెంకటేష్ మాట్లాడు తూ ఆర్యవైశ్యులు అంటే సేవాభావం కలవారని, అటు వంటి వారు రాజకీయంగా ఎదగా లని కోరారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన జిల్లా అధ్యక్షుడు కోట హనుమంతరావుకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దామచర్ల జనార్దన్, మాగుంట శ్రీనివాసులురెడ్డి, శిద్దా రాఘవరావు దంపతులను జిల్లా ఆర్యవైశ్య సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చినరామ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు, వా సవీ సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య అఫిషియల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు



ఎన్నికైన నూతన కమిటీ

పొదిలి, ఆగస్టు 11 : సమాజంలో సామాజిక సేవ చేసేందుకే ఆర్యవైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫిషినల్ స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఏవీఓపీపీఏ వ్యవస్థాపక అధ్యక్షులు రాచపూడి సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. ఆదివారం స్థానిక ఎన్‌జీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన కార్యవర్గ ఏర్పాటు కార్యక్రమంలో ఆయన పాల్గొని పొదిలి, మర్రిపూడి, కొనకనమిట్ల మండలాలకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశామన్నారు. ఆర్యవైశ్యుల్లో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించాలని, అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారిలో ముగ్గురికి నగదు పురస్కారం అందించి సన్మానించాలన్నారు. అధ్యక్షులిగా. డి కోటేశ్వరరావు, కార్యదర్శిగా పి నాగేశ్వరరావు, ట్రెజరర్ శ్రీనివాసులు, మహిళా విభాగంలో ఎంగీతసారది, వై రామలక్ష్మీ, పి సుజాత అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజపూడి సుబ్బారావు, రాష్ట్ర కోశాధికారి శంకర్ నారాయణగుప్తా, ఆర్యవైశ్య నాయకులు జీసీ సుబ్బారావు, యక్కలి శేషగిరిరావు, గునుపూడి మధు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

వానల కోసం పోలేరమ్మకు మొక్కులు



నైవేద్యాలు తీసుకువెళ్తున్న మహిళలు

పెద్దదోర్నాల, ఆగస్టు 11: వానలు కురవాలని మండలంలోని తిమ్మాపురం గ్రామంలో పోలేరమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవంలో భాగంగా పోలేరమ్మ దేవాలయంలో అమ్మవారికి అర్చకులు రామయ్యస్వామి ప్రత్యేక అలంకరణలు చేశారు. వేడుకల్లో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ప్రతిఇంటి నుంచి భక్తులు బోనాలతో అమ్మవారి బండి వెంట నడిచారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, గ్రామంలో సకాలంలో వానలు సమృద్ధిగా కురవాలని, పంటలు విరివిగా పండాలని అందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండేలా దీవించాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు దమాం పెద్ద చంచయ్య, నెల్లూరి కోటేశ్వరరావు, దమాం వెంకట సుబ్బయ్య మిరియాల నారాయణ, మండ్లా వెంకట సుబ్బయ్య నీలూరి వెంకటేశ్వర్లు, చిమ్మని వెంకటేశ్వర్లు, ఈరిశెట్టి నాగయ్య నీలూరి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంభం, ఆగస్టు 11 : చిన్నకంభం పంచాయతీ పరిధిలోని పోరుమామిళ్లపల్లె గ్రామంలో పోలేరమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఆదివారం జాతర



విశేష అలంకరణలో పోలేరమ్మ

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 11: మార్కాపురం పట్టణ శివార్లలో వెలసిన శ్రీఅల్లూరి పోలేరమ్మకు ఆదివారం జాతర వైభవంగా నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌ను అర్చకులు ప్రత్యేక పూలమాలలు, నిమ్మకాయదండలతో శక్తి స్వరూపిణిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు పొంగళ్లు వండినైవేద్యం సమర్పించారు. కుంకుమబండ్లు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. నాగశిలలకు పూజలు చేసి, నాగుల పుట్టల్లో పాలు పోశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వెన్నా శ్రీధర్‌రెడ్డి తదితరులు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

స్వచ్ఛంద సేవకునికి డాక్టరేట్



డాక్టరేట్‌ను అందుకుంటున్న శరత్‌బాబు

కొమరోలు, ఆగస్టు11 : మండలంలోని బాదినేనిపల్లి గ్రామానికి చెందిన లొక్కు శరత్‌బాబుకు జర్మనీ ఇంటర్‌నేషనల్ పీస్ యూనివర్సిటీ, పాండిచ్చేరి వేదికగా డాక్టరేట్ పట్టా ఇచ్చి గౌరవించింది. దివ్యా హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చేసిన సేవాకార్యక్రమాలను గుర్తించి ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. 13సంవత్సరాలుగా శరత్‌బాబు జిల్లాలో పలు సేవా కార్యాక్రమాలను చేస్తూ పలువురి మన్ననలు పొందారు. ఆయన సేవలకు అవార్డు దక్కిందని పలువురు పేర్కొన్నారు. అవార్డు గ్రహీత శరత్‌బాబు మాట్లాడుతూ మేము దివ్యాహెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ ద్వారా ఎంతో మంది పేదలకు, దివ్యాంగులకు ట్రై సైకిల్స్ బ్యాటరీ సైకిల్స్ అందజేసినట్లు తెలిపారు. కిరాణా దుకాణాలను పెట్టించడం, కరోనా సమయంలో అన్నదాన కార్యాక్రమాలను ఏర్పాటు చేయడం చేశామన్నారు. ప్రాణప్రాయ పరిస్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం దేవుడు తనకిచ్చిన వరంలా భావిస్తున్నామన్నారు. తనకు డాక్టరేట్ రావడం నా జీవితంలో మరుపురాని సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

పెద్ద దోర్నాల, ఆగస్టు 11: గ్రామ సర్పంచి, కార్యదర్శులకు నేటి నుంచి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాసర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతుల్లో గ్రామాభివృద్ధికి తీసుకోవాలసిన చర్యలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. మండలంలోని సర్పంచులు, కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

గిద్దలూరు : ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు తమ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హేమలత ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ సర్పంచులు కార్యదర్శులు శిక్షణ తరగతులకు హాజరుకావాలని పేర్కొన్నారు.

కంభం : అర్థవీడు మండల పరిధిలోని గ్రామపంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు విధులు, బాధ్యతలపై ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగే శిక్షణ కార్యక్రమాలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనుననట్లు తెలిపారు. కావున మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

శివశంకరాచారికి నటనలో డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శివశంకరాచారి

పెద్ద దోర్నాల, ఆగస్టు 11: నాటక రంగంలో రాణించిన నటుడికి అరుదైన గౌరవం లభించింది. దోర్నా లకు చెందిన ముత్తలూరి శివశంకరా చారి నటనకు ముగ్ధులైన జర్మనీకి చెందిన ఇంటర్నేషనల్ పీస్ యూనివర్శిటీ ఈ నెల 10న పాండిచ్చేరిలో డాక్టరేట్ సర్టిఫికేట్‌తో సత్కరించింది. దీంతో పలువురు ఆయనను అభినందించారు.

బదిలీపై వెళుతున్న సీఐకి సన్మానం

గిద్దలూరు టౌన్, ఆగస్టు 11 : గిద్దలూరు అర్బన్ సీఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై గుంటూరు ఓల్డ్ సిటీకి బదిలీ అయిన సీఐ సోమయ్యను ఆదివారం పలువురు టీడీపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన గిద్దలూరులో పనిచేస్తున్న సమయంలో సమర్ధవంతంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందారని ప్రశంసించారు. ప్రజాసేవ చేసే అధికారులకు ఎక్కడికి వెళ్లినా గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బోనబోయిన చంద్ర శేఖర్‌యాదవ్, లొక్కు రమేష్, పట్టణ పార్టీ అధ్యక్షులు షానేషావలి, టీడీపీ నాయకులు కడియం శేషగిరి, బిల్లా రమేష్, కిశోర్, తదితరులు ఉన్నారు.

కొత్తూరు రోడ్డుకు మోక్షమెప్పుడో..?



రాళ్లు తేలిన కొత్తూరు రోడ్డు

తర్లుపాడు, ఆగస్టు 11: మండలంలోని మంగళకుంట పంచాయతీలోని కొత్తూరు రోడ్డుకు మోక్షం ఎప్పుడు కలుగుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. కొత్తూరు నుంచి తాడివారిపల్లె వరకు సుమరు 5 కి.మీ దూరం ఉంది. ఈ రోడ్డుకు ఐదేళ్ల క్రితం టెండర్లు పిలవగా సదరు కాంట్రాక్టర్ మెటల్ పరిచారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పట్నుంచి ఈ రోడ్డు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ముఖ్యంగా మంగళకుంట, కొత్తూరు ప్రజలు నిత్యం ఈ రోడ్డు నుంచే తాడివారిపల్లె వెళ్తుంటారు. ఈ 5 కి.మీ దూరం ప్రయాణం చేయాలంటే ఆయా గ్రామాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో పంచాయతీ ఎన్నికలు జరిగిన సమయంలో గ్రామసర్పంచ్ పిన్నిక శారద తక్షణమే ఈ రోడ్డును తారురోడ్డుగా వేసేందుకు ఉన్నత స్థాయి అధికారులతో చర్చించి వేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అప్పటి నుంచి ప్రజలు పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించుకున్న పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఈ రోడ్డుకు ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని ప్రజలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్డుకు మోక్షం కలుగుతుందని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఐడీ క్లోజ్ కావడంతో నిలిచిన పనులు

మంగళకుంట-కొత్తూరు-తాడివారిపల్లె రోడ్డుకు ఐడీ క్లోజ్ కావటంతో ఐదేళ్ల నుంచి పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం కొత్త ప్రభుత్వంలో మరలా కొత్తూరు రోడ్డుకు టెండర్లు పిలిచి పనులు చేయాల్సి ఉంది.

ఏఈ శ్రీనివాసులరెడ్డి



టీడీపీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

రూ. 5 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

● ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

పామూరు, ఆగస్టు 11 : పామూరులో జన సాంద్రత కలిగిన ప్రాంతాలను గుర్తించి సుమారు రూ. 5 కోట్ల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతు పట్టణంలో వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వ స్థలాల్లో ఉన్న ఆక్రమణలను తొలగిస్తామన్నారు. పట్టణంలోని రెండు హిందూ శ్మశాన వాటికలను సుందరీకరణ కోసం అబివృద్ధి పనులు చేపడతామన్నారు. గడిచిన సాధారణ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం కష్టించి పని చేసిన కూటమి నాయకులకు, కార్యకర్తలకు నామినేట్ పదవుల్లో అవకాశాలు కల్పిస్తామన్నారు. జైకో నిధులతో మోపాడు రిజర్వాయర్ ప్రధాన కాలువకు సిమెంట్‌తో రివిట్‌మెంట్ అభివృద్ధి పనులు, తూము మరమ్మతు పనులు, జాతీయ రహదారి నుంచి రిజర్వాయర్ వరకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని, రిజర్వాయర్ లోపలి ప్రాంతంలో దట్టంగా పెరిగి ఉన్న చిల్లచెట్లను తొలగించే పక్రియను చేపట్టి కలుషితమైన నీటిని బయటకు తోడేందుకు చర్యలు తీసుకొంటామన్నారు. ఇటీవల జరిగిన ప్రభుత్వ పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులను చైర్మన్, వైస్‌చైర్మన్‌లుగా ఎన్నికయ్యేందుకు సహకరించిన వారందరినీ అభినందిస్తున్నామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు యారవ శ్రీనువాసులు, జిల్లా అధికార ప్రతినిధి వై. ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజా రహంతుల్లా, ఉప్పలపాటి హరిబాబు, షేక్ గౌస్‌బాష, తెలుగురైతు మండల అధ్యక్షులు మన్నం రమణయ్య, మాజీ సర్పంచ్‌లతో పాటు జనసేన జిల్లా కార్యదర్శి వై. రహిముల్లా తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణం చేస్తున్న మానవతా సంస్థ సభ్యులు

ఉత్తమ సమాజ నిర్మాణమే ధ్యేయం

పామూరు, ఆగస్టు 11 : ఉత్తమ సమాజ నిర్మాణం కోసం మానవతా సంస్థ సభ్యులు కృషి చేయాలని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్. రామచంద్రారెడ్డి సూచించారు. స్థానిక దివ్యజ్ఞాన సమాజంలో సంస్థ చైర్మన్ కే రామిరెడ్డి అధ్యక్షతన సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. సంస్థ తరుపున ఇప్పటి వరకు వెయ్యి మందికి ఉచిత బాడీఫ్రీజర్ బాక్స్‌లను అందించామని, శాంతి రథం సేవలను 20 మంది ఉపయోగించుకొన్నారని తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకొన్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా ఎం. ముసలయ్య, బాబూరావు, టి. రమేష్, రంగారెడ్డి, బాషామోహిద్దీన్, ఎస్. కృష్ణయ్యలను ఎన్నుకొని వారి చేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు రాటల గోపి, జిల్లా అధ్యక్షులు ఎస్. శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ కె యలమంద, భైరెడ్డి జయరామిరెడ్డి, అంబటి కొండారెడ్డి, పి. శివ, కె. నాగేశ్వరరావు, పి. మాల్యాద్రి, ఎం. తిరుపతి రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త డాక్టర్ రమేష్

అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలను ఎంచుకోవాలి

దర్శి, ఆగస్టు 11 : రైతులు పంటలసాగులో అధిక దిగుబడులు ఇచ్చే నూతన వంగడాలను ఎంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ బి. రమేష్ సూచించారు. స్థానిక కృషి విజ్ఞానకేంద్రంలో ఆదివారం రైతులకు పంటలసాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వ్యవసాయ మండలిలో 109 రకాల వాతావరణ మార్పులు తట్టుకునే నూతన వంగడాలను జాతికి అంకితం చేశారన్నారు. బయోపోర్టిఫై వంగడాలను రైతులు వినియోగించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఈ వంగడాలు తెగుళ్ళు, పురుగులను కూడా తట్టుకొని ప్రతికూల వాతావరణంలో కూడా ఆశించిన మేర దిగుబడులు అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త ఎం. శివ, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి పనులపై ప్రజా వేదిక

ముండ్లమూరు, ఆగస్టు 11 : స్థానిక మండ పరిషత్ కార్యాలయం వద్ద మండల ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై ప్రజావేదిక సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఆర్. జనార్దన్ తెలిపారు. 2023 - 24 సంవత్సరానికి గాను గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామ సభ నిర్వహించింది. అనంతరం మండల స్థాయిలో ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమానికి డ్వామా పీడీ అర్జునరావు హాజరవుతున్నట్టు తెలిపారు.

నేడు సర్పంచ్‌లకు శిక్షణ

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు గ్రామ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఆర్. జనార్దన్ తెలిపారు. పంచాయతీలకు మౌలిక వసతుల కల్పన, ముందస్తుగా చేపట్టే పనులు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు. ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు.

విద్యార్థుల మృతి దురదృష్టకరం

పామూరు, ఆగస్టు 11 : ఈతకు వెళ్లి విద్యార్థులు మృతి చెందటం దురదృష్టకరమని టీడీపీ నాయకులు యారవ శ్రీను, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు అన్నారు. ఆదివారం విద్యార్థుల మృతదేహాలను సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య, మైనార్టీ సెల్ నాయకులు షేక్ గౌస్‌బాష, కోఆప్షన్ మాజీ సభ్యుడు షేక్ ఖాదర్‌మోహిద్దీన్, మాజీ ఎంపీటీసీ ఇర్రికోటిరెడ్డి, వార్డు మెంబర్ షేక్ నాయబ్‌రసూల్, చిన హజరత్, మాచర్ల రహిమాన్‌లు ఉన్నారు.


మృతదేహాలకు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు

ఉన్నతాధికారుల ఆదేశాలతో కదిలిన యంత్రాంగం


దర్శి పట్టణంలో మైనర్ కాలువలో తొలగిస్తున్న మురుగు, చెత్త

దర్శి, ఆగస్టు 11 : మండలంలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించటంతో ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక వచ్చింది. తొలుత మందకొడిగా పారిశుధ్య కార్యక్రమాల నిర్వాహణ ఆరంభమైనప్పటికీ క్రమేపీ పనులు పుంజుకున్నాయి. దర్శి పట్టణంలో అనేక చోట్ల ఎంతోకాలంగా పేరుకొని నిల్వ ఉన్న మురుగు, చెత్తను ఎత్తి ఊరిబయట వేస్తున్నారు. పట్టణం మధ్యలో నుంచి వెళ్తున్న మైనర్ కాలువలో మురికి వెలికితీసి నీటిని కిందకు పంపుతున్నారు. ఇరువైపులా పెరిగిన పిచ్చిచెట్లు తొలగించి శుభ్రం చేశారు. గత కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో మురుగు వలన దోమల బెడద తీవ్రమైంది. దీంతో అధికారులు దర్శి పట్టణంలో మురుగు, చెత్తను పూర్తి స్థాయిలో తొలగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.


మైనర్ కాలువకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను తొలగించి శుభ్రం చేసిన దృశ్యం

పలుపంచాయతీల్లో నిధుల కొరత

పలు పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వాహణకు నిధుల కొరత ఏర్పడటంతో ఇబ్బంది పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఉన్న నిధులు అడ్డగోలుగా డ్రా చేసుకున్నారు. ఎలాంటి పనులు చేయకుండానే కొన్నిచోట్ల బిల్లులు చేసుకున్నారు. విచారణ జరపాలని ఉన్నతాధికారులను పలు గ్రామాల ప్రజలు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో చిన్న పంచాయతీల్లో నిధుల కొరత ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో చేపల పాటసొమ్ము ఉన్నప్పటికీ ఆ నిధులు కూడా డ్రా చేశారు. పలు చెరువుల్లో చేపలు పట్టుకున్నప్పటికీ పాటదారులు పాట సొమ్ము చెల్లించలేదు. పంచాయతీ అధికారులు అవలంబిస్తున్న నిర్లక్ష్యవైఖరి వలన ఈ దుస్థితి నెలకొంది. కొన్ని గ్రామాల్లో స్థానిక నాయకులు పారిశుధ్య కార్యక్రమాలకు నిధులు అందిస్తున్నారు. పంచాయతీల్లో సొమ్ము జమకాగానే మీకు తిరిగి ఇస్తామని చెప్పి పలువురు గ్రామ కార్యదర్శులు స్థానిక టీడీపీ నాయకుల చేత డబ్బులు ఖర్చు చేయిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో గత 15 రోజుల క్రితమే పారిశుధ్య కార్యక్రమాలకు డబ్బులు ఖర్చు చేసిన నాయకులకు పంచాయతీ అధికారులు ఇంత వరకు వారికి డబ్బులు చెల్లించలేదు. దీంతో తాము ఖర్చు చేసిన డబ్బులు తిరిగి ఇస్తారో లేదో అని నాయకులు ఆందోళనలు చెందుతున్నారు. కొందరు పంచాయతీ అధికారులు ఈ రోజు రేపు అంటూ కాలయాపన చేస్తున్నారు. నిధుల కొరత ఉన్న పంచాయతీల్లో బ్లీచింగ్, ఫాగింగ్ సక్రమంగా చేయటం లేదు. ఉన్నతాధికారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుధ్య కార్యక్రమాలు పూర్తిస్థాయిలో జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బడికి ఎలా వెళ్లాలి ?

బస్సులు లేక విద్యార్థుల ఇబ్బందులు

రోజూ ఒక్కొక్కరికి ఆటోకు రూ. 50 ఖర్చు

రోడ్డుకు మరమ్మతులు చేసినా నడపని ఆర్టీసీ అధికారులు



రహదారిపై గుంతలు పూడ్చిన స్థానికులు (ఇన్‌సెట్లో) బస్సులేక ఆటోలో వెనుక నిలబడి వెళుతున్న విద్యార్థులు

పామూరు, ఆగస్టు 11 :గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. చదువుపై ఆసక్తితో బడికి వెళ్లాలనుకునే విద్యార్థులకు రోడ్డు దుస్థితితో బస్సులు రాక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అక్కంపేట, పాత, కొత్త, రేణిమడుగు, రజసాహేబ్‌పేట, కమ్మవారిపాలెం గ్రామాల నుంచి 5 నుంచి 7 కిలోమీటర్ల దూరాన ఉన్న కంబాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉన్నత విద్య కోసం సుమారుగా 120 మంది విద్యార్థులు ఆర్టీసీ బస్సులు ఎక్కి పాఠశాలకు వచ్చేవారు. పామూరు మండలంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 16 ప్యాకేజీ రోడ్ల పనులకు సుమారుగా రూ. 75 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. హడావుడిగా గ్రావెల్ పనులు చేపట్టారు. అంతలోనే వర్షాలు రావడంతో గ్రావెల్ పరిచిన రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఈ లోగా ఎన్నికలు రావడం వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో కాంట్రాక్టర్లు పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. రోడ్లు సక్రమంగా లేని కారణంగా బస్సులు తిరగడం కష్టం కావడంతో అధికారులు నిలిపివేసారు. దాంతో పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తల్లి దండ్రులు ఆటోలకు ఒక్కో విద్యార్థికి రాను పోను రూ. 50 ఖర్చు చేసి బడికి పంపిస్తున్నారు. కొందరు ఆర్థిక భారం మోయలేక చాలిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామస్థులు వాగులపై నిర్మించిన చప్టాల వద్ద సొంతంగా అప్రోచ్‌రోడ్డు నిర్మించుకొన్నారు. తమ గ్రామానికి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ఆయ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే ఉగ్ర దృష్టికి తెచ్చారు. ఈ విషయం పై ఉగ్ర పలుమార్లు ఆర్టీసీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకొని వెళ్లారు.డిపో మేనేజర్ తన సిబ్బందితో రూట్ మ్యాప్‌ను పరిశీలించి వెళ్లారేగాని బస్సు సర్వీసును పునరుద్ధరించలేదు. దాంతో బడి కోసం పిల్లలు బస్సు కష్టాలు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసును పునరుద్ధరించి విద్యార్థుల కష్టాలు తొలగించాలని కోరుతున్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, ఆగస్టు 11 : పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ భక్తుల కోర్కెలు తీరుస్తున్న సోమవరప్పాడుపరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గుంటి గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర గ్రామాలకు చెందిన భక్తులతోపాటు వివిధప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో భక్తులతో సందడిగా మారింది. సోమవరప్పాడుకు చెందిన యద్దల రమేష్, ప్రహల్లాదరావు, కిషోర్, హేమచంద్, నాగశ్రావణి, హనుమంతరావు, నాగసూర్యకుమారి కుటుంబీకులు రూ. 15,000 విలువగల టేకు ఊయలను అమ్మవారికి బహూకరించారు. ఈకార్యక్రమంలో ఈవో పి.కార్తిక్ ఆలయకమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు) :మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలను జరుపుకొన్నారు. స్వామివారి మూల విరాట్‌కు అర్చకులు మంకాల సత్యనారాయణశర్మ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం గోశాలలోని గోవులకు పసుపు కుంకుమ పూసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు.అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థాన చైర్మన్ కొమ్మిచిన ఆదినారాయణ, అవధూత కురిమేటి బాలసుబ్రమణ్యం, భక్తులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో పోలేరమ్మకు..


ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

ముండ్లమూరు, ఆగస్టు 11 : మండలంలోని పలు గ్రామాల్లో పోలేరమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి నైవేద్యాన్ని సమర్పించారు. ముండ్లమూరు, నూజెండ్లపల్లి, బొప్పూడివారిపాలెం, పోలవరం, ఈదర, పసుపుగల్లు గ్రామాల్లో అమ్మవార్లకు కన్నుల పండువగా పూజలు నిర్వహించారు. అమ్మవార్లను ప్రత్యేక అలంకరణ చేశారు.

ఆ రహదారిపై ప్రయాణం అంటేనే హడల్

అధ్వానస్థితిలో ముండ్లమూరు - తమ్మలూరు ప్రధాన రహదారి

అవస్థలు పడుతున్న వాహన చోదకులు


రాళ్లు లేచి అధ్వానంగా ఉన్న రహదారి

ముండ్లమూరు, ఆగస్టు 11 : ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన స్థితికి చేరింది. రహదారిపై కంకర లేచి గోతుల మయమైంది. దీంతో ఈ రహదారిపై వాహన చోదకులు ప్రయాణం చేయలేక నానా అవస్థలు పడుతున్నారు. రెండున్నర కిలో మీటర్లు ఉండే రహదారిపై దాదాపు పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి ఉన్న సమయంలో రెండుసార్లు రహదారికి మరమ్మతులు చేశారు. 2019 నుంచి 2024 వరకు రహదారి దుస్థితి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. వాహన చోదకులే కాకుండా ముండ్లమూరు, పెద రావిపాడు, తమ్మలూరు గ్రామాలకు చెందిన రైతులు సైతం పొలాలకు వెళ్తుంటారు. రోడ్డుకు తోలిన కంకర లేచి పోవటంతో ఆ రహదారి మీద పలు చోట్ల గోతులు పడ్డాయి. వాహన చోదకులు వేగంగా వాహనాలు నడిపి టైర్లు పంచరై అదుపు తప్పి కింద పడి పోయి ప్రమాదాలకు గురైన సంఘటనలు కోకొల్లలు. పంచాయతీ రాజ్ శాఖకు చెందిన ఈ రహదారి ఇంతటి దుస్థితికి చేరినా ఆ శాఖ అధికారులు పట్టించుకోక పోవటంపై పలు గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వీధి కుక్కలకు వింత రోగం


వింత వ్యాధితో ఉన్న శునకం

పీసీపల్లి,ఆగస్టు11: గ్రామసింహాలుగా పేరొందిన వీధి కుక్కలు వింత రోగాల బారిన పడుతున్నాయి.అంటువ్యాధేమోనన్న భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వింత రోగాన పడిన కుక్కలకు ఒంటిమీద ఉన్న వెంట్రుకలు ఊడిపోతున్నాయి.ఆ తరువాత నల్లగా మచ్చలు వచ్చి ఆపై శరీరమంతా బొల్లిలాగా తెల్ల మచ్చలు ఏర్పడుతున్నాయి. మరికొద్ది రోజుల తరువాత కుక్క చర్మంపై చీము, రక్తం కారుతూ కనిపిస్తున్నాయి.ఈ వ్యాధి సోకిన కుక్కలు పీసీపల్లిలో తరచుగా కనిపిస్తున్నాయి. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు వ్యాధి సోకిన కుక్కలను చూసి భయాందోళన చెందుతున్నారు.

పంచాయతీ అధికారులు స్పందించి అంటు వ్యాధి సోకిన కుక్కలను గ్రామాల్లో తిరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజ్‌కుమార్

117 జీవోను రద్దు చేయాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజ్‌కుమార్

కనిగిరి, ఆగస్టు 11: గత ప్రభుత్వం ఇచ్చిన 117జీవోను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జోనల్ సమావేశం జిల్లా కార్యదర్శి నాయబ్‌రసూల్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల విద్యను నిర్వీర్యం చేసేందుకు గత ప్రభుత్వం చేసిన పాత ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న జీవో 53ను పునరుద్ధరించి హేతుబద్ధీకరణ చేపట్టాలని కోరారు. ఆదేవిధంగా స్కూల్‌లో రెండు మాధ్యమాలు ఉండాలని, ప్రతి హైస్కూల్‌కి తప్పని సరిగా హెచ్ఎంను నియమించాలని కోరారు. 2003 డీఎస్సీ వారికి వెంటనే పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి ఎయిడెడ్ పాఠశాలల్లో పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రమోషన్ కేడర్‌లో సర్వీస్ రెగ్యులరైజేషన్ ప్రక్రియ చేపట్టాలని, సర్దుబాటు ప్రక్రియలో అవకతవకలు లేకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు ఒంగోలు వెంకటేశ్వర్లు, ఇండ్లా ప్రసాద్, నజీర్‌బాషా, హజరత్‌రెడ్డి, తోట శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్‌బాబు, బీవీఎస్ ప్రసాద్, కే రామమోహన్, పాకల శ్రీను, బీ హరిబాబు, రమేష్‌బాబు, దండె శ్రీనివాసులు, ఆరుమండలాల ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అంబులెన్స్ ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు

కనిగిరి, ఆగస్టు 11: ప్రైవేటు అంబులెన్స్ ఢీకొన్న ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎదుట జరిగింది. పామూరు వైపు నుంచి ప్రయివేటు అంబులెన్స్ పేషెంట్‌ను ఎక్కించుకుని కనిగిరి మీదుగా ఒంగోలు వైపునకు వస్తోంది. అయితే ఒంగోలు వైపునకు వెళ్ళాల్సిన అంబులెన్స్ రోడ్డు ఎడమవైపునకు వెళ్ళకుండా కుడివైపునకు వేగంగా వచ్చింది. ఇదే సమయంలో వెలిగండ్ల మండలం కొటాపల్లికి చెందిన సానా నారాయణరెడ్డి అనే వృద్ధుడు ప్రభుత్వాసుపత్రిలో నుంచి రోడ్డుపైకి వచ్చాడు. రోడ్డుపైకి వచ్చిన వృద్ధుడిని వెనుక నుంచి వచ్చిన అంబులెన్స్ వేగంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో రోడ్డుపైకి ఎగిరిపడిన నారాయణరెడ్డికి తలకు బలమైన గాయమై, కుడికాలు విరిగిపోయింది. దీంతో క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● 10మంది అరెస్ట్ ● రూ. 85,670 స్వాధీనం

మండలంలోని బడుగులేరు గ్రామ పొలాల్లో పేకాట స్థావరంపై ఎస్ఐ త్యాగరాజ్ తన సిబ్బందితో ఆదివారం ఆకస్మిక దాడి చేశారు. పది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.85,670లు నగదు, మోటర్‌బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పేకాట, కోడిపందాలు లాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సాగించే వారి వివరాలు అందించాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
సోమవారం 12 ఆగస్టు 2024



పేరుగొప్ప.. ఊరుదిబ్బ

"ఇల్లు లేని వారు ఉండకూడదు.. జీవనమే కష్టంగా ఉండే బడుగు జీవుల ఇంటి కలను నెరవేరుస్తాం.. గత ప్రభుత్వాల్లా స్థలాలు ఇవ్వడం కాదు.. స్థలంతో పాటు ఇల్లు కట్టించి ఇస్తాం.. అంటూ గత వైసీపీ ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతూ ఐదేళ్లు కాలయాపనతో సరిపెట్టింది. కాలనీలు కాదు ఊళ్లు నిర్మిస్తున్నామంటూ ఊరూరా జగనన్న కాలనీల పేరుతో పేదలను వంచించింది. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పేరుతో ప్రభుత్వం హడావుడికే పరిమితమైంది. ఊరూరా వెలిసిన జగనన్న కాలనీలు పేరుగొప్ప.. ఊరుదిబ్బ అన్న చందంగా మారాయి. నిర్మాణాల దగ్గర నుంచి మౌలిక వసతుల కల్పన వరకు అన్నీ సమస్యలుగా ఉన్నాయి. నిర్మాణాలు జరగని ప్రాంతాల్లో కాలనీలు చిట్టడవులను తలపిస్తున్నాయి. 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పేరుతో వైసీపీ ప్రభుత్వం చేసిన హడావుడి ప్రకటనలకే పరిమితమైందని జగనన్నకాలనీల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. పేదలందరికీ స్థలాలు ఇచ్చి, వారికి ఇళ్లు నిర్మించి ఇస్తానని జగన్ చెప్పిన మాట ఆచరణలో నీటి మూటగానే మిగిలిపోయింది. అటు ఇళ్లు వచ్చిన సంతోషం లేక.. మరోవైపు అప్పుల పాలై లబ్ధిదారులు అల్లాడిపోతున్నారు."



రేపల్లె 18వ వార్డు జగనన్న కాలనీలో రహదారి నిర్మాణం చెయ్యకపోవటంతో బురదమయంగా మారిన దృశ్యం

- అధ్వానంగా జగనన్న కాలనీలు
- అంతర్గత రోడ్లు, డ్రెయిన్లు లేక అవస్థలు
- చిన్నపాటి వర్షాలకే కాలనీలు జలమయం
- గృహాల చుట్టూ మురుగునీరు, పిచ్చి మొక్కలు
- బిల్లులు రాక పలు ప్రాంతాల్లో నిలిచిన నిర్మాణాలు
- పేరేచర్లలో పూర్తి కాకముందే కూలుతున్న గృహాలు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 11: కాలనీలు కాదు.. ఊళ్లను నిర్మిస్తున్నామని పదుల ఎకరాల్లో లేఅవుట్లు వేసి వందల మందికి గత జగన్ ప్రభుత్వం స్థలాలు ఇచ్చింది. అయితే జగన్ ఐదేళ్ల పాలనలో ఎక్కడా ప్రభుత్వం చెప్పినట్లు కాలనీలు ఊళ్లుగా మారలేదు కాని చిట్టడవులు, బురదగుంతలను తలపించేలా మారాయి. పునాదుల దగ్గరే నిలిచిపోయిన ఇళ్లు, వర్షపు నీటిలో మునిగిపోయిన కాలనీలు, పిచ్చి మొక్కలు, చెట్లతో చిట్టడవుల్లా మారిన పరిసరాలు, మొండిగోడలకే పరిమితమైన నిర్మాణాలు, స్లాబు వేయకముందే పడిపోవడానికి సిద్ధంగా ఉన్న గోడలు, బురద గుంతలతో కూడిన రోడ్లు, నిర్మాణాలు పూర్తి చేసిన ప్రాంతాల్లో బిక్కుబిక్కుమంటూ, సరైన వసతులు లేక అల్లాడుతున్న జనం.. ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఉన్న జగనన్న కాలనీల దుస్థితి. గుంటూరు జిల్లాలో 247 లేఅవుట్లలో 66,554 ఇళ్లు నిర్మించేందుకు వైసీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే 18,523 ఇళ్లను మాత్రమే పూర్తి చేశారు. మొత్తంగా గుంటూరు జిల్లాలో 27 శాతం ఇళ్లు మాత్రమే పూర్తి అయ్యాయి. పల్నాడు జిల్లాలో 224 కాలనీలను ఏర్పాటు చేయగా 39,312 గృహాలు నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటికి 12,224 గృహాల నిర్మాణం పూర్తయింది. 10,842 గృహాల నిర్మాణ పనులు ప్రారంభించి మమ అనిపించారు. 10,672 గృహాలు నిర్మాణం పునాదులు దాటలేదు. పేదల సొంతింటి కల ఐదేళ్ల తర్వాత కూడా కలగానే మిగిలిపోయింది. పేదల ఇళ్ల కోసం ఒక్కొక్కరికీ సెంటు స్థలం పంచి పెట్టి హడావుడి చేసిన జగన్ ప్రభుత్వం.. ఇళ్లు కూడా కట్టిస్తామని ప్రగల్భాలు పలికి పిల్లిమొగ్గలు వేసింది. ఇళ్లు కట్టుకోవడానికి సిద్ధమైన పేదలకు కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై పథకం కింద ఇచ్చే గృహరుణాలతో సరిపుచ్చింది. అరకొర నిర్మాణాలు జరిగిన ప్రాంతాల్లో సరైన రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు తదితర సౌకర్యాలు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. అపరిశుభ్రత, విష సర్పాలతో ఆయా ఇళ్లలో ఉండలేక కాలనీలు వదిలేసి వెళ్లిపోయిన వారు కూడా ఉన్నారు. తమ సొంతింటి కల అర్ధాంతరంగా ఆగిపోవడంతో పేదల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇళ్లు పూర్తి చేయాలంటే ఏం చేయాలో కూడా తెలియని దిక్కు తోచని స్థితిలో పేదలు అల్లాడుతున్నారు. ఆహ్లాదకర వాతావరణంతో పాటు విద్య, వైద్యం అన్నీ కాలనీల్లో ఇంటికి సమీపంలోనే అందేలా ఏర్పాటు చేస్తానని చెప్పిన ప్రభుత్వం కనీసం మౌలిక వసతులు కూడా కల్పించలేకపోయింది. ప్రధానంగా పట్టణ, గ్రామాలకు దూరంగా ఉండే ప్రాంతాల్లో కాలనీలు ఏర్పాటు చేయడంతో రవాణా సౌకర్యం లేక చాలామంది ఇళ్ల నిర్మాణాలపై ఆసక్తి చూపలేదు. కొందరు ఇల్లు నిర్మించుకుంటే మరి కొందరు బేస్‌మెంట్ వరకూ కట్టి వదిలేశారు. మరి కొందరు కనీసం ఎటువంటి పనులు కూడా ప్రారంభించలేదు. వర్షం కురిస్తే కాలనీలకు చేరాలంటే ప్రజలకు నరకంగా ఉంది. బురదమయమైన రోడ్లతో కనీసం నిత్యం దైనందిన కార్యక్రమాలకు వెళ్లేందుకు కూడా నానా అవస్థలు పడుతున్నారు. ప్రారంభంలో వేసిన గ్రావెల్ కూడా వర్షానికి కొట్టుకుపోయి, గుంతలు మిగలడంతో ఇసుక లారీలు, ట్రాక్టర్‌లు కూడా వెళ్లే వీలులేక నిర్మాణాలు అర్థంతరంగా నిలిచిపోయాయి. స్లాబ్‌వరకూ పూర్తైన ఇళ్లకు బిల్లులు రాకపోవడంతో పేదలు మధ్యలోనే నిర్మాణాలను ఆపేసుకున్నారు. దుగ్గిరాలలో బకింగ్‌హామ్‌కాల్వకు అంచున కాలనీలో ప్లాట్లు ఉండటంతో కాల్వ నిండుగా ప్రవాహం ఉన్నసమయాల్లో ఉరకెత్తుతూ కాలనీపరిసరాలు నీటితో నిండిపోతున్నాయి. జగనన్న కాలనీలో వర్షం వచ్చిందంటే కాలు మోపలేని పరిస్థితి. ఎటు చూసిన రోడ్లన్నీ గుంతలు మయం. చిన్న పాటి వర్షం వచ్చినా కాలు పెట్ట లేని దుస్థితి పలు కాలనీల్లో ఉంది. కాలనీవాసులు ప్రయాణించే ప్రధాన రోడ్డుపై వర్షం నీరు నిల్వ ఉండటంతో కనీసం ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి. మాచర్లలో 5110 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వగా 150 మంది మాత్రమే ఇళ్లు కట్టుకున్నారు. పల్నాడులో కొన్ని ప్రాంతాల్లో సెంటున్నర స్థలాలు ఇచ్చినా అవి రాళ్లు, రప్పలు, కొండ గుట్టలుగా నివాస యోగ్యం కాని భూములనే ఎంపిక చేశారు. అనేక గ్రామాల్లో జగనన్న కాలనీలకు ఎంపిక చేసిన స్థలాలు ఊరికి దూరంగా నివాస యోగ్యం కానివి కావడం, ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకు రాలేదు. ప్రస్తుతం ఇలాంటి ప్రాంతాలన్నీ కూడా చిట్టడవులను తలపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు జగనన్న కాలనీలు నిలయాలుగా మారాయి. సత్తెనపల్లి పరిధిలోని పాకాలపాడు, కంకణాలపల్లి, గర్నెపూడి లే అవుట్లలో ఇళ్ళు నిర్మించుకోవటానికి లబ్ధిదారులు ఎవ్వరూ ముందుకు రాలేదు.

కట్టారు.. కూలుతున్నాయి..

గుంటూరుకు అత్యంత సమీపంలో పేరేచర్లలో 4 వందల ఎకరాల్లో కాలనీ ఏర్పాటు చేసి 18వేల ప్లాట్లును లబ్ధిదారులకు పంపిణీ చేసింది. అయితే లే అవుట్ వేయడం వరకు హడావుడి చేసిన అధికారులు గృహ నిర్మాణాలను గాలికి వదిలేశారు. గృహ నిర్మాణాలను చేసుకోలేని లబ్ధిదారుల కోసం నలుగురు కాంట్రాక్టర్లను ఎంపిక చేశారు. వారంతా వైసీపీ వారే కావడంతో ఇష్టారాజ్యంగా గృహ నిర్మాణాలు చేపట్టారు. రూ.70 వేలతో పునాదులతో నిలిపివేసి కాంట్రాక్టర్లు బిల్లులు చేసుకుని వెళ్లిపోయారు. దీంతో ఆ పునాదులు ప్రస్తుతం పిచ్చి చెట్లతో నిండిపోయాయి. మరికొన్ని గృహాలకు శ్లాబ్‌లు వేశారు. పది కాలాలు పాటు పటిష్టంగా ఉండాల్సిన గృహ నిర్మాణాలు పూర్తి కాకముందే పగుళ్లిచ్చి కూలిపోతున్నాయి. నాసిరకం పనులు చేసి అయిన కాడికి బిల్లులు చేసుకొని కాంట్రాక్టర్లు ఉడాయించగా లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. మేతకు వెళ్లిన గేదెల కాళ్లు తగిలి గోడలు కూలిపోతున్నాయంటే నిర్మాణాల పటిష్టత ఏవిధంగా ఉందో తెలుసుకోవచ్చు. 18 వేలకు కేవలం నాలుగు వందల గృహాలు పూర్తికాగా వారు కూడా ఆయా ఇళ్లలో ఉండేందుకు భయపడుతున్నారు. కాలనీలో అంతర్గత రహదారులు, డ్రెయిన్లు, తాగునీటి సౌకర్యాలు లేవు.



వేమూరు: అబ్బనగూడవల్లిలో బేస్ లెవల్లో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలు

ప్రచారం కోసం ప్రారంభోత్సవాలు

లక్షల సంఖ్యలో ఇళ్లు కట్టాము.. ఆ ఇళ్లలో పేదలు ఆనందంగా ఉంటున్నారు.. అని ఎన్నికలకు ముందు ప్రచారం చేసుకున్న జగన్ ఆ పరిస్థితి క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించదు. ఎన్నికలకు ముందు హడావుడిగా కొన్ని ఇళ్లను పూర్తి చేసి గృహప్రవేశం చేయించినట్లుగా హడావుడి చేసింది. అయితే కాలనీల్లో ఈనాటికీ మౌలిక సదుపాయాలు లేవు. కాలనీలకు వెళ్లడానికి కనీసం అప్రోచ్ రోడ్లు కూడా లేవు. రాష్ట్రంలో అతిపెద్ద లే అవుట్‌గా చెబుతున్న గుంటూరు సమీపంలోని పేరేచర్ల లే అవుట్‌కు వెళ్లే దారి అత్యంత దారుణంగా ఉంది. ఇదే పరిస్థితి అన్ని ప్రాంతాల్లోని జగనన్న కాలనీల్లో నెలకొని ఉంది. కాలనీలు మురుగునీటిలో మునిగిపోయి, నిర్మాణాలు నానిపోతున్నాయి. విద్యుత్ లైన్లు, వీధిదీపాలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయల కల్పన జగన్న కాలనీల్లో మచ్చుకు కూడా కనిపించడం లేదు. ఈ స్థితిలో ఇళ్లు పూర్తయినా లబ్దిదారులు ఆ వైపు చూడడం లేదు. గత ప్రభుత్వం ప్రారంభించిన ఇళ్ల నిర్మాణంపై కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై పేదల సొంతింటి ఆశ ఆధారపడి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏదైనా సాయం అందితే తప్ప వారు ఇళ్లు పూర్తిచేసుకోలేని పరిస్థితి.

అప్పులకు వడ్డీలతో కుదేలు..

కేంద్రం ఇచ్చే రూ.లక్షా 80 వేలు పునాదులకే సరిపోవడంతో నిర్మాణాలు చాలా చోట్ల నిర్మాణాలు అక్కడితోనే ఆగిపోయాయి. మరికొందరు అప్పులు చేసి గొడల వరకూ ఇళ్లను నిర్మించుకున్నారు.. కానీ ఆ తర్వాత స్తోమత లేక, అప్పులు పుట్టక ఇళ్లు మధ్యలోనే నిలిపేసుకున్నారు. ఆగిపోయన ఇళ్లను పూర్తి చేయాలని ప్రభుత్వం లబ్ధిదారులపై పెద్దఎత్తున ఒత్తిడి తెచ్చినా వారు తమ వల్ల కాదంటూ చేతులెత్తేశారు. గృహాలు నిర్మించుకోకపోతే పట్టాలు స్వాధీనం చేసుకుంటామని అధికారులు బెదిరించి కొందరుతో బలవంతంగా నిర్మాణాలు చేపట్టినా ఆయా ఇళ్లలో ఉండే పరిస్థితి లేదు. ఐదేళ్ల తర్వాత చూస్తే సొంత ఇంటి కల కోసం అప్పులపాలై, ఆ కల నెరవేరక వడ్డీలు కట్టుకుంటూ, ఇళ్లు పూర్తి కాకపోవడంతో ఇళ్లకు అద్దెలు కట్టుకుంటూ లబ్ధిదారులు మరింత కుదేలైపోయారు. నివాసయోగ్యం కానిచోట ముంపునకు గురయ్యే ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది.



బాపట్ల : జగనన్నకాలనీలలో పేదల ఇళ్ళు



బాపట్ల: మూలపాలెం జగనన్నకాలనీలో అసంపూర్తిగా వున్న గృహనిర్మాణాల మధ్య పెరిగిన మొక్కలు



బాపట్ల : మూలపాలెం జగనన్నకాలనీలో అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్లు


ఆంధ్రజ్యోతి పరిశీలన



బాపట్ల: ముళ్ళకంపలు, జిల్లేడు చెట్లతో నిండిపోయిన కర్లపాలెం జగన్న కాలనీ




రేపల్లె: బిల్లులు రాకపోవటంతో మధ్యంతరంలోనే నిలిచిపోయిన ఇళ్ళ నిర్మాణం



రేపల్లె డ్రెయిన్‌లో ఏపుగా పెరిగిన తుంగ, మురుగు పారుదల లేక కాలనీవాసులు అవస్థలు

పెరిగిన వరద.. వణుకు

- కృష్ణానదిలో పెరిగిన ప్రవాహం
- ముంపు బారిన పల్లపు ప్రాంతాలు.. పంటలు
- లంక గ్రామాల ప్రజలు, రైతుల్లో భయాందోళనలు



అరవింద వారధి వద్ద వరద ఉధృతి



గాజుల్లంక చినరేవు సమీపంలో వరద నీటి ముంపునకు గురైన మిరప చేను



ముంపు బారిన పూల తోట, వరద నీటిలోనే పూలు కోస్తున్న రైతులు

కొల్లూరు, భట్టిప్రోలు, ఆగస్టు 11: కృష్ణానదికి మళ్లీ స్వల్పంగా వరద ప్రవాహం పెరిగింది. దీంతో లంక గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. వరద ప్రవాహం ఒకరోజు తగ్గుతూ ఒక రోజు పెరుగుతుంది. ప్రకాశం బ్యారేజీ నుంచి ఆదివారం తెల్లవారుజామున దిగువకు 3 లక్షల పైచిలుకు నీటిని బ్యారేజీ అధికారులు విడుదల చేశారు. దీంతో కొల్లూరు మండలంలోని అరవింద వారధి, చింతల్లంక, గాజుల్లంక, జువ్వలపాలెం, భట్టిప్రోలు మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక పరిధిలోని చినరేవు వెంబడి గ్రామాల పరిధిలోని పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. చింతల్లంకలో బంతి తోటలోకి, గాజుల్లంక వద్ద చినరేవు ఉప్పొంగడంతో మిరప తోటలోకి వరద నీరు చేరింది. దోనేపూడి వద్ద పోతార్లంక చప్టాపై రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తుంది. దీంతో ఆ రహదారిలో రాకపోకలను పోలీసులు నిలిపి వేశారు.

పంట రుణాలు.. సగమే

- ఖరీఫ్ లక్ష్యానికి సుదూరంగా బ్యాంకులు
- రూ.5 వేల కోట్లకు ఇచ్చింది రూ.2593 కోట్లే
- ఒక్కరికి కూడా రుణం ఇవ్వని సహకార సంఘాలు

గుంటూరు సిటీ, ఆగస్టు 11: ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉంది. వరుణుడి కరుణతో పుష్కలంగా సాగునీరు అందుబాటులోకి రావడంతో రైతులు సాగుకు సిద్ధమయ్యారు. అయితే వ్యవసాయ ఖర్చులకు పెట్టుబడులపైనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇటీవల జిల్లాల కలెక్టర్లు బ్యాంకర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి వ్యవసాయ రుణాలకు లక్ష్యాలు నిర్దేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా వారికి వ్యవసాయ రుణాలు ఇవ్వాలని కలెక్టర్లతో పాటు ప్రభుత్వం కూడా ఆదేశించింది. అయితే బ్యాంకర్లు తమ సహజ ధోరణితో రైతులకు రుణాలు ఇచ్చే విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. లక్ష్యాల్లో ఇప్పటి వరకు సగం రుణాలు కూడా ఇవ్వలేదని తెలుస్తోంది. లక్ష్యం ఘనంగా ఉన్నా ఇచ్చింది మాత్రమే నామమాత్రమే అన్నట్లుగా పరిస్థితి ఉంది. లక్షా 25 వేల 804 మంది రైతులకు ఖరీఫ్‌లో పంట రుణాలను రూ.5050 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వం బ్యాంకర్లకు లక్ష్యాలు నిర్దేశించింది. అయితే ఇప్పటివరకు ఇచ్చింది కేవలం రూ.2593 కోట్లు మాత్రమే. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న సహకార సంఘాల్లో ఇంతవరకు ఒక్క రైతుకు కూడా వ్యవసాయ రుణం ఇవ్వలేదు ఖరీఫ్ ఆరంభమై రెండు నెలలు దాటినా పెట్టుబడులకు రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడానికి నగదు అందుబాటులో లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొందరు బ్యాంకర్లు వంతుల వారీగా రుణాలు ఇస్తుండటంతో ఇబ్బందులు ఎదురౌతున్నట్లు రైతులు వాపోతున్నారు. కొన్ని చోట్ల రికవరీ ఆధారంగా రుణాలు ఇస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి అక్టోబరు వరకు ఉంటుంది. ఈ ఏడాది జూన్, జూలై మాసాల్లోనే ఎక్కువ మంది రైతులు సాగుకు ఉపక్రమించారు. ఎక్కువ మంది రైతులు రుణాలు మీద ఆధారపడే సాగుకు సిద్ధపడుతున్నారు. తీరా బ్యాంకులు మొండి చేయి చూపిస్తుండటంతో పెట్టుబడులకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ బ్యాంకుల్లోనే సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. కౌలు రైతులు కూడా రుణాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు రైతులకు కిసాన్ కార్డులు ఉన్నా కూడా రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు తిప్పుకుంటున్నట్లు సమాచారం.



సొసైటీల్లో అసలే లేవు

వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ఇంతవరకు ఒక్క రుణం కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం ఆయా సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిలుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 167 సహకార సంఘాల్లో ఖరీఫ్ ఆరంభానికి ముందే ప్రణాళికలు రూపొందించి పంపారు. మళ్లీ అంచనాలు పంపాలని చెప్పడంతో విషయం మొదటికి వచ్చింది. సహకార సంఘాల్లో రుణాలు మంజూరు వ్యవహారం గతంలో వివాదాస్పదమైంది. గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలోని పలు సొసైటీల్లో బోగస్ పాసు పుస్తకాలతో రుణాలు పొందినట్లు ఆరోపణలు వచ్చాయి. దాంతో అప్పట్లో సొసైటీ ప్రెసిడెంట్ల ఆస్తులను జప్తు చేశారు. ఇప్పుడు పంట రుణాలు వ్యవహారంలో పర్సన్ ఇన్‌చార్జిలు ముందుకు రాకపోవడానికి ఇదొక కారణంగా కనిపిస్తుంది. కొద్ది రోజులు ఉండి పోయే వ్యవహారంలో అవకతవకలు జరిగితే ఉద్యోగాలు పోతాయన్న భయం వారిని వెంటాడుతోంది. రికవరీ రేట్ ఎక్కువగా ఉన్న సంఘాల్లో కూడా రుణాలు ఇవ్వకపోవటం దారుణమని పలువురు జిల్లా సహకార అధికారికి లేఖలు రాశారు.

రాజధాని రైతులకు రుణాలు లేవు

రాజధాని అమరావతి ప్రాంతంలోని రైతులకు పంట రుణాలు పూర్తిగా నిలిపివేశారు. పూలింగ్ కు పోని భూముల్లో సాగు పనులు జరుగుతున్నాయి. అయినా బ్యాంకులు తమకు రుణాలు ఇవ్వడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదంటున్నారు.



స్ట్రయిట్ కట్ వద్ద ఆందోళన చేస్తున్న మైనార్టీ ప్రతినిధులు

హంతకులను కఠినంగా శిక్షించాలి

● బాధిత కుటుంబానికి అండగా ముస్లిం నేతల ఆందోళన

● రహదారిపై బైఠాయింపు ● సర్ది చెప్పిన పోలీసులు

ఈపూరుపాలెం (చీరాలటౌన్), ఆగస్టు 11 : జిమ్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న అమీన్ ఆరీఫ్(18)పై హత్యకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని చీరాల పట్టణ, రూరల్ పరిధిలోని పలువురు ముస్లిం మైనార్టీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈనెల 6వ తేదీన ఆరీఫ్ హత్యతో ఆందోళన నెలకొంది. దీనిపై ఇప్పటికే ఒకసారి పలు సంఘాల ప్రతినిధులు బాధిత కుటుంబానికి సంఘీభావం తెలుపుతూ పట్టణంలో రోడ్డుపై బైఠాయించారు. ఇదిలావుండగా తిరిగి ఆదివారం రాత్రి ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ కాలువ వద్ద పెద్ద ఎత్తున చేరుకుని వాహనాలను నిలిపి వేసి ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ చీరాల్లో గంజాయి, మద్యం వంటి అసాంఘిక కలాపాలు జోరుగా సాగుతున్నాయన్నారు. కోడి పందేలు కూడా జరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలోనే ఆరీఫ్, సుచరిత, లలితమ్మ హత్యలు జరిగినట్లు పేర్కొన్నారు. దీనిపై పోలీసుల నిఘా పెంచాలన్నారు. ఆరీఫ్ కేసులోని ఇన్వెస్టిగేషన్ అధికారిని మార్చాలని డిమాండ్ చేశారు. కోడి పందేలు అరికట్టినట్లయితే ఆరీఫ్ కోడి కత్తితో మృతి చెందాల్సి ఉండేది కాదన్నారు అసాంఘిక శక్తులకు కొందరు పోలీసుల సహకారం ఉందని ఆరోపించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరించేందుకు కచ్చితంగా కృషి చేస్తామని సర్ది చెప్పారు.

పోలీసుల అదుపులో హంతకులు

అరీఫ్‌ను హతమార్చిన హంతకులలో ముగ్గురిని ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని స్టేషన్‌లో విచారణ చేస్తున్నారు. అలాగే కేసులో మరో వ్యక్తి కోసం గాలింపు సాగిస్తున్నారు. నేడో రేపో హంతకులను అధికారికంగా అరెస్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తులో ఆరు బృందాలు పనిచేస్తున్నట్లు సమాచారం.

దొంగ క్రీడా సర్టిఫికెట్‌లతో ప్రభుత్వ శాఖల్లో పలువురు తిష్ఠ

సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ద్వారా జారీ

రూ.లక్షలు దండుకున్న పీఈటీ

ఎంబీబీఎస్ కోసమే అధికంగా విక్రయం

కలెక్టర్ ఆదేశాలతో ఇప్పటికే ప్రారంభమైన విచారణ

ఇదేవిషయమై క్రీడా మంత్రికి సంఘాల ప్రతినిధులు ఫిర్యాదు

కదులుతున్న బోగస్ డొంక!

సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ పేరుతో బోగస్ కీడా ధ్రువీకరణ పత్రాల డొంక కదులుతోంది. దీనిపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'సాఫ్ట్‌గా దొంగాట' శీర్షికన ప్రచురితమైన కథనం ప్రకంపనలు సృష్టిస్తోంది. అసోసియేషన్ ప్రతినిధులు, ఆ సర్టిఫికెట్‌ల ద్వారా పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్న వారిలో వణుకు మొదలైంది. ఎంబీబీఎస్ సీట్ల కోసం అత్యధికంగా సర్టిఫికెట్లు విక్రయించినట్లు తెలుస్తోంది. అందుకు సంబంధించి సంఘప్రతినిధిగా ఉన్న ఓ ప్రభుత్వ పీఈటీ ఒక్కొక్కరి వద్ద రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలోని క్రీడాసంఘాలు, పీఈటీ సంఘ నాయకులు ఆదివారం విజయవాడ వెళ్లి క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.



ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 11 : క్రీడా సంఘం పేరుతో ఓ వ్యాయామోపాధ్యాయుడు బోగస్ సర్టిఫికెట్ల బాగోతానికి తెరతీశాడు. అందిన కాడికి దండుకున్నాడు. పదేళ్లలో మొత్తం 300 వరకూ సర్టిఫికెట్లు జారీ చేశాడు. అందులో సుమారు 150 వరకూ వైద్య విద్యార్థులకు అమ్మినట్లు తెలుస్తోంది. వాటిని సమర్పించి స్పోర్ట్ కోటాలో పలువురు ఎంబీబీఎస్ సీట్లు పొందారు. మరికొందరు ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిపోయారు. ఇంతకాలం గుట్టుచప్పుడు కాకుండా సాగిన ఈ వ్యవహారం ఇప్పుడు బహిర్గతమైంది. దీనిపై ఇప్పటికే ప్రభుత్వ పీఈటీలతో పాటు పలు క్రీడా సంఘాలు నిరసనలు చేపట్టాయి. కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రాలు కూడా సమర్పించాయి. దీనిపై స్పందించిన ఆమె ఆదేశాల మేరకు భూసేకరణ కలెక్టర్ ఝాన్సీరాణి విచారణ చేపట్టారు. అందులో అవాక్కయ్యే అనేక నిజాలు వెలుగు చూసినట్లు తెలుస్తోంది.

నిబంధనలు తూచ్!

లోథా కమిటీ నిబంధనల మేరకు క్రీడాసంఘంలో సభ్యులుగా ఒకరు నాలుగు సంవత్సరాలు మాత్రమే ఉండాలి. వారు ప్రభుత్వ ఉద్యోగి అయితే ఆయన కానీ, వారి కుటుంబ సభ్యులు కానీ ఒకసారికి మించి కమిటీలో ఉండకూడదు. అయితే నకిలీ ధ్రువీకరణ పత్రాల మంజూరులో కీలకంగా వ్యవహరించిన దర్శి గురుకుల పాఠశాలలో పనిచేసే పీఈటీ 1999 నుంచి 2018 సంవత్సరం వరకూ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధిగా కొనసాగారు. అనంతరం కొన్ని సంవత్సరాలు ఆయన కుటుంబ సభ్యులు ప్రతినిధులుగా వ్యవహరించారు. ప్రస్తుతం మళ్లీ అయనే అసోసియేషన్‌లో కీలక పదవిలో ఉన్నారు. అంతేకాకుండా పలు క్రీడా సంఘాలను ఏర్పాటు చేశారు. పోటీలు పెట్టకుండానే నిర్వహించినట్లు చూపి క్రీడా సర్టిఫికెట్లు అమ్ముకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పోటీలు నిర్వహించకుండానే సర్టిఫికెట్లు

సాఫ్ట్‌బాల్ అంతర్‌జోన్ స్థాయి క్రీడా పోటీలకు దేశంలో ఏరాష్ట్రంలోనూ సర్టిఫికెట్‌కు అర్హత లేదు. కానీ మన రాష్ట్రంలో మాత్రం సాఫ్ట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో అంతర్‌జోన్ పోటీలు నిర్వహించినట్లు చూపి పోటీల్లో పాల్గొనని వారికి కూడా సర్టిఫికెట్‌లు మంజూరు చేశారు. వాటితో పలువురు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులుగా, కొందరు ఎంబీబీఎస్ విద్యకు ఉపయోగించుకుని ప్రయోజనాలు పొందినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటి వరకూ అధికారులెవ్వరూ నకిలీ ధ్రువీకరణ పత్రాలపై పెద్దగా దృష్టిసారించకపోవడంతో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్‌లో 'మూడు నకిలీలు, రూ.ఆరు లక్షలు అన్న చందంగా' సర్టిఫికెట్ల బాగోతం కొనసాగింది.

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు, ఎంబీబీఎస్ సీట్లు

ఎంతో మంది విద్యార్థులకు వైద్యుడు కావాలనేది కల. ఎంబీబీఎస్ సీటు రావాలంటే కష్టపడి చదవాలి, అందుకోసం కొందరు విద్యార్థులు కొన్ని సంవత్సరాలుగా శిక్షణ తీసుకుని నీట్ పరీక్ష రాస్తుంటారు. అయితే క్రీడా సర్టిఫికెట్ ఉంటే నీట్‌లో పొందిన మార్కులకు అదనంగా స్పోర్ట్స్ కోటా కింద 2 శాతం మార్కులు కలుస్తాయి. దీని ఆధారంగా తొలిసారే ఎంబీబీఎస్ సీటు సాధించే అవకాశం ఉంటుంది. దాన్ని ఆసరా చేసుకొని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే సుమారు 150కి పైగా సర్టిఫికెట్‌లు జారీ చేశారు. వారు క్రీడలు ఆడకపోయినా డబ్బులు తీసుకొని అసోసియేషన్ ప్రతినిధులు ఇచ్చేశారు. వీటిని పొందిన కొందరు ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్లుగా కొనసాగుతున్నారు. అసోసియేషన్ ప్రతినిధిగా ఉన్న గురుకుల పాఠశాల పీఈటీ కుమారుడు, కుమార్తె ఇదే తరహా సర్టిఫికెట్లు పొంది ఎంబీబీఎస్ పూర్తి చేసి డాక్టర్లుగా పనిచేస్తున్నట్లు సమాచారం. ఆయనకు సమీప బంధువులుగా ఉన్న మరో ఇద్దరు ప్రస్తుతం ఇవే సర్టిఫికెట్‌లతో ఎంబీబీఎస్ చదువుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అర్హులైన విద్యార్థులు కష్టపడి చదివినా కనీసం సీటు సాధించని పరిస్థితులు కనిపిస్తుండగా, నకిలీ సర్టిఫికెట్‌లతో అతి సులువుగా దొడ్డిదారిని కొందరు ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. వీరితోపాటు కొందరు దొంగ సర్టిఫికెట్లతో సచివాలయాలు, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నకిలీ సర్టిఫికెట్ల బాగోతం జిల్లాకే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లోనూ సాఫ్ట్‌బాల్ సంఘ ప్రతినిధుల ఆధ్వర్యంలో నడిచినట్లు తెలుస్తోంది.

మంత్రిని కలిసిన పీఈటీలు, క్రీడాసంఘాల ప్రతినిధులు

జిల్లాలోని కొన్ని క్రీడాసంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ వ్యాయామోపాధ్యాయులు, పలువురు క్రీడాకారులు ఆదివారం విజయవాడ వెళ్లి రాష్ట్ర సాంస్కృతిక, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ పేరుతో సాగుతున్న అక్రమాలు, నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నకిలీ సర్టిఫికెట్‌ల జారీతో అర్హులైన పలువురు నిరుద్యోగులు అర్హత కోల్పోతున్నారని విన్నవించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ నకిలీ క్రీడా సర్టిఫికెట్ల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నట్లు ఇప్పటికే తనకు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశిస్తామన్నారు. ఎవరినీ వదిలేది లేదని స్పష్టం చేశారు. మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగే కేబినెట్ సమావేశంలో ఈ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు.



శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద మండపం విస్తరణకు వేస్తున్న పిల్లర్‌లు

శింగరకొండలో విస్తరణ పనులు ప్రారంభం

లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సిద్ధమవుతున్న ముఖమండపం

అద్దంకి, ఆగస్టు 11 : శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. అద్దంకి ప్రాంతంలో అతి పురాతన దేవాలయాలలో శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఒకటి. గతంలో చిన్నదిగా ఉన్న దేవాలయాన్ని జీర్ణోద్ధరణ పనులు సమయంలో 3 దశాబ్దాల కిందట ముఖ మండపం విస్తరణ చేపట్టారు. భక్తుల రద్దీ పెరుగుతుండడం తో పాటు పలు రకాల ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో దేవాలయం వద్ద భక్తులకు కొన్ని సందర్భాలలో ఇబ్బందిగా మారుతుంది. ఈ నేపథ్యంలో ముఖ మండపాన్ని మరింత విస్తరించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో గతంలో విస్తరణ పనులు చేపట్టిన విధంగానే సుమారు 20 నుంచి 30 అడుగుల కింద నుంచి పిల్లర్‌ల నిర్మాణం ప్రారంభించారు. దీంతో ప్రస్తుతం ఉన్న ముఖ మండపానికి అదనంగా మరో 30 అడుగుల వెడల్పు కలిసి కలిసి వచ్చి ఉత్సవాలు నిర్వహణకు ఉపయోగపడే అవకాశం ఉంది. రూ.10లక్షల దేవస్థానం నిధులు, మరో రూ.20లక్షల మ్యాచింగ్ ఫండ్‌ను దేవదాయ శాఖ కేటాయించింది. దీంతో మొత్తం రూ.30లక్షలతో ముఖమండపాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం పిల్లర్ల నిర్మాణం జరుగుతుండగా, మరో మూడు, నాలుగు నెలలో పనులు పూర్తి అయ్యే అవకాశం ఉంది. పనులు పూర్తయితే లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద మరింత విశాలమైన ప్రదేశం ఏర్పడనుంది. ఇప్పటికే దాతల సహాయంతో కార్యాల గది నిర్మాణం పూర్తి చేయగా, మరి కొందరు దాతల సాయంతో అన్నదాన మండపం, భక్తుల డార్మెటరీ హాల్‌ను నిర్మిస్తున్నారు. అన్ని వసతులు సమకూరితే కొండపై లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద కూడా భక్తులు రాత్రి సమయంలో విశ్రాంతి తీసుకోవడంతో పాటు నిద్రలు చేసి మొక్కులు తీర్చుకునే వసతి సమకూరనుంది.

ఫర్నిచర్ తరలింపును అడ్డుకున్న పోలీసులు

ఇంకొల్లు, ఆగస్టు 11 : ఇంకొల్లు పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఉన్న ఫర్నిచర్ ఎవరిదనే సందేహాలు తలెత్తాయి. అక్కడున్న ఫర్నిచర్‌ను ఆదివారం తరలిస్తుండగా తెలుసున్న పోలీసులు అభ్యంతరం తెలిపారు. వైసీపీ పాలనలో అతిథి గృహానికి మరమ్మతులు చేయించి జడ్పీటీసీ సభ్యులు కార్యాలయంగా వాడుకుంటున్నారని, మరమ్మతు బిల్లులు పూర్తిస్థాయిలో అందలేదని చెప్తున్నారు. అందులో ఉన్న ఫర్నిచర్ సొంత సొమ్ముతో కొనుగోలు చేసామని, అందుకే తీసుకెళ్తున్నామని జడ్పీటీసీ సభ్యురాలు భవనం శ్రీలక్ష్మి భర్త శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఫర్నిచర్ ఎవరిదో తేలాక తీసుకెళ్లాలని ఎస్ఐ సురేష్ తమ సిబ్బందితో చెప్పడంతో ఫర్నిచర్‌ను తిరిగి అతిథిగృహంలో ఉంచారు.

ఆయుధాగారాన్ని పరిశీలించిన ఎస్పీ

● అధికారులకు పలు సూచనలు

ఒంగోలు (క్రైం), ఆగస్టు 11 : జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆయుధాగారని ఎస్పీ దామోదర్ ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. సిబ్బంది విశ్రాంతి తీసుకునే బ్యారక్‌లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్‌బీ సీఐ రాఘవేంద్ర, డీసీఆర్‌బీ సీఐ భీమానాయక్, ఆర్ఐ రమేష్ కృష్ణన్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సంఖ్య ప్రామాణికంగా ప్రక్రియ

మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

ఎట్టకేలకు సర్దుబాటు

ఒంగోలు(విద్య), ఆగస్టు 11 : ఉపాధ్యాయుల సర్దుబాటుకు రంగం సిద్ధమైంది. పిల్లలు తక్కువగా ఉండి పూర్తిస్థాయి పనిభారం లేని టీచర్లను అవసరమున్న ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేసేందుకు ప్రక్రియను ప్రారంభించనున్నారు. అందుకు సంబంధించిన మార్గదర్శకాలను పాఠశాల విద్యా కమిషనర్ విజయరామ రాజు విడుదల చేశారు, ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో టీచర్ల సర్దుబాటు నిర్వహిస్తారు. గతంలో ఏ యజమాన్యంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను అదే పాఠశాలలకు సర్దుబాటు చేసేవారు. అయితే ప్రస్తుతం మండల, డివిజన్, జిల్లా యూనిట్‌గా ఈ నాలుగు యాజమాన్యాల్లోని పాఠశాలలకు టీచర్లను సర్దుబాటు చేస్తారు. యజమాన్యంతో సంబంధం లేకుండా ఇతర యజమాన్యాల పాఠశాలలకు కూడా టీచర్లను కేటాయిస్తారు. స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లను సర్దుబాటు చేస్తారు. ఆగస్టు 7వతేదీ నాటికి పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్య యుడైస్ డేటా ఆధారంగా ఆయా పాఠశాలల్లో మిగులు టీచర్లను గుర్తిస్తారు. పాఠశాలల్లో గతనెల జూలై 31 నాటికి ఉన్న వాటినే ఖాళీ చూపిస్తారు. సర్దుబాటుకు 117 జీవోలోని విధి విధానాలనే పాటించనున్నారు. ఉపాధ్యాయులు, సంఘాలు 117 జీవోను రద్దుచేయాలని కోరుతుంటే దాని ప్రకారమే ప్రభుత్వం టీచర్లను సర్దుబాటుకు పూనుకోవడం వారికి పుండు మీద కారం చల్లినట్లు అయ్యింది.

సర్దుబాటు ప్రాధాన్యత ఇవీ

టీచర్ల సర్దుబాటు ప్రాధాన్యతలను మార్గదర్శకాల్లో వివరించారు. హైస్కూళ్లలో అన్ని సబ్జెక్టులకు కొరత లేకుండా స్కూలు అసిస్టెంట్లను నియమించడం సర్దుబాటుకు మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 98 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉంటే 1, 2 తరగతులకు వేరుగా 3 నుంచి 8 తరగతులకు వేరుగా టీచర్లను కేటాయించనున్నారు. అన్ని పాఠశాలలకు ఎస్‌జీటీలను సర్దుబాటు చేయగా ఇంకా టీచర్లు మిగిలితే వారిని విద్యార్థుల సంఖ్య ప్రామాణికంగా ఏకోపాధ్యాయ పాఠశాలలకు సర్దుబాటు చేయనున్నారు.

వీరికి మినహాయింపు

2025 ఏప్రిల్ 30లోపు ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయులకు పని సర్దుబాటు నుంచి మినహాయింపు ఇచ్చారు. 100శాతం అంధత్వం ఉన్న టీచర్లను కూడా మినహాయించారు. హైస్కూలు ప్లస్ ఇంటర్ ఉన్న పాఠశాలలను సర్దుబాటు ప్రక్రియ నుంచి తొలగించారు. వితంతువులు, అవివాహితులు, చట్టబద్ధంగా విడాకులు తీసుకున్న మహిళా టీచర్లు, స్పౌజ్ ఉన్నవారిని కూడా సర్దుబాటు ప్రక్రియ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఒకవేళ వీరు బదిలీ కోరుకుంటే వారిని సర్దుబాటుకు అనుమతించనున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను ప్లెయిన్ ఏరియాలకు సర్దుబాటు చేయవద్దన్నారు.

మూడు దశల్లో కౌన్సెలింగ్

పాఠశాలల్లో మిగులుగా తేలిన టీచర్లను మూడు దశల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సర్దుబాటు చేయనున్నారు. మొదటి దశలో ఎంఈఓ మండల నోడల్ అధికారిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో వచ్చే సీనియార్టీ జాబితా ప్రకారం ఎంఈఓ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. మండలంలో టీచర్లు అవసరం ఉన్న పాఠశాలలను గుర్తిస్తారు. ఆ పాఠశాలలకు మిగులు టీచర్లను కేటాయిస్తారు. మండల స్థాయి కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత మిగిలిన టీచర్లు డివిజన్ స్థాయి కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి. డివిజన్ స్థాయిలో ఉప విద్యాధికారి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అక్కడ కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత మిగిలిపోయిన టీచర్లు జిల్లా స్థాయిలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి. జిల్లా స్థాయిలో డీఈఓ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. టీచర్ల సర్దుబాటులో ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలను కూడా ఎస్‌జీటీలుగానే పరిగణిస్తారు.

టీచర్ల సర్దుబాటు గడువు 12 వరకు పొడిగింపు

ఉపాధ్యాయుల సర్దుబాటు షెడ్యూల్ గడువును ప్రభుత్వం ఈనెల 12 వరకు పొడగించింది. మొదట ప్రకటించిన ప్రకారం ఈనెల 11 ఆదివారానికి సర్దుబాటు జాబితాలు సిద్ధం కావాల్సి ఉంది. అయితే శని, ఆదివారాలు రాష్ట్ర సచివాలయానికి సెలవులు కావడంతో జాబితాను సోమవారం పూర్తిచేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ లెక్కల ప్రకారం హైస్కూళ్లలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా స్కూలు అసిస్టెంట్లు లేకపోవడంతో అక్కడ సబ్జెక్టు టీచర్ల కొరత ఎక్కువగా ఉంది. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు సంఖ్య దారుణంగా పడిపోవడంతో వేలసంఖ్యలో సెకండరీ గ్రేడ్ టీచర్లు మిగులుగా ఉన్నారు.

రాష్ట్రంలో సబ్జెక్టు టీచర్లు 17వేలకుపైగా అవసరం కాగా కేవలం 8వేల మంది సబ్జెక్టు టీచర్లు మాత్రమే మిగులుగా తేలుతున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 20వేలకుపైగా సెకండరీ గ్రేడ్ టీచర్లు మిగులుగా తేలుతుండగా కేవలం ఐదువేల మంది ఎస్‌జీటీలు మాత్రమే అవసరం ఉంది. మునిసిపల్ హైస్కూళ్లలో కూడా టీచర్ల కొరత ఉంది. మొత్తంగా సోమవారం సాయంత్రానికి సర్దుబాటుకు సంబంధించి తుదిరూపు రానుంది.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న స్కూటీ

● అపస్మారక స్థితిలో యువకుడు

మార్టూరు, ఆగస్టు 11 : బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద గుంటూరు వైపు ముందు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడిని వెనుక వస్తున్న స్కూటీవాలా ఢీకొన్న సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఒంగోలు వైపు నుంచి ద్విచక్రవాహనదారుడు మార్టూరు వైపు వస్తుండగా, వారి వెనుక నుంచి వస్తున్న స్కూటీవాలా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో స్కూటీని నడుపుతున్న కుంచాల శ్రీను అనే యువకుడు రోడ్డుపై అపస్మారకస్థితిలో పడిపోయాడు. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న మండలంలో కోనంకి గ్రామానికి చెందిన భార్యాభర్తలు రమణయ్య, సునీత స్వల్పగాయాలకు గురయ్యారు. కుంచాల శ్రీనును హైవే అంబులెన్సులో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద అపస్మారకస్థితిలో ఉన్న కుంచాల శ్రీనుకు వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స కూడా చేయలేదు. వెంటనే హైవే అంబులెన్సులో చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్కూటీలో అతని పేరుతో ఆధార్ కార్డు లభించడంతో కంకిపాడు మండలం, పూనాదిపాడు గ్రామానికి చెందిన వ్యక్తిగా అంబులెన్సు సిబ్బంది గుర్తించారు. ఈ విషయాన్ని స్టేషన్ పోలీసులకు సమాచారం అందించారు.




అపస్మారకస్థితిలో పడి ఉన్న యువకుడు

మళ్లీ ఓటర్ల జాబితా సవరణ

20 నుంచి ప్రక్రియ ప్రారంభం

జనవరి 6న తుది జాబితా



ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 11 : ఓటర్ల జాబితా సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. తదనుగుణంగా జిల్లాలో ఆ ప్రక్రియను చేపట్టేందుకు అవసరమైన చర్యలను అధికార యంత్రాంగం తీసుకుంటోంది. ఈనెల 20నుంచి ఇంటింటి సర్వేతో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. వచ్చే ఏడాది జనవరి 6తో ముగియనుంది. వచ్చే ఏడాది జనవరి 1నాటికి 18 ఏళ్ల నిండే యువత కూడా కొత్త ఓటరుగా నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. బూత్‌లెవల్ అధికారులు (బీఎల్వో)లు ఇంటింటికీ వెళ్లి పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, తప్పుల సవరణ వంటి కార్యక్రమాలు చేపట్టి అక్టోబరు 18వతేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో 1,500 మంది ఓటర్లు మించకుండా అవసరమైన చోట్ల రేషన్‌లైజేషన్ చేసేలా ఈసీ మార్గదర్శకాలు జారీ చేసింది. ఒకే చిరునామాపై ఎక్కువ ఓట్లు, జీరో ఇంటి నంబర్లతో ఉన్న వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అక్టోబరు 29వతేదీన ముసాయిదా జాబితాలను ప్రకటిస్తారు. దానిపై సవరణలు, అభ్యంతరాలను నవంబరు 28 వరకూ స్వీకరిస్తారు. డిసెంబరు 24లోపు అభ్యంతరాలను పరిష్కరిస్తారు. జనవరి 6వతేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు.

90 రోజుల్లో సమస్య పరిష్కారం

దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం

45 రోజులు రెవెన్యూ గ్రామ సదస్సులు

16 నుంచి నిర్వహణ

మండలం యూనిట్‌గా షెడ్యూల్

గత వైసీపీ పాలనలో భారీగా అక్రమాలు, ఆక్రమణలు

ప్రస్తుత సర్కారు నిర్ణయంపై బాధితుల్లో విశ్వాసం

భూబాధల నుంచి విముక్తి

ఒంగోలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పేరుకుపోయిన భూ సమస్యల పరిష్కారానికి చంద్రబాబు సర్కారు నడుం బిగించింది. అందుకోసం 90 రోజుల కాల వ్యవధితో నిర్దిష్ట కార్యాచరణను చేపట్టింది. ఈనెల 15వ తేదీన లాంఛనంగా కార్యక్రమం ప్రారంభమవుతుంది. 16 నుంచి 45 రోజుల పాటు గ్రామాల్లో అధికారులు సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. ఆతర్వాత 45 రోజుల్లో సమస్య పరిష్కరించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది.

వైసీపీ పాలనలో పెద్దఎత్తున భూదందాలు

గత వైసీపీ పాలనలో ఇటు రాష్ట్రంలో, ఇటు జిల్లాలో పెద్దఎత్తున భూదందాలు సాగాయి. తమకు అనుకూలంగా ఉండే అధికారులు, సిబ్బందిని నియామకం చేయించుకొని వారి అండదండలతో అనేక భూమాయలు చేశారు. ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, దర్శి, సింగరాయకొండ, ఎర్రగొండపాలెం వంటి పట్టణాలలో విలువైన ప్రభుత్వ భూములు, వివాదాలలో ఉన్న స్థలాలను తమకు అనుకూలంగా రాయించుకున్నారు. మార్కాపురం మండలంలో భూఅక్రమాలకు అండగా నిలిచిన 11 మంది వీఆర్వోలు, ఇతర రెవెన్యూ సిబ్బందిపై వేటుపడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పట్టింది. ఒంగోలులో ఉన్నతాధికారులు వేసిన సిట్‌కు వందలాది మంది బాధితులు అర్జీలు అందజేశారు. ఇదే పరిస్థితి జిల్లా అంతటా సాగింది. చాలా చోట్ల రెవెన్యూ రికార్డులను తారుమారుచేసి ఆభూములను వైసీపీ నేతలు ఆక్రమించుకొని అసలు హక్కుదారులకు చుక్కలు చూపించారు. ఇక 22(ఏ)లో ప్రైవేటు భూములను చేర్పించడం, అనేక మందిని వేధించడం, తమకు అనేకూలంగా ఉన్న భూములను 22(ఏ) నుంచి తప్పించి వారి పేర్లపై రాయించుకోవడం చేశారు. వందల కోట్ల విలువైన భూములు ఇలా సొంతం చేసుకున్నారు. అలాగే రీ సర్వే జరిగిన గ్రామాల్లో అధికారులు హడాహుడిగా చేసిన ప్రక్రియతో వందలాది సమస్యలు వచ్చాయి.

రెండు నెలలకే భూ సమస్యలపై ప్రభుత్వం దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే భూ సమస్యలపై దృష్టిపెట్టడం ప్రజలకు ఊరట కలిగిస్తోంది. ప్రజల వద్దకు పాలన తరహాలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం 90 రోజులపాటు సాగనుంది. మండల యూనిట్‌గా గ్రామాల వారీ నిర్వహించే సదస్సులకు తహసీల్దార్‌ల నేతృత్వం వహిస్తారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ దేవదాయ, వక్ఫ్, అటవీ తదితరశాఖల అధికారులు హాజరవుతారు. 2019కి ముందు భూస్థితి, ప్రస్తుత స్థితిని వారు పరిశీలించడంపాటు రికార్డులు అందుబాటులో ఉంచుతారు. అలా నిర్వహించే సదస్సులో వచ్చే వినతులను మ్యుటేషన్, కౌలు రైతు కార్డులు, భూ వివాదాలు, భూ ఆక్రమణలు, 22(ఏ) గోల్‌మాల్ తదితరాలను రిజిస్టర్లలో నమోదు చేయనున్నారు. అనంతరం వాటిని 45 రోజుల్లోపు పరిష్కరించనున్నారు. ఈ కార్యక్రమం వలన క్షేత్రస్థాయిలో జరిగిన అక్రమాలు వెలుగు చూడనున్నాయి.

యంత్రాంగం కసరత్తు

ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో గ్రామ సదస్సుల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈనెల 15న లాంఛనంగా ప్రారంభంకానున్న ఈ కార్యక్రమ నిర్వహణలో కీలకమైన గ్రామ సదస్సుల షెడ్యూల్‌ను ఈనెల 13వ తేదీలోపు ఖరారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మండలం యూనిట్‌గా షెడ్యూల్ రూపొందించాల్సి ఉండటంలో తహసీల్దార్లు దానిపై దృష్టి సారించారు. సోమవారం కలెక్టర్, జేసీ ఇతర అధికారులు దీనిపై కిందిస్థాయి అధికారులకు సూచనలు చేసే అవకాశం ఉంది.

గోమాతల ఆక్రందన..!

- గోకులంలో గ్రాసం కొరత
- దాతల కోసం ఎదురు చూపులు
- స్థలం లేక తరచూ షెడ్ల మార్పు
- 60 ఆవులు.. 15ఏళ్లుగా నిర్వహణ
- రోజుకు రూ.10వేలపైనే ఖర్చు
- అద్దంకి కొండ వద్ద ప్రభుత్వ భూమి కేటాయిస్తే కష్టాలు తీరినట్టే



అద్దంకిలోని హరిహర గోకులంలో టెంట్ నీడన ఉన్న ఆవులు


స్థలం లేక గోడ పక్కన నీడన ఉన్న ఆవులు

అద్దంకి, ఆగస్టు 11 : హిందువులు గోమాతను పూజిస్తుంటారు. అయితే అలాంటి గోమాతలకే అద్దంకిలో పెద్ద కష్టం వచ్చింది. పశుగ్రాసం సరిపడా లేక ఏరోజుకు ఆరోజు దాతల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అద్దంకి పట్టణంలో హరిహర గోకులం సొసైటీ ఆధ్వర్యంలో గోశాల నిర్వహిస్తున్నారు. సుమారు 15 సంవత్సరాల క్రితం ఒక్క ఆవుతో గోనుగుంట సుబ్బారావు గోశాలను ఇంట్లోనే ప్రారంభించారు. అనంతరం ఒక కపిల గోవు దూడను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ దశాబ్దకాలం కిందట ఉచితంగా ఇచ్చారు. ఆ దూడ సంతతి ప్రస్తుతం ఆరు ఉన్నాయి. అప్పటి నుంచి దాతలు పలువురు ముందుకు వచ్చి ఆవులను గోశాలకు ఇస్తున్నారు. ప్రస్తుతం 60కిపైగా ఆవులు గోకులంలో ఉన్నాయి. గోవులు పెరుగుతుండటంతో పశు గ్రాసం భారం కూడా రోజు రోజుకు పెరుగుతుంది. రోజు కు సరాసరిన 10 వేల రూపాయల పశుగ్రాసం అవసరం అవుతుంది. దీంతో దాతల సహకారం మరింత అవసరం అయింది. ప్రధానంగా రాజస్థాన్ రాష్ట్రం నుంచి వచ్చి అద్దంకిలో వ్యాపారులు, వివిధ పనులు చేసుకుంటున్న యువకులు తరచూ సహకారం అందిస్తుండగా, అద్దంకి పట్టణంలోని ఆర్యవైశ్యులు నాగసూరి సత్యనారాయణ, అద్దేపల్లి అశోక్ తదితరులు కొంతమేర సహకారం అందిస్తున్నారు. అయితే 60కి పైగా గోవులు ఉండడం, గ్రాసం కోసం బయటకు వెళ్లే అవకావం లేకపోవడంతో ఖర్చు మరింత పెరిగింది. దీంతో ఏ రోజు కారోజు పశు గ్రాసం కోసం దాతల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల రెండు రోజుల పాటు పశుగ్రాసం లేక గోవులు ఖాళీ కడుపుతో ఉండి అలమటించిన సందర్భాలు కూడా చోటుచేసుకున్నాయి. దాతలు ముందుకు వచ్చి పశుగ్రాసం అందిస్తేనే గోవుల కడుపు నిండే పరిస్థితి నెలకుంది. తొలుత ఇంటి వద్దనే గోశాల నిర్వహించిన సుబ్బారావు గోవులు పెరగడంతో కొంతకాలం రామ్‌నగర్‌లో మూత పడ్డ మిల్‌లో నిర్వహించారు. అక్కడ ఖాళీ చేయించడంతో రెండు సంవత్సరాలుగా వాసవీ నగర్‌లోని విశ్వభారతి స్కూల్ ఎదురు మూతపడి ఉన్న మిల్‌లో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆ మిల్ కూడా ఖాళీ చేయాల్సి రావడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే ప్రయత్నంలో ఉన్నారు. శింగరకొండ సమీపంలో అద్దంకి కొండ వద్ద పలు విద్యా సంస్థలు, టిడ్కో ఇళ్లు, ఇతర అవసరాలకు స్థలాల కేటాయింపు జరిగిన క్రమంలో గోశాలకు కూడా కొంత మేర స్థలాన్ని కేటాయిస్తే శాశ్వతంగా గోశాల నిర్మాణం చేపట్టడంతోపాటు సమీపంలో కొండ ప్రాంతం ఉన్నందున పగలు సమయంలో మేతకు కొండకు తోలుకుపోతే పశుగ్రాసం బాధలు, ఖర్చు కూడా ఎక్కువ భాగం తగ్గుతుందని గోశాల నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు. గోవుల పెంపకంపై ఒకింత ఆసక్తి ఉన్న విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించి గోశాల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించే విధంగా కృషి చేయాలని, అదే సమయంలో దాతలు ముందుకు వచ్చి పశుగ్రాసం అందించాలని సుబ్బారావు కోరుతున్నారు.

స్థలం కేటాయిస్తే శాశ్వత గోశాల నిర్మాణం



శింగరకొండ సమీపంలోని అద్దంకి కొండ వద్ద ప్రభుత్వం స్థలం కేటాయిస్తే శాశ్వతంగా గోకులం ఏర్పాటు చేసుకుంటాము. ప్రస్తుతం ఖాళీ గా ఉన్న మిల్లులలో గోశాలలను నిర్వహిస్తూ తరచూ మారాల్సి వస్తుంది. ఆ వులను మేత కోసం బయటకు వదిలే అవకాశం లేక కట్టివేసి మేపాల్సి రావటం తో గ్రాసం ఖర్చు కూడా బాగా పెరిగింది. అద్దంకి కొండ వద్ద అయితే గ్రాసం ఖర్చు బాగా తగ్గుతుంది. ఆవు లు కూడా ప్రశాంత వాతావరణ లో మరింత ఆరోగ్యం గా ఉంటాయి.

- గోనుగుంట సుబ్బారావు, గోశాల నిర్వాహకుడు, అద్దంకి

గ్రాసం లేక ఆవులు ఖాళీ కడుపుతో ఉండడం బాధేస్తోంది



గోశాలలో ఉన్న ఆవులు కొన్ని రోజులు మేత లేక ఖాళీ కడుపులతో ఉంటుండటం తీ వ్రంగా కలిచి వేస్తుంది. దీంతో తమ వంతు సహకారం అందిస్తున్నాము. అయితే ఎక్కువ గోవులు ఉండటంగో ఖర్చు ఎక్కువ గా ఉంది. మరి కొంత మంది దాతలు ముందుకు వస్తేనే ఆవు లకు కడుపు నిండా మేత అందే పరిస్థితి ఉంది.

- అజయ్, అద్దంకి


నీమాస్త్రంను తయారు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

సేంద్రియ సాగుతో నాణ్యమైన దిగుబడులు

చినగంజాం, ఆగస్టు 11 : సేంద్రియ సాగు పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులను సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయం ఎల్-1 జయమ్మ అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో మహిళా రైతులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో నీమాస్త్రం తయారీపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. నీమాస్త్రం అన్ని రకాల పురుగు లార్వాలను, రసం పీల్చే పరుగులను, గొంగళి పురుగులను నివారిస్తుందని జయమ్మ తెలిపారు. పది కేజీల వేపాకులను మొత్తగా రుబ్బి, డ్రమ్ములో 200 లీటర్ల నీరులో ఆ ముద్దను కలపాలని, దానికి పది లీటర్ల ఆవు మూత్రం కలిపి దానికి రెండు కేజీల ఆవు పేడను కలపాలని అన్నారు. పంట విత్తిన 20రోజుల నుంచి ప్రతి 15 రోజులకు ఒక్కసారి పంటకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని అన్నారు. దీని వలన తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పండించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

సీఐని మర్యాదపూర్వకంగా కలిసిన నేతలు




సీఐకి శుభాకాంక్షలు చెప్తున్న టీడీపీ నాయకులు

ఇంకొల్లు, ఆగస్టు 11 : సీఐ రమణయ్య, ఎస్ఐ సురేష్‌ను టీడీపీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, టౌన్ అధ్యక్షుడు మార్క్, కరి శ్రీనివాసరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుంజి వెంకట్రావు, గంగవరం మాజీ సర్పంచ్ బొడెంపూడి సుబ్బారావు, శ్రీను అధికారులను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసారు.

శతాధిక వృద్ధుడు ఎంఎల్‌ఎస్ మాస్టర్ మృతి

- పలువురు ప్రముఖుల సంతాపం
- ఉత్తమ ఉపాధ్యాయునిగా విద్యారంగానికి విశేష కృషి



పర్చూరు, ఆగస్టు 11 : శతాధిక వృద్ధులు.. విశ్రాంత ఉపాధ్యాయులు మల్లాది లక్ష్మీనారాయణ శాస్త్రి 101 (ఎంఎల్ఎస్ మాస్టర్) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. పర్చూరు వైఆర్ హైస్కూల్‌లో ఉపాధ్యాయునిగా పనిచేసి విద్యారంగానికి విశేష కృషి చేశారు. ఉత్తమ ఉపాధ్యాయునిగా అనేక అవార్డులు పొందారు. ఉపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ అనంతరం హోమియో వైద్యుడిగా ప్రజలకు ఉచిత సేవలందించారు. దేవాలయాలు, ఆరాం క్షేత్రాలకు తనవంతు ఆర్థిక సాయాన్ని అం దించి దాతృత్వం చాటుకున్నారు. ఎంఎల్ఎస్ మాస్టర్ మృతికి పూర్వ విద్యార్థులు వి శ్రాంత టెలికం జీఎం యశోద ప్రసాద్, రాష్ట్ర సచివాలయం ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు ఉప్పుటూరి మురళీకృష్ణ, పాబోలు ఉదయభాస్కర్, కేఎస్ ఆర్‌కే ప్రసాద్, ప్రముఖ న్యాయవాది కొల్లా నరేంద్రకుమార్, రావి సత్యనారాయణ, కొల్లా సుబ్బారావు, కఠారి సురేంద్రబాబు, శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం తెలిపారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

- ఆక్రమణలు, రీసర్వే సమస్యలపై అర్జీల స్వీకరణ
- తహసీల్దార్, ఏడుగురు అధికారులతో నిర్వహణ
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



పర్చూరు, ఆగస్టు 11 : వైసీపీ పాలనలో భూదందాలు, అక్రమాల నిగ్గు తేల్చేందుకు, భూ సమస్యల పరిష్కారానికి ఈనెల 16 నుంచి సెప్టెంబరు 30వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15 జిల్లాలో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఏలూరి ఆదివారం ప్రకటనలో తెలిపారు. గ్రామాలవారీగా భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతాంగ సమస్యలకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. ఐదేళ్ల పాలనలో పెద్దఎత్తున భూ ఆక్రమణలు జరిగాయని ఆరోపించారు. అనేక మంది సామాన్య మధ్యతరగతి ప్రజలను బెదిరించి భూములను స్వాధీనం చేసుకున్నారని దీనిపై అనేక ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యంగా ఆధికార యంత్రాంగం ప్రజల చెంతకు వెళ్లనున్న ట్లు ఆయన ఈసందర్భంగా తెలియజేశారు. ప్రజా క్షేత్రంలో అక్కడికక్కడే సమస్యలను తెలుసుకునేలా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా రంగం సిద్ధం చేసిందన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులకు మరో 45 రోజల గడువు ఇచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. తహసీల్దార్‌తో పాటు, ఆయా భూముల వ్యవహారాలతో సంబంధం ఉన్న అటవీ, దేవదాయ ఇతర శాఖ ల అధికారులు సైతం ఈ సదస్సులో పాల్గొంటారన్నారు. సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని అన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రచించిందన్నారు. వైసీపీ హయాంలో నిషిద్ధ జాబితా నుంచి ఫ్రీహోల్డ్ పేరుతో తప్పించిన భూముల రిజిస్ట్రేషన్‌లపై సమగ్ర దర్యాప్తు జరుగుతుందన్నారు. అసైన్డ్, చుక్కల భూములు, పరతులున్న వేల ఎకరాల భూములను నిషిద్ధ జాబితా నుంచి తప్పించి వైసీపీ నేతలు రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యావత్తు రైతుల పొలాలు, ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని ఏలూరి కోరారు.

గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న రెవెన్యూ సదస్సులను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ఏలూరి తెలిపారు. 16 నుంచి వచ్చేనెల 30 వరకు గ్రామాలవారీగా సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. ఈసదస్సులో ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.


ప్రత్యేక అలంకరణలో బొడ్డురాయి

వైభవంగా బొడ్డురాయి ప్రతిష్ఠ

బల్లికురవ, ఆగస్టు 11: మండలంలోని మల్లయ్యపాలెం గ్రామంలో ఆదివారం అంగరంగ వైభవంగా గ్రామ బొడ్డురాయి, గవిడి రాళ్ల ప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. గత మూడు రోజుల నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి పూజాకార్యక్రమాల అనంతరం గవిడి రాళ్లను ఏర్పాటు చేశారు. గ్రామస్థులు సమష్టి కృషితో రూ.13లక్షల విరాళాలు సేకరించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పదివేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వృద్ధునికి ఆర్థిక సాయం అందజేత

మార్టూరు, ఆగస్టు 11 : మార్టూరులో ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమీపంలో నివసిస్తున్న బొచ్చు పోలయ్య అనే వృద్ధుడికి హెల్పింగ్ హాండ్స్ సభ్యులు ఆదివారం రూ.5వేల సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పఠాన్ ఖాదర్ వలి, గుర్రం శ్రీను, పుట్టా అయ్యప్ప స్వామి, షేక్ హబీబా పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఏలూరి

వైభవంగా దేవస్థాన శత వార్షిక వేడుకలు

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరి

యద్దనపూడి, (మార్టూరు) ఆగస్టు 11 : యద్దనపూడి మండలం గన్నవరం గ్రామంలో ఆదివారం శ్రీ గంగా కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానం శత వర్ష వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. ఆయనకు ఆలయ ధర్మకర్త కాళహస్తి హరిబాబు సంప్రదాయకంగా స్వాగతం పలికారు.అనంతరం స్వామివారికి ఏలూరి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. గ్రామంలోని కాళహస్తి వంశస్తులతో పాటు, గ్రామస్థులు ముఖ్యంగా మహిళలు ఆలయానికి వచ్చి స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. యద్దనపూడి టీడీపీ మండల అధ్యక్షుడు నల్లపనేని రంగయ్య చౌదరి కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వేణుగోపాలస్వామి భూములకు కౌలు వేలం నిర్వహించాలి

అద్దంకి, ఆగస్టు 11 : దేవస్థానం భూములకు బహిరంగ కౌలు వేలం నిర్వహించకుండా అధికారులు ఆదాయానికి గండికొడుతున్నారని పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దక్షిణ అద్దంకి పరిధిలో ఉన్న వేణుగోపాలస్వామి దేవాలయానికి సంబంధించి సర్వేనెంబర్ 1787లో సుమారు 15ఎకరాలు సాగు భూమి ఉందని, ఆ భూమికి సంబంధించి కౌలుకు ఇచ్చేందుకు అధికారులు బహిరంగ వేలం నిర్వహించకుండా, అనుకూలంగా ఉన్న కొద్దిమంది రైతులకు తక్కువ కౌలుకు ఇస్తున్నారని గొట్టిపాటి సుబ్బారావు దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌కు పంపిన అర్జీలో పేర్కొన్నారు. అదే సమయంలో 3ఎకరాల భూమిని సమీప పొలాల రైతులు ఆక్రమించుకుని కనీసం కౌలు కూడా చెల్లించడం లేదని స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సుబ్బారావు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దేవాలయం భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని, కౌలు బహిరంగ వేలం నిర్వహించి దేవాలయం ఆదాయం పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని సుబ్బారావు ఉన్నతాధికారులకు పంపిన అర్జీలో పేర్కొన్నారు.

అనుమతులా..అవెందుకు..?

- పంట కాలువను పూడ్చిన వైనం
- రియల్ వ్యాపారుల దందా
- ఇసుక, మట్టి అక్రమంగా తరలించి మెరకలు


పంట కాలువను పూడ్చి రియల్టర్ వేసిన వెంచర్

చీరాల, ఆగస్టు 11 : స్థిరాస్తి విలువ పెరగడంతోపాటు భూముల కొనుగోలు, అమ్మకాలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో రియల్ వ్యాపారుల్లో కొందరు నిబంధనలను తుంగలో తొక్కి రూపాయల వేటలో పడ్డారు. అందుకు పాలక, ప్రతిక్షాలతో సంబంధాలున్న వ్యక్తులు భాగస్వాములుగా మారుతున్నారు. దీంతో నిబంధనలు అమలు చేయడం అధికారులకు సవాల్‌గా మారుతోంది. అనుమతులా .. అవెందుకని సదరు రియల్ వ్యాపారులు తమ సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించడం పరాకాష్ట. అంతిమంగా కొనుగోలుదారులు నష్టపోతున్నారు.

స్థలం ఉందా.. ప్లాట్లు వేద్దాం

నిబంధనలు మనకు వర్తించవు. మేం వేసే వెంచర్‌లో పాలక, ప్రతిపక్షాలకు చెందినవారం ఉన్నాం. ముందుగా ప్లాట్లు బుక్ చేసుకున్న వారికి రేటు తక్కువ. లేదంటే తరువాత అదే స్థలం డబుల్ రేటు చెల్లించాల్సి వస్తోందంటూ రియల్ సిండికేట్ వ్యాపారులు దందా సాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం సదరు వ్యక్తుల వెంచర్‌కు ఇసుక, మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను వీఆర్వోల సమాచారం మేరకు పోలీసులు అడ్డుకున్నారు. తరువాత జరిగిన పరిణామాలక్రమంలో వాటిని వదిలేశారు. వేటపాలెం మండలం పాపాయిపాలెం రోడ్డుకు సమీపంలో వేసిన వెంచర్‌కు సంబంధించి జరిగిన ఈ ఘటన ప్రస్తుతం రియల్ వ్యాపారులతో పాటు రాజకీయ వర్గాల్లోను జోరుగా చర్చ సాగుతోంది. ఆ వెంచర్‌కు సంబంధించి ఒకరు కొత్తపేటకు చెందిన వ్యక్తి కాగా, మరొకరు పాపాయిపాలెంకు చెందిన వ్యక్తి. ఆ వెంచర్‌లో భాగస్వాములు. ఈ నేపథ్యంలో సదరు వ్యక్తులు రియల్ వెంచర్‌కు సంబంధించి కనీస మార్గదర్శకాలు పాటించకుండా, నిబంధనలను తుంగలో తొక్కి పనులు ప్రారంభించారు. ఇదిలావుంటే ఆ ప్రాంతంలో రైతుల పంట పొలాలకు సాగునీరు సరఫరా అయ్యే పంటకాలువను పూడ్చి వెంచర్‌కు అనుకూలంగా మార్చుకున్నారు. వారు చెప్పే అధికార అండ పేరుతో రైతులు తమకు జరుగుతున్న అన్యాయంపై గళం విప్పేందుకు వెనకడుగు వేస్తున్నారు. కొందరు రైతులు మాత్రం ఈ రోజు నోరు మెదపకపోతే భవిష్యత్‌లో తమ పంట పొలాలు బీడులుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం సదరు వెంచర్‌కు మట్టి, ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను కొందరు అడ్డుకున్నారు. అది రెవెన్యూ, పోలీస్ దృష్టికి వెళ్లింది. తరువాత ఏం ఒత్తిళ్లు వచ్చాయో ఏమో పట్టుకున్న ట్రాక్టర్లను వదిలేశారు. దీంతో ఆ రియల్ వ్యాపారులు మీసాలు మెలేస్తున్నారు. అవిషయం పక్కన పెడితే అనుమతులు లేని వెంచర్లు ఎలా వేశారు..? అక్రమ దందాలకు ఎవరు ఊతం ఇస్తున్నారనే అంశంపై ప్రజలు, రాజకీయ వర్గాల్లోను జోరుగా చర్చ సాగుతోంది. ఈ క్రమంలో అనుమతులులేని అనధికారిక వెంచర్లపై పాలకులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

జీవాల కాపరులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 11 : గొర్రెలు, మేకల జీవాల కాపరులకు ఎల్లప్పుడూ అండగా ఉండి, ప్రభుత్వ పరంగా చేయూతనందిస్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య భరోసా ఇచ్చారు. అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఏపీ గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం జిల్లా ప్రథమ మహాసభ జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీవాల పెంపకందారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు. అందుకు ప్రభుత్వపరంగా అందిస్తున్న చేయూతను వివరించారు. భవిష్యత్‌లో కూటమి ప్రభుత్వంతో ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఎరికి ఏ అవసరం వచ్చినా తనను నేరుగా కలవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పెంపకందారుల సంఘ ప్రతినిధులు, కాపరులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

గొల్లపాలెంలో ఆదివారం గొల్లప్రోలువారి దేవర కొలుపుల్లో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

పంగులూరు, ఆగస్టు 11 : పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం నుంచి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో తానికొండ రమేష్ తెలిపారు. ఈ నెల 12 నుంచి 14 వరకు మూడురోజుల పాటు జరిగే కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులు, పారిశుధ్యంపై అవగాహన, ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు విధిగా పాల్గొనాలని రమేష్ కోరారు.

ఎస్ఐగా రత్నకుమారి బాధ్యతల స్వీకరణ



యద్దనపూడి (మార్టూరు), ఆగస్టు 11 : యద్దనపూడి మండల స్టేషన్ ఎస్ఐగా డీ రత్నకుమారి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలోనూ ఆమె ఇక్కడ ఎస్ఐగా పనిచేశారు. అద్దంకి నుంచి బదిలీపై ఆమె యద్దనపూడికి వచ్చారు.

ఇంకొల్లు సీఐగా రమణయ్య



ఇంకొల్లు, ఆగస్టు 11 : ఇంకొల్లు సర్కిల్ సీఐగా వైవీ రమణయ్య ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీ లేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గంజాయి, పేకాట కట్టడికి కోసం కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

ఎస్ఐగా సురేష్



ఇంకొల్లు : ఇంకొల్లు ఎస్ఐగా జీ సురేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో వేటపాలెం ఎస్ఐగా పనిచేస్తూ ప్రస్తుతం బదిలీపై ఇంకొల్లుకు వచ్చారు. నేరాల నియంత్రణకు కలిసి పనిచేద్దామని సిబ్బందికి పిలుపునిచ్చారు.

చినగంజాంకు రమేష్



చినగంజాం, ఆగస్టు 11 : చినగంజాం ఎస్ఐగా ఎస్. రమేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. పర్చూరులో పని చేస్తూ బదిలీపై చినగంజాం పోలీ సు స్టేషన్‌కు వచ్చారు. చినగంజాం ఎస్ఐగా పనిచేస్తున్న శ్రీనివాసరావు బాప ట్ల వీఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రమేష్‌కు పోలీ సు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కారంచేడుకు వెంకట్రావు



కారంచేడు(పర్చూరు), ఆగస్టు 11 : కారంచేడు ఎస్ఐగా వీ వెంకట్రావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన బాపట్ల వీఆర్‌లో విధులు నిర్వహిస్తూ కారంచేడు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన సురేష్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన వెంకట్రావుకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో ప్రత్యేక దృష్టి సారిస్తామని ఈ సందర్భంగా ఎస్ఐ తెలిపారు.

మేదరమెట్లకు రఫి



మేదరమెట్ల, ఆగస్టు 11 : మేదరమెట్ల ఎస్ఐగా షేక్ మహమ్మద్ రఫీ ఆదివారం బాధ్యతులు సేకరించారు. బాపట్ల జిల్లా చూండూరు పోలీస్‌స్టేషన్ నుం చి బదీలీపై మేదరమెట్ల పోలిస్టేషన్‌కు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ ఏ చంద్రశేఖర్ బదిలీపై ఈపురుపాలెం పోలీస్‌స్టేన్‌కు వెళ్లారు. ఎస్ఐ రఫీ మాట్లాడుతూ ఫిర్యాదుదారులు, ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తామని చెప్పారు. శాంతిభదత్రలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించా రు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రోగులకు వైద్య సేవలు

ఇంకొల్లు, ఆగస్టు 11 : ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం బిగ్‌టీవీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బిపి,షుగర్,గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసారు.ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ నీలం మోహనారున్, డాక్టర్ షేక్ హసీనా పాటు పలువురు వైద్యులు పాల్గొని వైద్య సేవలందించారు.

రేపు వ్యాపారులకు శిక్షణ

ఇంకొల్లు, ఆగస్టు 11 : ఆహార భద్రత స్టాండర్డ్స్ అథారటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు వ్యాపారస్తులు తప్పనిసరిగా శిక్షణ తీసుకోవాలని ఫుడ్‌సేఫ్టీ ట్రేనింగ్ సర్టిఫికేషన్ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు సురేంద్ర ఒక ప్రకటనలో కోరారు. ఈనెల13వ తేదీన జిల్లాస్థాయి శిక్షణ తరగతులు ఇంకొల్లులోని వాసవీ కల్యాణ మండపంలో జరుగుతాయని వ్యాపారులు శిక్షణకు హాజరై ఆహార భద్రతపై అవగాహన పెంచుకోవాలని కోరారు. జిల్లా గెజిటెడ్ అధికారి దేవరాజు, జిల్లా ఆహారభద్రతాధికారి ప్రణీత్‌కుమార్ హాజరవుతారని తెలిపారు.

గేదెల అదృశ్యంపై ఫిర్యాదు

కారంచేడు (పర్చూరు), ఆగస్టు 11 : పొలానికి మేతకు వెళ్లిన మూడు గేదెలు అదృశ్యం కావడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కారంచేడు మండలం రంగప్పపాయుడువారిపాలెంకు గ్రామంలోని కె.హరిబాబుకు చెందిన రూ.3లక్షల విలువైన గేదెలు మాయమయ్యాయి. చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా కన్పించకపోడంతో కారంచేడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గ్రానైట్ కార్మికుడు మృతి


మనోజ్ (ఫైల్)

బల్లికురవ, ఆగస్టు 11 : బల్లికురువ మండలం వేమవరం గ్రామ పరిధిలోని ఓగ్రానైట్ ఫ్యాక్టరీలో శనివారం రాత్రి నిద్రలోనే అపస్మారకస్థితిలోకి వెళ్లి ఒడిసా రాష్ట్రానికి చెందిన మనోజ్ కుమార్ (34) మృతి చెందారు. అందిన సమాచారం మేరకు ఒడిసాకు చెందిన కార్మికుడు మనోజ్ కుమార్ ఐదు ఏళ్ల నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. నిద్రిస్తుంగా ఒక్కసారిగా గుండె పోటు గ్యాస్ వచ్చి వాంతులు చేసుకోగా పక్కనే ఉన్న కార్మికులు గుర్తించి మార్టూరు వైద్యశాలకు తరలించగా అప్పటికే కార్మికుడు మృతి చెందాడు. వీఆర్వో పూర్ణిమ కార్మికుడు మృతి చెందిన వార్త తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మనోజ్ బంధువులకు కూడా సమాచారం అందించారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
సోమవారం 12 ఆగస్టు 2024



నిర్దిష్టమైన ప్రణాళిక.. కచ్చితంగా అమలు చేయగల సామర్థ్యం లేకపోతే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగుతాయో పిల్లల చేతికి మాజీ సీఎం జగన్ ఇచ్చిన ట్యాబ్‌లే నిదర్శనం. విమర్శకులు అన్నట్లు బైజూస్ సంస్థను బాగుపరచాలని చేశారో లేదా విద్యార్థుల బాగు కోసమే చేశారో తెలియదు కానీ వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల వల్ల మేలు కన్నా కీడే ఎక్కువ జరుగుతోందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. 'ట్యాబ్‌ల కారణంగా మా పిల్లలు చెడిపోతున్నారు. వెంటనే వెనక్కు తీసుకోండి.' అంటూ ప్రధానోపాధ్యాయులకు లిఖిత పూర్వకంగా వినతి పత్రాలు ఇస్తున్నారు. ట్యాబ్‌లు వెనక్కి తీసుకోవాలని పీఆర్‌టీయూ వంటి ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయంటే ట్యాబ్‌ల అనర్థం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

- బడిపిల్లల భవిష్యత్తుపై జగన్ ట్యాబ్‌ల విష పడగ
- ట్యాబ్‌ల్లోకి డ్యూయల్ సిమ్‌లు.. వాటి ద్వారా నీలి దృశ్యాలు
- పెడదారి పడుతున్న భావిపౌరులు
- ట్యాబ్‌లు వెనక్కు తీసుకోమని తల్లిదండ్రులు, టీచర్ల వినతి

జోయిరుడి..స్ బైజూ'స'

బూతు పురాణం వచ్చింది!?

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 11 : ప్రభుత్వ హైస్కూళ్లలో చదివే 8, 9 తరగతుల విద్యార్థులకు బైజూస్ ద్వారా నాణ్యమైన విద్యను అందించడం కోసం అన్నట్లు వైసీపీ ప్రభుత్వంలో ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర వ్యాప్తంగా 16వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేశారు. జగన్ పుట్టిన రోజు సందర్భంగా రెండు విడతలుగా హడావుడిగా విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ట్యాబ్‌ల ద్వారా పాఠ్యాంశాలు అందించడానికి ఒక్కో విద్యార్థికి రూ.21 వేల చొప్పున బైజూస్ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చారు. జిల్లా పరిధిలో 2022-23 సంవత్సరాల్లో రెండు విడతలుగా మొత్తం 17,747 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

● ఆచరణలో ఘోర వైఫల్యం

ప్రచార ఆర్భాటం కోసం, ఏదో ఒక సంస్థకు లబ్ధి చేకూర్చడం కోసం ఉద్దేశించబడిన ఈ పథకంలో పిల్లల చేతికి ట్యాబ్‌లు అయితే ఇచ్చారు కానీ అవి దుర్వినియోగం కాకుండా చూసే విషయంలో గత వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఈ ట్యాబ్‌ల వల్ల మేలు ఎంత జరిగిందో తెలియదు కానీ చెడు మాత్రం చాలా ఎక్కువగా జరిగిందని, జరుగుతోందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. ట్యాబ్‌లో రెండవ సిమ్ వేసుకునే విధంగా మరమ్మతులు చేసుకొని ఆ సిమ్ ద్వారా ఇంటర్నెట్ కనెక్టు చేసుకొని అశ్లీల దృశ్యాలు చూస్తున్నారు. అమ్మాయిలను ఫొటోలనూ షేర్ చేసుకొంటున్నారు. మొబైల్స్ మరమ్మతులు చేసే షాపుల్లో కాసింత డబ్బులు ఇస్తే ఈ ట్యాబ్‌లు ఇంటర్‌నెట్ కనెక్షన్‌కు, డ్యూయల్‌సిమ్‌కు అనుగుణంగా మార్పు చేసి ఇస్తున్నారు. దీంతో బైజూస్ పాఠ్యాంశాల మాటదేవుడెరుగు చదువు కాస్త కొండెక్కిపోతోందని, విద్యార్థులు చెడిపోతున్నారని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ట్యాబ్‌ల్లో విద్యకు సంబంధించిన ఏ కంటెంట్ లేదు. ప్రభుత్వం మారడంతో బైజూస్ పాఠ్యాంశాలు ఆగిపోయాయి. కానీ జగనన్న జన్మదినం కానుక పేరుతో విద్యార్థుల చేతికి చేరిన ట్యాబ్‌లు ప్రస్తుతం పిల్లల భవిష్యత్తు వక్రమార్గం పట్టడానికి ఆయుధాలుగా మారుతున్నాయనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

పిల్లల భవిష్యత్తు నాశనం



గత ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల వల్ల పిల్లలు నాశనం అయిపోతున్నారు. పిల్లలు నీలి చిత్రాలు చూస్తున్నారు. స్కూళ్లకు తీసుకొచ్చి తోటి విద్యార్థులతో కలిసి గుంపులు గుంపులుగా అశ్లీల దృశ్యాలను వీక్షిస్తున్నారు. మా పాఠశాలకు చెందిన పలువురు తల్లిదండ్రులు కూడా మాకు ఫిర్యాదు చేశారు. వెంటనే ట్యాబ్‌లు వెనక్కు తీసుకోవాలని లిఖిత పూర్వకంగా కోరారు. ఈ ట్యాబ్‌ల వల్ల మంచి కన్నా చెడే ఎక్కువ జరుగుతోంది. వెంటనే వీటిని ప్రభుత్వం వెనక్కు తీసుకోవడం మంచిది.

- తిరుమలయ్య, ప్రధాన కార్యదర్శి పీఆర్టీయూ

విజ్ఞానం కన్నా.. వినాశనమే ఎక్కువ



విజ్ఞానం కోసం పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చామంటున్నారు. కానీ వాటి వల్ల వినాశనమే ఎక్కువ జరుగుతోంది. అధికారులేమో వాటిలో పాఠ్యాంశాలు తప్ప మరేమీ రావు, చూడలేరు అంటున్నారు. కానీ ఎలా చేస్తున్నారో ఏమో ట్యాబుల్లో అన్నీ వస్తున్నాయి. నీలి చిత్రాలు డౌన్‌లోడ్ చేసుకొంటున్నారు. చాటింగ్‌లు చేస్తున్నారు. పాఠాలు కూడా వినకుండా వీటిని పట్టుకొని ఏవేవో చేసుకొంటున్నారు. ఈ ట్యాబ్‌లను వెంటనే వెనక్కు తీసుకోవాలని ప్రస్తుత ప్రభుత్వానికి లేఖ రాశాం.

- బచ్చు డేవిడ్ చినబాబు, అధ్యక్షుడు, ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోషియేషన్, నెల్లూరు.

చదువు కొండెక్కిపోయింది



ఈ ట్యాబ్‌ల వల్ల ఉన్న చదువు కాస్తా కొండెక్కిపోతోంది. పిల్లలు స్కూళ్లలో పాఠాలు వినడం లేదు. ట్యాబ్‌ల్లో అశ్లీల చిత్రాలు చూస్తున్నారు. అమ్మాయిలను వివిధ భంగిమల్లో ఫొటోలు తీస్తున్నారు. పాఠశాలల వాతావరణమే నాశనం అయిపోతోంది. గొడవలు ఎక్కువ అవుతున్నాయి. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా వెంటనే వీటిని వెనక్కు తీసుకోవడం మంచింది.

- శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం

- భూసమస్యలపై ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- 45 రోజులపాటు గ్రామసభల ఏర్పాటుకు నిర్ణయం
- సమస్యల పరిష్కారానికి చర్యలు
- గత ప్రభుత్వంలో అనేక అక్రమాలు
- నాడు గ్రామసభలు లేకుండా భూముల ధారాదత్తం
- ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు బ్రేక్

వీడనున్న అక్రమాల గుట్టు

నెల్లూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పొదలకూరు మండలం భూఅక్రమాలకు నిలయంగా మారింది. ఆ గ్రామం, ఈ గ్రామం అనే తేడా లేకుండా అన్ని గ్రామాల్లోనూ భూరికార్డులను తారుమారు చేసి భారీఅవినీతికి పాల్పడ్డారు. ప్రభుత్వ భూమి అనేది లేకుండా కొట్టేశారు. ప్రభుత్వ భూములతో ఆగని అక్రమార్కులు.. ప్రైవేటు వ్యక్తుల భూములను కూడా చెరబట్టారు. సదరు భూమిపై నిజమైన హక్కుదారుడు ఉన్నప్పటికీ రికార్డుల్లో పేర్లు మార్చి ఉద్దేశపూర్వకంగా రికార్డులు మార్చి వివాదాలు సృష్టించారు. ఇలా చేసి తక్కువ ధరకు ఆ భూములను నొక్కేశారు. ఓ తహసీల్దార్ నిర్వాహకంతో వందలాది భూసమస్యల ఉచ్చులో ఇరుక్కున్నారు. ఆ తహసీల్దార్ పుణ్యమా అని ఒక్కో గ్రామానికి ఓ తహసీల్దార్‌ను విచారణాధికారులుగా నియమించి నాడు భూ అక్రమాలపై విచారణ జరిపించాల్సిన పరిస్థితి తలెత్తింది. అయితే ఈ నివేదికలేవీ నాడు బయటకు రాలేదు. ఆ తహసీల్దార్‌పై చర్యలు తీసుకున్నా ఆయన అవినీతితో ఉత్పన్నమైన సమస్యలు మాత్రం నేటికీ పరిష్కారం కాక రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రజలు కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

● రూరల్‌లో భ్రష్టుపట్టిన రెవెన్యూ

రెవెన్యూ వ్యవస్థ భ్రష్టుపట్టిపోయిన మండలాల్లో నెల్లూరు రూరల్ మండలం ముందు వరుసలో ఉంటుంది. గత ప్రభుత్వంలో ఈ మండలంలో భూసమస్యలు అమాంతం పెరిగిపోయాయి. అధికారులు గ్రీవెన్స్ నిర్వహిస్తే ఎక్కువగా ఈ మండలం నుంచే భూసమస్యలు వచ్చేవి. ఈ క్రమంలో నెల్లూరు రూరల్ మండలం ఒక్కదానికే ప్రత్యేక గ్రీవెన్స్ ను కూడా నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. కొత్తూరు గ్రామంలో ఓ కుటుంబానికి చెందిన మూడెకరాల భూమిని కొందరు అక్రమార్కులు దొడ్డిదారిలో వేరొకరి పేరుపై మార్చేశారు. కొవిడ్ సమయంలో పోలీసులతో బెదిరించి పొజిషన్ కూడా లాక్కున్నారు. అనంతరం ఆ భూమితోపాటు చుట్టుపక్కల భూములను కూడా కలుపుకొని అక్రమంగా లేఅవుట్ వేశారు. నాడు ఆ కుటుంబం ఉన్నతాధికారులను కలిసినా ఫలితం లేకపోయింది. న్యాయవ్యవస్థ ద్వారా విచారణ జరపాల్సి రావడంతో అసలు అక్రమాల పుట్ట బద్ధలైంది. మూడెకరాల కబ్జాపై ఆర్డీవో విచారణ జరపగా మొత్తం 27 ఎకరాలకు సంబంధించిన రికార్డులు మార్చేసి లేఅవుట్ వేసినట్లు నిర్ధారించారు. ఇలా నిర్ధారించి ఏడాది దాటినా ఇంతవరకూ ఈ అక్రమాలపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సాహసించలేదు. ఇలాంటివి రూరల్ మండలంలో అనేకం ఉన్నాయి.

● 15 నుంచి గ్రామసభలు

ఈనెల 15 నుంచి ఈ బృహత్తర కార్యక్రమం మొదలుకా నుంది. 45 రోజులపాటు అధికార యంత్రాంగం ప్రజల ముంగిటకు వెళ్లనుంది. ఏ రోజు ఏ గ్రామంలో గ్రామ సభలు నిర్వహించేది రెవెన్యూ అధికారులు ముందుగానే తెలియజేస్తారు. తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్‌తో పాటు మండల నోడల్ అధికారి గ్రామ సభల్లో పాల్గొంటారు. జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి నోడల్ అధికారి గ్రామసభలను పర్యవేక్షిస్తారు. అన్నీ రకాల భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను ఈ సభల్లో స్వీకరిస్తారు. అక్కడికక్కడే పరిష్కార మయ్యే సమస్యలను వెంటనే పరిష్కరిస్తారు. మిగిలిన వాటిని 45 రోజుల్లో పరిష్కరించేలా ప్రణాళిక రూపొందించారు. భూకబ్జాలు, ఆక్రమణలు, రికార్డులు తారుమారు చేయడం వంటి సమస్యలతో పాటు రీసర్వేతో వచ్చిన సమస్యలను కూడా ఈ గ్రామసభల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లవచ్చు. అర్జీలు తీసుకున్నామా.. వదిలేశామా.. ? అని కాకుండా ప్రతీ సమస్యను లోతుగా పరిశీలించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గత ప్రభుత్వంలో పేదలు అనుభవించిన కష్టాలను గుర్తించిన ఎన్డీయే ప్రభుత్వం.. వాటి పరిష్కారానికి సంచలన నిర్ణయం తీసుకుంది. ఎన్నడూ లేనంతగా గత ఐదేళ్లలో భూసమ స్యలు అమాంతం పెరిగిపోయాయి. పేదలు, ప్రభుత్వ భూములే లక్ష్యంగా అక్రమార్కులు చెలరేగి పోయారు. అధికారం అండతో విచ్చలవిడిగా రికార్డులు మార్చేసి భూములను చెరబట్టారు. ఏళ్ల తరబడి కాళ్లరిగేలా బాధితులు తిరిగినా ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. అలాంటి భూసమస్యలను పరిష్కరిం చేందుకు గ్రామసభలు నిర్వహించాలని తాజాగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.


పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం



● గ్రామసభలు లేకుండా ధారాదత్తం

వైసీపీ ప్రభుత్వం గ్రామసభలు లేకుండానే అసైన్‌మెంట్ పట్టాల పంపిణీతోపాటు ఫ్రీహోల్డ్ హక్కులను కల్పించింది. చుక్కల భూముల మాటున ప్రభుత్వ భూములను కూడా ఆ జాబితా నుంచి తొలగించి భారీ భూకుంభకోణాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఓ వ్యక్తికి అసైన్‌మెంట్ పట్టా ఇస్తున్నా లేక 20 ఏళ్లు దాటిన వారికి ఫ్రీహోల్డ్ హక్కు కల్పిస్తున్నా ముందుగా గ్రామ సభ నిర్వహించాల్సి ఉంది. అప్పుడే నిజమైన అర్హులకు న్యాయం జరుగుతుంది. కానీ అలాకాకుండా అత్యంత గోప్యంగా ఈ ప్రక్రియలు గత ప్రభుత్వంలో జరిగాయి. ఒక గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఆ గ్రామంలోని పేదలకు కాకుండా, వారికి తెలియకుండానే మరో గ్రామానికి చెందిన భూస్వామికి కట్టబెట్టారు. 20 ఏళ్లపాటు ఒరిజినల్ అసైనీదారులు సాగు చేయక పోయినా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారు. ఇలా ఏ గ్రామంలో ఎవరికి భూ పంపిణీ చేశారు..? ఎవరికి ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారు..? అన్నది ఆయా గ్రామస్థులకు కూడా తెలియదు. దీంతో ఈ అక్రమాల బాగోతాన్ని బద్ధలు కొట్టేందుకు ప్రభుత్వం గ్రామసభలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. అప్పటి వరకూ ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించిన భూముల రిజిస్ట్రేషన్లు నిలిపేయాలని రిజిస్ట్రేషన్‌శాఖను ఆదేశించింది.

17న ఉప రాష్ట్రపతి రాక



నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 11: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఈనెల17న జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న ఉదయం 8.35 గంటలకు హైదరాబాద్‌లోని షంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 9.40 గంటలకు రేణిగుంటకు చేరుకుంటారు. 9.50గంటలకు అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 10.30 గంటలకు నెల్లూరులోని పోలీసు పరేడ్ మైదానానికి చేరుకుంటారు. 10.50 గంటలకు అక్కడి నుంచి వెంకటాచలంలోని అక్షర విద్యాలయానికి చేరుకుంటారు. అక్కడ స్వర్ణభారత్ ట్రస్టు ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో ఉప రాష్ట్రపతి పాల్గొంటారని కలెక్టరు వివరించారు. తదుపరి రేణిగుంటకు బయలుదేరుతారని ఆయన పేర్కొన్నారు.

నెల్లూరులో భారీ చోరీ

- 381 గ్రాముల బంగారు, 1,230 గ్రాముల వెండి, రూ.15 వేల నగదు అపహరణ
- తాళం వేసిన ఇంట్లో దొంగల బీభత్సం
- నవాబుపేట ఎఫ్‌సీఐ కాలనీలో ఘటన

నెల్లూరు(క్రైం), ఆగస్టు 11: నెల్లూరు నగరంలో ఇంటికి తాళం వేసి ఉన్నారా..? అయితే మీ ఇల్లు గుల్లయినట్లే. ఇటీవల నగరంలో వరుసగా జరుగుతున్న చోరీల బట్టి చూస్తే ఈ భావన కలుగుతుంది. ఈ క్రమంలోనే నగరంలోని నవాబుపేట ఎఫ్‌సీఐ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో దుండగులు చొరబడి రూ.23 లక్షల విలువ చేసే సొత్తును దోచుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు, నవాబుపేట ఎఫ్‌సీఐ కాలనీలో సుప్రియ, జోసఫ్ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు సంతానం, సుప్రియ తిక్కవరప్పాడులో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. జోసఫ్ నగరంలోని ఓ ప్రైవేటు ఆర్థోపెడిక్ వైద్యశాలలో అసిస్టెంట్ డాక్టర్ గా పనిచేస్తున్నారు. తిరుపతి జిల్లా వాకాడు మండలం తూపిలిపాలెం జోసఫ్ సొంతూరు. తల్లి అనారోగ్యంగా ఉందని తెలిసి శనివారం రాత్రి దంపతులిద్దరూ ఇంటికి తాళం వేసి తూపిలిపాలెం వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా లాకర్ తెరిచి అందులో ఉన్న రూ.23 లక్షలు విలువ చేసే 381 గ్రాముల బంగారు, 1,230 గ్రాముల వెండి వస్తువులు, రూ.15 వేల నగదు, ఇంటి వరండాలో పార్క్ చేసి ఉన్న బైక్‌ను ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం సమీప బంధువు ఇంటికి వచ్చి చూడగా, తాళాలు తెరిచి ఉన్నాయి. ఈ సమాచారాన్ని ఆయన సుప్రియ తల్లి, అన్నలకు తెలియజేయగా వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ ఘటనపై సుప్రియకు సమా చారం అందించారు. బాధితురాలు హుటా హుటిన నెల్లూరుకు చేరుకుని బీరువాలోని లాకర్‌ను పరిశీలించగా బంగారు, వెండి ఆభర ణాలు, నగదు, వరండాలో ఉన్న బైక్ కన్పించలేదు. ఈ ఘటనపై బాధితులు నవాబుపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి, నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్ బాషాలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ వేలి ముద్రలను సేకరించింది. సుప్రియ ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

తాత్కాలికంగా ఇసుక అమ్మకాల నిలిపివేత

మర్రిపాడు, ఆగస్టు 11: స్థానిక యార్డులో అధికారులు ఆదివారం నుంచి ఇసుక అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేశారు. సోమశిల జలాశయం వద్ద జరగబోయే అప్రాన్ పనులకు ఇసుక అవసరం కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో మర్రిపాడు రీచ్ నుంచి 20వేల మెట్రిక్ టన్నులను సోమవారం నుండి అక్కడికి సరఫరా చేస్తున్నట్లు తహసీల్దారు స్వప్న తెలిపారు. రీచ్‌ను ఆమెతోపాటు మైనింగ్ అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం రీచ్‌లో 43వేల మెట్రిక్ టన్నులు ఇసుక ఉండగా సోమశిలకు పంపిన అనంతరం మిగిలిన ఇసుకను యథావిధిగా అమ్మకాలు జరుపుతామని తెలిపారు. ఈ నిర్ణయంతో శనివారం సాయంత్రం వరకు ఇసుక కొనుగోలు చేసి, నగదు చెల్లించిన 120 టిప్పర్లు లోడింగ్ కోసం ఎదురు చూశాయి. లోడింగ్ కాక డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు.



రీచ్ వద్ద బారులు దీరిన టిప్పర్లు

20 నుంచి కొత్త ఓటర్ల నమోదు

● ఎన్‌రోల్‌కు సిద్ధమవుతున్న జిల్లా యంత్రాంగం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 11: జిల్లాలో కొత్త ఓటర్ల నమోదుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈనెల 20 నుంచి కొత్త ఓటర్ల నమోదుకు, పాత ఓటర్ల జాబితాలో సవరణలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. దీని ప్రకారం కొత్త ఓటర్ల నమోదు ఈ సారి ముమ్మరంగా సాగనున్నది. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే వజ్రాయుధం. ఓటును వినియోగించుకుని తమకు నచ్చిన వారిని పాలకులుగా ఎన్నుకొనే అవకాశం మనకుంది. మంచి ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నప్పుడే ప్రజా సమస్యలు తీరుతాయి. సక్రమంగా పనిచేయని వారిని అధికార పీఠం నుంచి దించేయడానికి కూడా ఓటే కీలకం. కొత్త ఓటరుగా నమోదు కావటం, పాత ఓటర్ల జాబితాలో సవరణ కార్యక్రమం నిరంత ప్రక్రియ. ఈ కార్యక్రమాన్ని త్వరలో చేపట్టనున్నారు.

● ఇంటింటి సర్వే

ఈనెల 20వ తేదీ నుంచి బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల నమోదు చేపట్టనున్నారు. వచ్చే ఏడాది జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండేవారు కొత్తగా ఓటరుగా చేరవచ్చు. యువత ఓటు హక్కు నమోదుకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఈ విషయమై జిల్లా రెవెన్యూ అధికారిని వివరణ కోరగా ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు వచ్చాయని, పూర్తి వివరాలు పరిశీలించి తెలియచేస్తామన్నారు.



పగుళ్లిచ్చి.. నెర్రెలు బారింది

● నకిరేకల్లు నుంచి ఏర్పేడు వరకు 565 జాతీయ రహదారి దుస్థితి

● విచ్చలవిడిగా పశువుల సంచారం

● తరుచూ ప్రమాదాలు..



దుత్తలూరు వద్ద పగుళ్లిచ్చి, కుంగిన జాతీయ రహదారి



నర్రవాడ వద్ద నెర్రెలు బారిన రోడ్డు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 11: దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో కొనసాగుతున్న 565 జాతీయ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నకిరేకల్లు నుంచి ఏర్పేడు వరకు ఈ జాతీయ రహదారి విస్తరించి ఉంది. పలు ప్రాంతాల్లో రోడ్డు కుంగి పగుళ్లిచ్చి నెర్రెలుబారాయి. అతివేగంతో వస్తున్న వారు వాటిని గమనించక వాహనాలు అదుపుతప్పడంతో ప్రమాదాలకు గురవుతున్నాయి. పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. కొత్తగా ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు పరిస్థితి తెలియక ప్రమాదాల బారినపడుతున్నారు. ఇందులో కొందరు మృత్యు వాతపడగా అనేక మంది కాళ్లు, చేతులు విరిగి మంచానికే పరిమితం అవుతున్నారు. దీనికితోడు తిమ్మారెడ్డిపల్లి, రామాపురం, వరికుంటపాడు, జడదేవి, నర్రవాడ, దుత్తలూరు, చింతలకుంట, నందిపాడులో రాత్రి, పగలు తేడా లేకుండా పశువుల సంచారం ఉంది. రాత్రి సమయాల్లో వాహనదారులు వీటిని గుర్తించలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వేగని యంత్రణ చర్యలు చేపట్టక పోవడంతోనే ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా పోలేరమ్మ ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠ



శిఖర కలశాలకు పూజలు చేస్తున్న వేదపండితులు

సంగం, ఆగస్టు 11: అన్నారెడ్డిపాలెం పోలేరమ్మ ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠను ఆదివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి క్షీర, పంచామృతాలతో అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశాలను ఆలయం శిఖరంపై ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వేదపండితులు మహాకుంభాభిషేక జలాలను భక్తులపై చల్లారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

కోలగట్ల పెన్నానది ఒడ్డున వెలసిన నాగారపమ్మదేవికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షీర, పంచామృతాలతో అభిషేకాలు చేసి అమ్మవారిని పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం నిర్వాహకులు అన్నదానం చేశారు.



నాగారపమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

జియో బీపీ పెట్రోల్‌బంకు ప్రారంభం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 11: నర్రవాడ సమీపంలోని ఆదివారం జియో బీపీ పెట్రోల్‌బంకును ప్రకాశం జిల్లా కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కోనప్పలు ప్రారంభించారు. వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజల్‌ను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయిస్తామన్నారు. సమీప గ్రామాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెట్రోల్ బంకు నిర్వాహకులు కొప్పోలు సురేష్‌చౌదరి, నాగమేల్లేశ్వరరావు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

యాక్టివ్ సూపర్‌వైజర్ విధుల నుంచి తొలగింపు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 11: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి సెక్టార్ యాక్టివ్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న కళావతిని విధుల నుంచి తొలగించినట్లు ఇన్‌చార్జి సీడీపీవో పద్మావతి తెలిపారు. ఒకే పంచాయతీలోని అంగన్‌వాడీకేంద్రాలను విలీనం చేయాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా మహ్మదాపురం, పాపన్నగారిపల్లి పంచాయతీల అంగన్‌వాడీల కేంద్రాలను విలీనం చేశారు. గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాల మేరకు ఆమెను విధుల నుంచి తొలగించామన్నారు.

భగవద్గీతపై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 11: త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక దుత్తలూరు వారి ఆధ్వర్యంలో ఆదివారం రాచవారిపల్లి, జంగాలపల్లి, తురకపల్లి, భైరవరం గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేసి భగవద్గీత, శ్రీకృష్ణ జన్మాష్టమి గ్రామోత్సవంపై విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ప్రసాద్, కమిటీ సభ్యులు నరసింహులు, రమణమ్మ, వెంకటసుబ్బమ్మ, అక్షయ, భరత్‌కుమార్, రత్తమ్మ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకల నిర్వహణకు రంగం సిద్ధం

● చిన్న పంచాయతీలకు రూ.10వేలు, పెద్ద పంచాయతీలకు రూ.25వేలు

● డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ఉత్తర్వుల జారీ

● కూటమి ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం

ఆత్మకూరు, ఆగస్టు 11 : రాష్ట్రవ్యాప్తంగా 78వ స్వాతంత్ర్య వేడుకలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గతంకంటే భిన్నంగా వేడుకల నిర్వహణకు ఖర్చుచేసుకునే వెసులుబాటును కల్పిస్తూ ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరక్టర్ కృష్ణతేజ స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఖర్చు చేసే వ్యయాన్ని చిన్న పంచాయతీలకు రూ.10వేలు, పెద్ద పంచాయతీలకు రూ.25వేల వరకు పెంచడంతో సర్వత్రా హర్షం వ్యక్తంఅవుతోంది. ఒకప్పుడు ఈ వేడుకలు గ్రామాల్లో మొక్కుబడిగా నిర్వహించేవారు, ఆయా గ్రామాల సర్పంచులు పాఠశాలలకు వెళ్లి జెండాలు ఎగురవేసేవారు. 5వేలలోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.100, అంతకంటే ఎక్కువ జనాభా ఉంటే రూ.250 మాత్రమే సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసుకునే అవకాశం ఉండేది. అయితే డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు ఈ మొత్తాన్ని పెంచారు. వాటిని సాధారణ నిధుల నుంచి వాడుకోవచ్చని ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీ పరిధిలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆగస్టు 15 విశిష్టత, రాజ్యాంగ విలువలు, స్థానిక సంస్థల పాలన తదితర అంశాలపై వ్యాసరచన, క్విజ్, డిబేట్‌తో పాటు ఆటల పోటీలు నిర్వహించాలని ఆదేశాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో ఆగస్టు 15న ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. ప్రభుత్వ నిర్ణయంతో ప్రజాప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘర్షణపై కేసు నమోదు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 11: పట్టణంలో ఓ అద్దె దుకాణం విషయమై జరిగిన ఘర్షణపై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. కూరగాయల మార్కెట్ సమీపంలో షేక్ గాజుల అబ్దుల్‌నబీ సోదరుడు అరాఫత్ సందానీ వద్ద దుకాణాన్ని అద్దెకు తీసుకొని నడుపుకుంటున్నాడు. ఇటీవల అరాఫత్ భార్యకు ఉద్యోగం రావడంతో అబీద్ దుకాణాన్ని తనకు ఇవ్వాలంటూ యజమాని సందానీని అడిగాడు. అతను ఖాళీ చేస్తే ఇస్తానని యజమాని తెలిపాడు. ఈ విషయంపై అబీద్, అబ్దుల్‌నబీ మధ్య శనివారం రాత్రి వివాదం చోటుచేసుకొంది. అబ్దుల్‌నబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

వరికుంటపాడు: స్థానిక మండల కార్యాలయంలో సోమవారం నుంచి మూడురోజుల పాటు సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకట కృష్ణకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల అభివృద్ధిలో భాగంగా పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, విధులు, బాధ్యతలు, అభివృద్ధి ప్రణాళిక అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు



నెల్లూరుపాలెంలో ట్రాఫిక్ సరళిని పరిశీలిస్తున్న సీఐ గంగాధర్‌రావు

ఆత్మకూరు, ఆగస్టు 11: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని సీఐ గంగాధర్‌రావు తెలిపారు. నెల్లూరుపాలెం సెంటర్‌లో ట్రాఫిక్ ప్రక్రియను పరిశీలించామని, త్వరలో ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌నకు అంతరాయం కలుగకుండా దృష్టి సారిస్తామన్నారు. ముందుగా పట్టణంలోని అన్ని ప్రాంతాలను పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళతామని తెలిపారు. శాంతిభద్రతల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు.

ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా..?



రోడ్డును కమ్మేసిన కంపచెట్లు

అనంతసాగరం, ఆగస్టు 11: మండలంలోని గౌరవరం-పల్లవోలు రోడ్డును కంపచెట్లుగా ఏపుగా పెరిగి రోడ్డును కమ్మేస్తున్నాయి. ఈ సమస్యతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వీటితో ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్థులతో పాటు వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సైనికులు, మాజీ సైనికులకు ఉచితంగా రక్త పరీక్షలు

ఆత్మకూరు, ఆగస్టు 11: స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 15న ఉదయం 6గంటల నుంచి ఆత్మకూరులోని అపోలో క్లినిక్ ల్యాబొరేటరీలో సైనికులు, మాజ సైనికులకు ఉచిత రక్త పరీక్షలు నిర్వహిస్తామని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సంధాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. షుగర్ పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలతో పాటు కంప్లీట్ బ్లడ్ కౌంట్ (సీబీసీ), మూత్ర పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. అనంతరం రిటైర్డ్ ఆర్మీ సైనికుడు నాగేశ్వరరావుతో జాతీయ జెండాను ఆవిష్కరిస్తామన్నారు. పరీక్షలు చేయించుకోదలచిన వారు ఏమి తినకుండా రావాలని కోరారు.

బస్సు కోసం ప్రయాణికుల నిరీక్షణ

● బస్‌షెల్టరు లేక అవస్థలు పడుతున్న ప్రజలు



రోడ్డుపైనే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

మర్రిపాడు, ఆగస్టు 11: మండలకేంద్రంలో బస్‌షెల్టరు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మండలంలోనే నెల్లూరు-ముంబయి జాతీయరహదారి ఉండంతో నిత్యం వాహనాలతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. మర్రిపాడు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నెల్లూరు, కడపకు వెళ్లేందుకు, కళాశాలకు వెళ్లేందుకు విద్యార్థులు, వైద్యశాలలు, వ్యాపార లావాదేవీలతో ఇతర ప్రాంతాల నుండి ప్రజలు వస్తుంటారు. వీరికి మండల కేంద్రంలో కూర్చోవటానికి బస్సు షెల్టర్ ఏర్పాటు చేయలేదు. అనువైన స్థలం లేక ఎండకు, వానకు రోడ్డుపై నిలబడి బస్సు ఎక్కాల్సిన దుస్థితి ఉంది. నెల్లూరుకు వెళ్లేందుకు కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కర్నూలు, అనంతపురం, నంద్యాల దూరప్రాంతాల ప్రయాణికులు వెళ్తుంటారు. మర్రిపాడులో టిఫిన్, భోజనాలు చేసేందుకు డ్రైవర్లు బస్సులను ఆపుతుంటారు. ఇక్కడ మరుగుదొడ్ల సౌకర్యం లేక అవస్థలు పడతారు. జిల్లా, రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పి మంత్రి, ఎంపీ పదవులను అనుభవించిన మేకపాటి కుటుంబం మర్రిపాడులో చిన్నపాటి బస్‌షెల్టరు, మరుగుదొడ్లు నిర్మించేందుకు ఆసక్త చూపలేదు. కూటమి ప్రభుత్వం సమస్యను తీరుస్తుందని మండల ప్రజలు ఆశలతో ఎదురు చూస్తున్నారు.

జాతీయ రహదారి పనుల్లో నిబంధనలకు తూట్లు!

● దుమ్ముతో వాహనదారుల అవస్థ



టోల్‌గేట్ నిర్మాణ పనుల వద్ద నీరు పట్టకపోవడంతో లేస్తున్న దుమ్ము

కలిగిరి, ఆగస్టు 11: కావలి-దుత్తలూరు మధ్య జరుగుతున్న జాతీయ రహదారి పనుల్లో పలుచోట్ల రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించకుండా పనులు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రహదారి నిర్మాణ పనుల్లో మట్టి, కంకర మిశ్రమాన్ని లేయర్లుగా వేసే క్రమంలో నీరు సరిగా పట్టకపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించేవారు దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు, పెద్ద వాహనాల వెనుక ద్విచక్ర వాహనదారులు ప్రయాణించాలంటే మట్టికొట్టుకుపోతున్నారు. దుమ్ము వలన లైట్లు వేసుకొని ప్రయాణించాల్సివస్తుందని ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా కలిగిరి సమీపంలో టోల్‌గేట్ నిర్మాణం, పోలంపాడు గ్రామ సమీపంలో చెరువుకట్ట వద్ద రోడ్డు నిర్మాణాల్లో కంకర మిశ్రమానికి నీరు పట్టకపోవడంతో రోడ్డుకి సమీపంలో ఉన్న ఇళ్లల్లోకి దుమ్ము చేరి పేరుకపోతుందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు నిర్మాణ పనుల్లో రోడ్డును 3 నుంచి 4 అడుగుల మేరకు తవ్వినపుడు చివర అంచుల్లో రక్షణ చర్యలు సరిగా చేపట్టకపోవడం వల ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు.

> కావలి, కలిగిరి మధ్య జరుగుతున్న రోడ్డు పనుల్లో కంకర మిశ్రమం చేస్తున్న ప్రదేశాల్లో కాంట్రాక్టర్లు నీరు పట్టకపోవడంతో వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దీనికితోడు సమీపంలో ఉన్న ఇళ్లలోకి దుమ్ము విపరీతంగా వస్తోంది. దుమ్ము కాలుష్యంతో అనారోగ్యాల బారిన పడాల్సివస్తుంది. పోలంపాడు గ్రామం, టోల్‌గేట్ సమీపంలో రహదారి నిర్మాణాల వద్ద దుమ్ము లేవకుండా నీరుపట్టేటట్లు అధికారులు చర్యలు తీసుకొని ఇబ్బందులు తొలగించాలి.
>
> - కల్లూరు చంద్రమౌళి, పోలంపాడు

దుమ్ము లేవకుండా నీరుపట్టాలి

జాతీయ రహదారి కావడం, నిబంధనలు పూర్తిస్థాయిలో పాటించకపోవడం పట్ల సంబంధిత అధికారులు పరిశీలించి రహదారి నిర్మాణ పనుల్లో రోడ్డుపై నీరు పట్టి వాహనాలు వెళ్లేసమయంలో దుమ్ము లేవకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వ్యాపారులకు అండగా ఉంటా..

● బులియన్ మర్చంట్స్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, ఆగస్టు 11: న్యాయంగా వ్యాపారం చేసే ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం కావలిలో జరిగిన కావలి డివిజన్ బులియన్ మర్చంట్స్, పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్‌ల ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వ్యాపారులు, ప్రజలతో కలసి కావలిని అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. నియోజకవర్గానికి 4వేల ఎకరాలలో భారీ ఎత్తున పరిశ్రమలు రాబోతున్నాయని, త్వరితగతిన కావలి పారిశ్రామికంగా అభివృద్ధి చెంది మరో శ్రీసిటీని తలపిస్తోందన్నారు. జువ్వలదిన్నెలో నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ హార్బర్ త్వరలో ప్రారంభం కానుందన్నారు. దగదర్తిలో త్వరలో ఎయిర్‌పోర్టు నిర్మాణం జరుగబోతుందని తద్వారా కావలి నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెట్టబోతుందని చెప్పారు. నూతనంగా ఎన్నికైన బులియన్‌మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మొగళ్ల పల్లి రాజా, పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట రమేష్‌లను ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్‌బాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, నేతలు పోట్లూరు శ్రీనివాసులు, అర్షియా బేగం, తటవర్తి రమేష్, పోతుగంటి శ్రీకాంత్, చవల రామకృష్ణ, తిరువీధి ప్రసాద్, బీజేపీ నేతలు కందుకూరి వెంకటసత్యనారాయణ, సీవీసీ సత్యం, కే. బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

భగత్‌సింగ్ గణేష్‌యూత్ ఆధ్వర్యంలో స్థానిక ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాల పోస్టర్లను ఆదివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆవిష్కరించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం జరుగకుండా వేడుకలను నిర్వహించాలని ఆయన సూచించారు. అలాగే జనతాపేట నార్త్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కంచర్ల టెక్స్‌టైల్స్ దుకాణాన్ని ఆయన ప్రారంభించి వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర సతీమణి విజయకుమారి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆమె పేరు మీదుగా నిరుపేద విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు.

జర్నలిస్ట్ కుటుంబానికి ఆర్థిక సాయం

కావలి రూరల్ : కావలి మండలం రుద్రకోటకు చెందిన జర్నలిస్టు జరుగుమల్లి అనిల్ భౌతికఖాయాన్ని ఆదివారం ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి సందర్శించారు. మృత దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ డైరెక్టర్ భీమా రంగారావు, స్థానిక నాయకులు ఉన్నారు.

కలుషిత నీరే దిక్కు!

● పైపు లైన్ల లీకేజీ ● పట్టించుకోని అధికారులు



రాజావీధిలో లీకవుతున్న తాగునీరు

బిట్రగుంట, ఆగస్టు 11: బోగోలు మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి పథకం పైపులైన్లు లీకేజీలతో కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. దాదాపు పది వేల మందికి పైగా జనాభా ఉన్న బోగోలు పంచాయతీలో అడుగడునా మెయిన్ వాటర్ పైపులైన్ లీకవుతోన్నాయి. పంచాయతీ కార్యాలయం సమీపం నుంచి కుమ్మర వీధి రైల్వే గేట్ వరకు 300 మీటర్ల పొడవులో దాదాపు పది చోట్ల పైపులైన్ లీకేజీలు ఉన్నాయి. ఎప్పుడు ప్రజలతో రద్దీగా ఉండే రాజా వీధిలో స్టేట్ బ్యాంక్, బాబా మందిరం, ప్రాథమిక పాఠశాల, పాల సొసైటీకి వెళ్లే రోడ్డులో పైపులైను లీకై నీరు రోడ్లపై నిల్వ చేరి కలుషితమవుతోంది. దాదాపు 50 ఏళ్ల క్రితం పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి గ్రామంలోకి వేసిన ప్రధాన పైపులైను దెబ్బతినడం వలన పలు చోట్ల వాటర్ లీకేజ్ అవుతోంది. ఎంపీపీ, జడ్పీటీసీలే కాకుండా ప్రధాన పార్టీల మండలాధ్యక్షులు నివశించే పంచాయతీలో తాగునీటి కలుషితంపై మాట్లాడే నాయకుడు లేడు.

● విశ్వనాథరావు పేట పంచాయతీ కొత్తూరులో పలు చోట్ల వాటర్ పైపులైను లీకేజీలు దర్శనమిస్తున్నాయి. వాటి మరమ్మతు విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వాటర్ పైపులైన్ల మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి సర్పంచులకు శిక్షణ

లింగసముద్రం, ఆగస్టు 11 : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో పారిశుధ్యం, వీధిలైట్లు ఏర్పాటు, జీపీడీపీ (రిఫ్రెషర్) అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



తాగునీటి ప్లాంటును ప్రారంభిస్తున్న భానుచందర్

దగదర్తి(బిట్రగుంట), ఆగస్టు 11: దగదర్తి పంచాయతీ ఎస్టీ కాలనీలో తాత, నానమ్మ మాలేపాటి రామానాయుడు, చెంచులక్ష్మమ్మల జ్ఞాపకార్థం వారి మనువడు, టీడీపీ యువ నాయకుడు మాలేపాటి భానుచందర్ నాయుడు నిర్మించిన మినీ నివాటర్ ప్లాంట్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత మాలేపాటి సుధాకర్ నాయుడు, వడ్డే వినయ్ కుమార్, క్రిష్ణయ్య, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్యాలెస్ పాలనతో దారుణ పరిస్థితులు : సోమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం) : చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా మొన్నటి వరకు ప్యాలెస్ నుంచి జరిగిన పాలనతో ప్రజలు చాలా దారుణమైన పరిస్థితులు అనుభవించారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మదనపల్లి ఫైల్స్ ఘటనలో సబ్ కలెక్టర్ కార్యాలయం తగలబడితే సర్వేపల్లిలో ఏకంగా కోర్టులో ఫైల్స్‌నే లేపేశారని ఆరోపించారు.

హర్ ఘర్ తిరంగ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్డీఏ కూటమి నాయకులు

జలదంకి, ఆగస్టు 11: జలదంకిలో ఎన్డీఏ కూటమి నాయకులు ఆదివారం హర్ ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి మువ్వన్నెల జెండాలు చేతబూని బైక్‌లపై పురవీధుల్లో సాగింది. ఈ సందర్భంగా స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన వారి విశిష్టతను వివరించారు. ఈ ర్యాలీలో టీడీపీ మండల అధ్యక్షుడు పీ.మధుమోహన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కంచర్ల శరత్‌నాయుడు, బీజేపీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చల్లా హనుమాన్‌రెడ్డి, జలదంకి ఉపసర్పంచు కూరపాటి మాలకొండారెడ్డి, జడ్పీహైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ మారుబోయిన సుందరయ్య, మండల తెలుగుయువత అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విప్లవ కెరటం గడ్డం కోటారెడ్డి



కోటారెడ్డి స్మారక సభలో పాల్గొన్న విరసం నేతలు

కావలిటౌన్, ఆగస్టు 11: విప్లవ కెరటం కామ్రేడ్ గడ్డం కోటారెడ్డి అని విరసం నేతలు రుక్మిణి, ప్రసాద్‌లు పేర్కొన్నారు. ఆదివారం పాతూరులోని దొడ్లవారి స్థలంలో కామ్రేడ్ గడ్డం కోటారెడ్డి 50వ వర్ధంతి స్మారక సభ విరసం నాయకుడు చెంచయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య వక్తలుగా విరసం నేతలు నల్లూరి రుక్మిణి, సీఎస్ఆర్ ప్రసాద్, వీక్షణం పత్రికా సంపాదకుడు వేణుగోపాల్ పాల్గొని కోటారెడ్డికి నివాళులర్పించారు. కావలి ప్రజలకు కోటారెడ్డి త్యాగాలు పోరాటాలు గుర్తుండిపోయేలా ఆయన స్మారక స్థూపం ఉండాలన్నారు. కార్యక్రమంలో కోటారెడ్డి కుమారుడు కృష్ణారెడ్డి, విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, మాజీ ఏజీపీ పోట్లూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పురస్కార గ్రహీతలకు సత్కారం



పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

కావలిటౌన్, ఆగస్టు 11: వివిధ రంగాల్లో ఉత్తమ సేవకులుగా పురస్కారాలందుకున్న కావలికి చెందిన కావలి పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు రమణయ్య, ఆపద్బాంధవ సేవాట్రస్ట్ బాధ్యులు మధుసూదన్‌రావు, రాజ్యలక్ష్మి దంపతులకు, టైంటు హెల్ప్ సంస్థ అధ్యక్షుడు నందిపాటి రమేష్, తదితరులను ఆదివారం పట్టణంలో స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సత్కరించారు. వేదిక అధ్యక్షుడు ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఖాదర్‌బీ, సోమిశెట్టి బ్రహ్మయ్య, ఘంటసాల రామచంద్రయ్య, ఒట్టూరు మస్తానయ్య, శుభాష్ చంద్రబోష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి భూమిపూజ



శిలలకు పూజలు చేస్తున్న నిర్వాహకులు

కలిగిరి, ఆగస్టు 11: కలిగిరి పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాలెం తిప్ప వద్ద హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవస్థానం నిర్మాణానికి ఆదివారం భూమిపూజ కార్యక్రమం వేదపండితులు వి సూర్యనారయణాచార్యులు ఆధ్వర్యంలో జరిగింది. ఆలయ నిర్మాణం వద్ద జరిగిన హోమాలు, అభిషేకాలు, పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దివ్యాంగుల పాఠశాలకు సరుకుల వితరణ



దివ్యాంగుల పిల్లలతో కమిటీ సభ్యులు

కందుకూరు, ఆగస్టు 11: పట్టణంలోని స్వర్ణ స్వయం కృషి మానసిక దివ్యాంగుల పాఠశాలకు లింగసముద్రం మండలం వీఆర్ కోటకు చెందిన నాగార్పమ్మ యూత్ ఆధ్వర్యంలో రూ.30వేలు విలువజేసే బియ్యం, నిత్యావసర సరుకులు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పాఠశాలలోని చిన్నారులకు భోజన ఏర్పాట్లు చేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.